
# భారత్ శక్తి ®


Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 154 | హైదరాబాద్ | శనివారం 06-12-2025 | పేజీలు : 12 | వెల : 1.00


10లో


సోషల్ మీడియా అంశంలో ప్రపంచ దేశాలు మమ్మల్ని అనుసరించాలి: ఆస్ట్రేలియా

## ద్వైపాక్షిక సహకారంపై మోదీ-పుతిన్ సంయుక్త ప్రకటన..

- భారత్, రష్యా మధ్య 2030 వరకు వాణిజ్య విస్తరణకు ఒప్పందం
- 2030 నాటికి 100 బిలియన్ డాలర్ల ద్వైపాక్షిక వాణిజ్యం లక్ష్యం
- భారత్‌కు నిరంతరాయంగా ఇంధన సరఫరా చేస్తామని పుతిన్ హామీ
- యూరియా, షిప్పింగ్, ఆహార భద్రత రంగాల్లో కీలక అవగాహన ఒప్పందాలు
- ఇండియా నేతృత్వంలోని ఇంటర్నేషనల్ బిగ్ క్యాట్ అలయన్స్‌లో చేరనున్న రష్యా



11లో



## నర్సంపేటలో రూ.532 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

- రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్
- రూ.130 కోట్లతో ప్రభుత్వ వైద్య కళాశాల
- రూ.26 కోట్లతో నర్సింగ్ కాలేజీ

12లో

: సీఎం రేవంత్‌రెడ్డి

## ప్రైవేట్ కంటే ప్రభుత్వ స్కూళ్లల్లోని టీచర్లే బెస్ట్

11లో



## అన్ని కాలాలు మనకు అనుకూలంగా ఉండవు

: సర్పంచ్‌లతో కేసీఆర్

- కొన్ని సమయాల్లో కష్టాలు వస్తాయి... వాటికి వెరవకూడదన్న కేసీఆర్
- గజ్వేల్ పరిధిలోని ఎర్రవెల్లి, నర్సన్నపేట గ్రామాల సర్పంచ్‌లు ఏకగ్రీవం
- మర్యాదపూర్వకంగా కేసీఆర్‌ను కలిసిన సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు

11లో



## దేవాలయాల సంపద దేవుడిదే.. బ్యాంకులకు వాడొద్దు

: సుప్రీంకోర్టు సంచలన తీర్పు

10లో

## పాన్ మసాలాపై కొత్త సెస్సు..

### బిల్లుకు లోక్ సభ ఆమోదం



11లో

- పాన్ మసాలా తయారీ యూనిట్లపై సెస్సు
- జాతీయ భద్రత, ప్రజారోగ్యాన్ని మెరుగుపరిచేందుకు ఉపయోగించాలని నిర్ణయం
- సెస్సును రాష్ట్రాలతో కలిసి పంచు కుంటామని వెల్లడి

## హైకోర్టుకు హాజరై క్షమాపణలు చెప్పిన హైడ్రా కమిషనర్ రంగనాథ్

- నవంబర్ 27న విచారణకు హాజర కాలేకపోయినందుకు క్షమాపణ
- వరదలు సంభవించిన ప్రాంతానికి వెళ్లవలసి వచ్చిందని వెల్లడి
- బతుకమ్మ కుంట కేసు విచారణలో హైకోర్టుకు హాజరు

10లో



## గ్లోబల్ సమ్మిట్‌కు సీఎం చంద్రబాబును ఆహ్వానించిన తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి

11లో



## వక్ఫ్ ఆస్తుల నమోదుకు గడువు పెంపు...

### స్వాగతించిన మంత్రి అజారుద్దీన్

11లో



# బంగారం.. జోస్యం... నిజమవుతుందా

బంగారం ధరలు భారీగా పెరుగుతున్నాయి. ఈ ఏడాది ఇప్పటివరకు 53 శాతం పెరిగాయి. 2026లో 15 నుంచి 30 శాతం మధ్య పెరగవచ్చని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ తెలిపింది. అమెరికా టారిఫ్‌లతో పాటు భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల వేళ పసిడిలో పెట్టుబడులు పెరిగిపోతున్నాయి.ఇన్వెస్టర్లు దీనిపై ఆసక్తి చూపడంతో పాటు పలు దేశాల సెంట్రల్ బ్యాంకులు కూడా బంగారం కొనుగోళ్లు చేస్తున్నాయి. అలాగే, ఆయా దేశాల బ్యాంకులు కీలక వడ్డీ రేట్లపై తీసుకున్న నిర్ణయాలు బంగారం ధరలు పెరిగేందుకు దోహదం చేశాయి.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకుంటున్న విధానపర నిర్ణయాలు విజయవంతమైతే బంగారం ధరలు తగ్గుముఖం పట్టవచ్చని డబ్ల్యూజీసీ చెప్పింది. ప్రపంచ ఆర్థిక అస్థిరత, ద్రవ్యోల్బణం, భౌగోళిక ఉద్రిక్తతలు గత కొన్ని సంవత్సరాలుగా ప్రపంచవ్యాప్తంగా మార్కెట్లను కుదిపేశాయి. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక లేదా రాజకీయ అనిశ్చితి పెరిగినప్పుడల్లా, ప్రజలు తమ డబ్బును సురక్షితంగా ఉంచుకోవడానికి చూస్తారు. అటువంటి పరిస్థితిలో, బంగారాన్ని ఎల్లప్పుడూ సురక్షితమైన స్వర్గధామంగా భావిస్తారు. అందుకే వ్యక్తులు, సంస్థలు స్టాక్ మార్కెట్ తిరోగమనం కంటే బంగారంపై నమ్మకం ఉంచుతున్నారు.మొదటి ప్రధాన కారణం ద్రవ్యోల్బణం. ద్రవ్యోల్బణం పెరిగినప్పుడు, డబ్బు విలువ తగ్గడం ప్రారంభమవుతుంది. అందువల్ల, పెట్టుబడిదారులు తమ డబ్బును బంగారం వంటి స్థిరమైన ఆస్తులలో పెట్టుబడి పెట్టడానికి ఇష్టపడతారు. తద్వారా వారి పొదుపు విలువ తగ్గదు. అందుకే బంగారం డిమాండ్ పెరుగుతూనే ఉంటుంది.మరో ప్రధాన కారణం కేంద్ర బ్యాంకు కొనుగోళు. గత కొన్ని సంవత్సరాలుగా, అనేక దేశాలలోని కేంద్ర బ్యాంకులు తమ విదేశీ మారక నిల్వలలో బంగారం వాటాను పెంచుకున్నాయి. ఉదాహరణకు, భారతదేశం, చైనా, రష్యా, టర్కీ వంటి దేశాలు తమ ఆర్థిక వ్యవస్థలు డాలర్‌పై ఆధారపడటాన్ని తగ్గించడానికి నిరంతరం టన్నుల చొప్పున బంగారాన్ని కొనుగోలు చేస్తున్నాయి.మూడవ కారణం ప్రపంచ రాజకీయ ఉద్రిక్తతలు. ఉక్రెయిన్-రష్యా యుద్ధం, చైనా-అమెరికా వాణిజ్య వివాదం, మధ్యప్రాచ్యంలో అస్థిరత వంటి పరిస్థితులు పెట్టుబడిదారుల విశ్వాసాన్ని బంగారం వైపు మళ్లించాయి. 2008 మాంద్యం అయినా లేదా 2020 మహమ్మారి అయినా, ప్రతి సంక్షోభ సమయంలోనూ బంగారం సురక్షితమైన పెట్టుబడిగా నిరూపించబడిందని చరిత్ర చూపిస్తుంది.స్టాక్ మార్కెట్ అస్థిరంగా ఉన్నప్పుడు, ప్రజలు బంగారాన్ని నమ్మకమైన ఆస్తిగా భావిస్తారు. కేంద్ర బ్యాంకులు కూడా తమ కరెన్సీల స్థిరత్వాన్ని కాపాడుకోవడానికి పెద్ద ఎత్తున బంగారాన్ని కొనుగోలు చేస్తున్నాయి. సగటు భారతీయుడికి, బంగారం కేవలం పెట్టుబడి మాత్రమే కాదు, సంప్రదాయం, భద్రత, ప్రతిష్టకు చిహ్నం.బంగారం ధర పెరుగుదలలో ఈటీఎఫ్‌లు కూడా కీలక పాత్ర పోషిస్తున్నట్లు వివరించింది. ఈ విధానంలో భారీగా పసిడిని కొనుగోలు చేస్తున్నారని చెప్పింది. గ్లోబల్‌గా బంగారం ఈటీఎఫ్‌ల్లోకి సుమారు రూ.6,93,000 కోట్ల పెట్టుబడులు వచ్చాయని చెప్పింది. బంగారం ధరలు పెరగడానికి, తగ్గడానికి చాల అంశాలు తోడవుతాయి. ప్రపంచ రాజకీయ పరిస్థితులు సహా డాలరుతో రూపాయి విలువ కూడా బంగారం ధరల పై ప్రభావం చూపుతాయి. మరోవైపు ఈ ఏడాది మొత్తంగా చూస్తే బంగారం ధర భారీగా పెరిగింది. బంగారంతో పాటు వెండి కూడా కేజీ ధర లక్షకి చేరువలో ఉండగా, ప్రస్తుతం 2 లక్షలకి దగ్గరలో కొనసాగుతుంది.బంగారం కొనేందుకు చూస్తున్న కస్టమర్లకి ప్రస్తుతం ఈ ఏడాది చివరిలో బంగారం ధరల్లో పెద్దగా మార్పు ఉండబోదని నిపుణులు సూచిస్తున్నారు. అయితే వచ్చే ఏడాది ఈ స్థాయికి బంగారం, వెండి ధరలు చేరుకుంటాయో అని అంచనా వేస్తున్నారు. భారతీయ పెట్టుబడిదారులకు బంగారం ఒక దీర్ఘకాలిక ఆస్తిగా మిగిలిపోయింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో హెచ్చుతగ్గులు ఉన్న.. డిమాండ్ స్థిరంగా ఉంది. భవిష్యత్‌లో కూడా బంగారం ఈటీఎఫ్‌ల్లోకి పెట్టుబడులు మరింత పెరిగవచ్చని అంచనా వేసింది. బంగారం ధరలు సామాన్యులను షాక్‌కు గురి చేస్తున్నాయి. ఫెడ్ వడ్డీ రేట్ల తగ్గిస్తారనే అంచనాలతో గోల్డ్ రేట్లల్లో గత కొద్దిరోజుల్లో ఊహించని మార్పులు జరుగుతున్నాయి. నేడు బంగారం, వెండి ధరలు మళ్లీ పెరిగాయి. ఇవాళ తులం బంగారం రూ.1,30,580గా ఉండగా.. వెండి ధర రెండు లక్షల మార్క్‌ను దాటింది. హైదరాబాద్‌లో కేజీ వెండి ధర రూ.2,01,000 వద్ద కొనసాగుతోంది. రానున్న రోజుల్లో బంగారం ధరలు కూడా 2 లక్షలకు చేరుకునే అవకాశముందనే వార్తల క్రమంలో బంగారం వైపు చూడాలంటేనే సామాన్య, మధ్యతరగతి ప్రజలు భయపడే పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో ప్రపంచవ్యాప్తంగా పేరుపొందిన జ్యోతిష్యురాలు అయిన బాబా వంగా గతంలో గేల్డ్ రేట్లపై చెప్పిన జోస్యం ఇప్పుడు సంచలనంగా మారింది. ఆమె ఏం చెప్పారో ఇప్పుడు చూద్దాం.బాబా వంగా మరణించినప్పటికీ.. భవిష్యత్ గురించి ఆమె చెప్పినవన్నీ దాదాపు నిజమయ్యాయి. ఆమె అంచనా వేసినవన్నీ నిజమవుతున్నాయి. తాజాగా బంగారం రేట్లు భారీగా పెరుగుతుండటం, దాని గురించి ఎక్కువమంది చర్చించుకుంటున్న క్రమంలో ఈ విషయంపై బాబా వంగా ఏం చెప్పారనేది సోషల్ మీడియాలో హాట్‌టాపిక్‌గా మారింది. ఆమె అంచనా ప్రకారం.. గోల్డ్ రేట్లు ఊహించనంతగా పెరుగుతాయట. 2026 నాటికి ఏకంగా25 శాతం నుంచి 40 శాతం వరకు పెరిగే అవకాశం ఉందట. ప్రస్తుతం తులం బంగారం లక్షన్నరగా ఉండగా..2026 నాటికి 40 శాతం వరకు పెరగనున్నాయని బాబా వంగా అంచనాలు చెబుతున్నాయి.2026 నాటికి ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక వ్యవస్థ పూర్తిగా ఆస్థిరంగా మారుతుందని, తీవ్రమైన సంక్షోభం ఏర్పడే అవకాశముందని బాబా వంగా అంచనా వేశారు. దీని వల్ల బ్యాంకింగ్ రంగానికి భారీగా నష్టం జరుగుతుందన్నారు. కరెన్సీ విలువ తగ్గిపోవడం, ద్రవ్యత తగ్గడంతో ఆర్థిక వ్యవస్థకు పెనుముప్పు ఏర్పడుతుందని తన అంచనాల్లో పేర్కొన్నారు. దీని వల్ల పెట్టుబడిదారులు బంగారం, వెండిపై ఇన్వెస్ట్ చేస్తారని, ఈ కారణాలతో ఊహించని విధంగా రేట్లు పెరుగుతాయని జోస్యం చెప్పారు.అలాగే 2026 నాటికి ప్రపంచవ్యాప్తంగా భయంకరమైన తుఫాన్లు, సునామీలు, భూకంపాలు ఏర్పడాతాయని, ఇక గ్రహాంతరవాసులతో మానవులకు ప్రత్యక్ష సంబంధాలు ఏర్పడతాయని అంచనా వేశారు. ఇక ఏఐ టెక్నాలజీ అత్యంత ప్రమాదకరంగా మారి మానవ మనుగుడకు ముప్పు తెస్తుందన్నారు.

# మాజీ మంత్రులకు చెక్...

విజయవాడ,డిసెంబర్ 5(భారత శక్తి):

వైయస్ జగన్మోహన్ రెడ్డి పార్టీ పూర్తి ఫోకస్ పెట్టారు. అయితే ఆయన ఇప్పుడు కొందరు మాజీ మంత్రుల విషయంలో కఠినంగా ఉన్నారు. పాత స్థానాలు ఇచ్చే అవకాశం లేదని.. తాను సూచించిన చోటకు వెళ్లాల్సిందేనని తేల్చి చెబుతున్నారు. అయితే ఇదివరకు పరిస్థితి ఉంటే అధినేత చెప్పిన మరుక్షణం వెళ్లేవారు. కానీ ఆయన మాజీ ముఖ్యమంత్రి అయ్యారు. ఆపై క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో తాము వెళ్లలేమని మాజీ మంత్రులు మొండికేస్తున్నట్లు తెలుస్తోంది. ఎన్నికలకు ముందు ఇలానే చెప్పి పంపించారని.. ఇప్పుడు కూడా మాపై ప్రయోగాలు ఏంటి అని మాజీ మంత్రులు అధినేతను ప్రశ్నిస్తున్నారు. ఇలా అయితే పార్టీలో కొనసాగలేమని చెబుతున్నారు. అయితే ఈ పరిస్థితి ఎదుర్కొంటున్న మాజీ మంత్రులు కూటమి పార్టీల్లో చేరలేరు. ఎందుకంటే వీరంతా అధినేత జగన్మోహన్ రెడ్డికి వీర విధేయులు. ప్రత్యర్థులపై చెలరేగిపోయేవారు. అందుకే వీరిని తీసుకునేందుకు ఏ పార్టీ కూడా ముందుకు రావడం లేదు. వైసీపీలో ఉండలేక వీరంతా రాజకీయ సన్యాసం చేసుకునేందుకు సిద్ధపడుతున్నారని తెలుస్తోంది.నెల్లూరు అంటే గతంలో గుర్తుకొచ్చే పేరు అనిల్ కుమార్ యాదవ్. అటువంటి అనిల్ ఇప్పుడు నెల్లూరు జిల్లాలో అనామకుడు. కనీసం పరిగణలో కూడా లేరు. రెండుసార్లు నెల్లూరు సిటీ నుంచి గెలిచిన ఆయన మొన్నటి ఎన్నికల్లో నరసాపురం ఎంపీ స్థానానికి పోటీ చేసి దారుణంగా ఓడిపోయారు. ఆయన ఇప్పుడు తిరిగి నెల్లూరు సిటీని కోరుకుంటున్నారు. జగన్మోహన్ రెడ్డి మాత్రం రకరకాల పేర్లు చెప్పి అక్కడకు వెళ్లాలని సూచిస్తున్నారు. అటు ప్రకాశం, ఇటు గుంటూరులో సీట్లు ఇస్తామని చెబుతుండడంతో చాలా ఆవేదనతో ఉన్నారు అనిల్ కుమార్ యాదవ్. నెల్లూరు సిటీ ఇస్తే రాజకీయాలు చేస్తా.. లేకుంటే మానుకుంటా అన్నట్టు ఉన్నారు పక్క రాష్ట్రంలో వ్యాపారాలు చేసుకుని అప్పుడప్పుడు వచ్చి రాజకీయ విమర్శలు చేసి వెళ్లిపోతున్నారు.మరో మాజీ మంత్రి విడదల రజిని పరిస్థితి కూడా అలానే ఉంది. 2019 ఎన్నికలకు ముందు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి వచ్చి చిలకలూరిపేట టికెట్ కొట్టేశారు. ఎమ్మెల్యే అయిపోయారు కూడా. తరువాత మంత్రి అయ్యారు. ఒక సిట్టింగ్ మంత్రిగా ఉంటూ ప్రజా వ్యతిరేకత ఎదుర్కొంటున్నారని చెప్పి జగన్ ఆమెను గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి పంపించారు. అయితే అక్కడ ఆమె దారుణంగా ఓడిపోయారు. తిరిగి చిలకలూరిపేట వచ్చి రాజకీయాలు చేసుకుంటున్నారు. కానీ ఆమెను ఇప్పుడు రేపల్లె వెళ్ళమంటున్నారు జగన్మోహన్ రెడ్డి. ఉంటే చిలకలూరిపేటలో



రాజకీయం చేస్తాను తప్ప తాను రేపల్లె వెళ్లను అని తేల్చేస్తున్నారు రజని. ఆమె కూడా కూటమి పార్టీలో చేరలేక రాజకీయ సన్యాసమే శరణ్యం అని భావిస్తున్నారు. అయితే ఒక్క ఇద్దరు మాజీ మంత్రులే కాదు. అంబటి రాంబాబు, గుడివాడ అమర్నాథ్, జోగి రమేష్ లాంటి వారు సైతం ఇష్టం లేని నియోజకవర్గాల్లోనే కొనసాగుతున్నారు. అయితే ఇక్కడ ఒకటి గమనించుకోవాలి. ఈ నేతలంతా జగన్మోహన్ రెడ్డికి అత్యంత విధేయులే. విధేయత చూపిన వారికి నచ్చిన పని చేయాలే కానీ.. ఇలా తమపై ప్రయోగం చేయడం ఏంటనేది వీరి వాదన

# సీతారాం... రాం...రాం...



శ్రీకాకుళం, డిసెంబర్ 5(భారత శక్తి):


ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం ప్రస్తుతం సైలెంట్ మోడ్ లోకి వెళ్లిపోయినట్లుంది. అప్పడప్పుడు కనిపిస్తున్నారు. కనీసం తన నియోజకవర్గమైన ఆముదాల వలసలో జరుగుతున్న పరిణామాలపై కూడా తమ్మినేని సీతారాం స్పందించకపోతుండటంపై వైసీపీ హైకమాండ్ అసహనం వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. సీనియర్ నేతగా ఆయన రాష్ట్ర వ్యాప్త సమస్యలపై ఉద్యమించాల్సిన తరుణంలో కనీసం ఆముదాల వలస పరిణామాలపై కూడా స్పందించకపోవడం పై వైసీపీ నాయకత్వం సీరియస్ గా ఉంది. గతంలో ఐదేళ్ల పాటు స్పీకర్ గా ఉన్న తమ్మినేని సీతారం మొన్నటి ఎన్నికలలో ఓటమి పాలయిన ఉత్తరాంధ్రలో కీలకనేత తమ్మినేని సీతారాం సైలెంట్ గా మారడం సహించలేకపోతున్నారు.తమ్మినేని సీతారాం గత కొద్ది రోజుల నుంచి పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. తమ్మినేని సీతారాం రాజకీయ ప్రస్థానం తెలుగుదేశం పార్టీ నుంచి ప్రారంభమయింది. తర్వాత ఆయన 2008లో ప్రజారాజ్యం పార్టీలో చేరారు. 2009 ఎన్నికలలో పోటీ చేసి ఓటమి పాలయిన అనంతరం తిరిగి ఆయన తెలుగుదేశం పార్టీలో చేరారు.అయితే వైసీపీ ఆవిర్భావం తర్వాత తమ్మినేని సీతారాం వైసీపీలో చేరారు. 2014లో ఆముదాల వలస నుంచి పోటీ చేసినా ఓటమి పాలయ్యారు. 2019 ఎన్నికలలో గెలిచి వైసీపీ అధికారంలోకి రావడంతో స్పీకర్ గా పనిచేశారు.

ఐదేళ్ల పాటు ఆయన ఏపీకి స్పీకర్ గా బాధ్యతలను నిర్వర్తించారు.రాజకీయాల్లో ఓటములు సహజం. ఓడిపోయినంత మాత్రాన పార్టీని వదిలేసుకుంటే ఎలా? అన్న ప్రశ్న క్యాడర్ నుంచి వస్తుంది.తమ్మినేని సీతారాంను ఆముదాలవలస ఇన్ ఛార్జి పదవి నుంచి తప్పించి శ్రీకాకుళం పార్లమెంటు నియోజకవర్గ ఇన్ ఛార్జిగా జగన్ నియమించారు. 1999 నుంచి టీడీపీ నుంచి ఆముదాలవలస లో గెలిచిన తమ్మినేని సీతారాంకు తర్వాత ఎమ్మెల్యే కావాడానికి పదేళ్ల సమయం పట్టింది. వైసీపీ నుంచి మూడు సార్లు టిక్కెట్ పొంది ఒక్కసారి మాత్రమే గెలిచారు. తమ్మినేని సీతారాం తన సమీప బంధువు టీడీపీ ఎమ్మెల్యే కూనరవికుమార్ పై కనీసం విమర్శలు చేయడానికి కూడా ఎందుకు వెనకడుగు వేస్తున్నారన్న అనుమానాలు అందరిలోనూ కలుగుతున్నాయి. అలాగని వైసీపీని వీడి వేరే పార్టీలో చేరే అవకాశం కూడా లేదు. ఎందుకంటే తమ్మినేని సీతారాంకు ఏ పార్టీ గేట్లు ఓపెన్ కావు. ఆ విషయం తెలిసి కూడా ఎన్నికలకు ముందు బయటకు వచ్చి చెలరేగిపోవాలని ఆయన చూస్తున్నాడేమోనన్న సెటైర్లు వినిపిస్తున్నాయి.

# ల్యాండ్ బ్యాంక్ కు ఎండ్ ఎప్పుడు

విజయవాడ,డిసెంబర్ 5(భారత శక్తి):

చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన తర్వాత ఒకలా, రాకపోతే మరోలా ఉంటారన్నది అందరూ చెప్పే మాట. ప్రస్తుతం రాజధాని అమరావతి విషయంలో చంద్రబాబు నాయుడు తీసుకుంటున్న నిర్ణయాల వెనక అదృశ్య శక్తి ఏదో ఉందని అంటున్నారు. చంద్రబాబు నాయుడు ఇప్పటి నుంచి కాదు.. సహజంగానే 1995 నుంచి ఆయన ప్రభుత్వ రంగ సంస్థలకు వ్యతిరేకం. ప్రయివేటు సంస్థలతోనే వేగంగా అభివృద్ధి



సాధ్యమవుతుందని నమ్ముతారు. అందుకే ఆయన అధికారంలోకి రాగానే నాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో అనేక ప్రభుత్వ రంగ సంస్థలను మూసివేశారన్నది మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు లాంటి వారు చెబుతున్న మాట. అందులో కొంత నిజమున్నా.. చంద్రబాబు ఆలోచనలు కూడా ఒకరకంగా కరెక్టేనని అనేవారు కూడా అనేక మంది ఉన్నారు.

ప్రభుత్వ రంగంలో ఉండేవారు కష్టించి పనిచేయరని, అదే ప్రయివేటు రంగంలో అయితే ఎక్కువ కష్టపడటమే కాకుండా సంపద సృష్టిలో వారు వేగంగా స్పందిస్తారని భావిస్తారు. అందులో ఏ మాత్రం తప్పులేదు. అయితే రాజధాని అమరావతి విషయంలోనూ చంద్రబాబు దూర దృష్టితోనే భూములను తీసుకుంటున్నారంటున్నారు. ఎందుకంటే.. తొలినాళ్లలో భూములు తీసుకోకపోతే రాజధాని అమరావతి అభివృద్ధి చెందిన తర్వాత అక్కడ భూముల ధరలకు రెక్కలు వస్తాయి. అప్పుడు రైతులు కూడా ఇచ్చేందుకు అంగీకరించరు. అందుకే ముందుగానే అవసరానికి మించి ఎక్కువ కొనుగోలు చేసి ప్రభుత్వం వద్ద ఉంచుకుంటే అది అభివృద్ధికి దోహదపడుతుందని భావిస్తున్నారు.

తన ఆలోచన పవన్ కల్యాణ్ ముందు ఉంచబట్టే ఆయన కూడా ఈ ప్రతిపాదనకు అంగీకరించారంటున్నారు.అందులో భాగంగానే తొలి దశలో 34 వేల ఎకరాలు రైతుల నుంచి సేకరించినా.. రెండో దశలో 16,666 ఎకరాలు తీసుకుంటున్నా.. మూడు.. నాలుగు ఇలా అనేక దశల్లో భూసేకరణ ఉంటుందన్నది ప్రభుత్వ వర్గాల అంచనా. రాజధాని అమరావతిలో నిర్మాణాలు పూర్తి కావడానికి ఇంకా మూడేళ్ల సమయం ఉంది. ఈ మేడేళ్లలో ఇంకొన్ని వేల ఎకరాలను సేకరించి ప్రభుత్వం వద్ద ఉంచుకుంటే భవిష్యత్ ల్యాండ్ బ్యాంక్ గా ఉపయోగపడుతుందని చంద్రబాబు అంచనా వేస్తున్నట్లు అధికారులే చెబుతున్నారు. అయితే అభివృద్ధి ఎక్కడ? అని ప్రశ్నిస్తున్న వారికి ఇప్పుడు సమాధానం చెప్పాల్సిన పనిలేదని, తన పని తాను చేసుకుపోయే పనిలోనే చంద్రబాబు ఉన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకునే భూసమీకరణ అని చెబుతున్నారు. మొత్తం మీద చంద్రబాబు ఆలోచన కరెక్టే అయినా వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ప్రజాప్రతినిధులు విఫమయ్యారనే వారు కూడా ఉన్నారు.

# పవన్ ఫ్యూచర్ ప్లాన్స్...

కాకినాడ, డిసెంబర్ 5(భారత శక్తి):

కూటమిలో ఆయనే కీలకం. ముగ్గురు మంత్రులు, 21 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలు. ఇప్పుడు ఆయన బలం ఇదే. రాబోయే రోజుల్లో రాజకీయంగా ఇంకా బలపడాలనుకుంటున్న సేనాని..తన సైన్యం బలాన్ని మరింత పెంచుకునే పనిలో పడ్డారు. అందుకోసం ఏకంగా ఫైవ్ పాయింట్ ఫార్ములా రెడీ చేశారట. గల్లీ టు ఢిల్లీ..లోకల్ టు లోక్‌సభ వరకు..పార్టీకి ఓ స్ట్రక్చర్ ఉండేలా కమిటీల ఏర్పాటుకు రెడీ అయ్యారట.అధికారంలో ఉన్నామని రిలాక్స్ అవడం లేదు. తాను పని చేస్తున్నారు. పార్టీని బలోపేతం చేయాలని కలలు కంటున్నారు. పది కాలాల పాటు జనసేన పార్టీ ఉండేలా.. స్పెషల్ మాస్టర్ ప్లాన్ రెడీ చేస్తున్నారట ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్. పార్టీకి బలమైన పునాదులు వేసే దిశగా..గ్రామ స్థాయి నుంచి లోక్‌సభ ఎంపీ వరకు..అన్ని స్థాయిల్లో బలమైన కమిటీల ఏర్పాటుకు మిషన్ స్టార్ట్ చేయబోతున్నారట.కూటమిగా పవర్‌లోకి వచ్చి 15 నెలలు అయిపోతున్న టైమ్‌లో ఫ్యూచర్ పాలిటిక్స్‌పై ఫోకస్ పెట్టారు. తనతో సహా గెలిచిన 21 మంది ఎమ్మెల్యే సీట్లను, రెండు పార్లమెంట్ స్థానాలను తిరిగి నిలబెట్టుకోవడంతో పాటు..రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో క్యాడర్, లీడర్ల బలోపేతం కోసం స్పెషల్ యాక్షన్ ప్లాన్ రెడీ చేస్తున్నారట. గ్రామ, మండల, నియోజకవర్గాల వారీగా ఐదుగురు సభ్యులతో కూడిన ఫైవ్ మెన్ కమిటీలు వేసేందుకు సిద్ధమవుతున్నారట పవన్. ఈ కమిటీ ఇటు జనసేన పార్టీ కోసం పని చేయడంతో పాటు..అటు అభివృద్ధి కోసం తమవంతు ప్రయత్నం చేసేలా రూపకల్పన చేస్తున్నారట.జనసేన క్యాడర్, లీడర్లు..పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు అభివృద్ధిలో భాగస్వాములు కావాలి. అభివృద్ధిలో, మౌలిక వసతుల ఏర్పాటులో క్రియాశీలకంగా పనిచేసేలా క్యాడర్, లీడర్లను మోటివేట్ చేస్తూ వస్తున్నారు పవన్. అందులో భాగంగా ఐదుగురు సభ్యుల కమిటీని తెరమీదకు తెచ్చారట. గ్రామ, మండల, శాసనసభ, లోక్‌సభ నియోజకవర్గాల స్థాయిల్లో ఐదుగురు సభ్యులతో కమిటీలు వేస్తామంటున్నారు. ఈ కమిటీ పార్టీ కార్యక్రమాల నిర్వహణతో పాటు అభివృద్ధి పనుల్లోనూ పాల్గొనేలా చేయాలని భావిస్తున్నారు. ప్రతి కమిటీలోనూ మహిళల ప్రాతినిధ్యం తప్పనిసరి అని, ఒకరు లేదా ఇద్దరు వీర మహిళలకు చోటు కల్పించాలని అనుకుంటున్నారుపిఠాపురం నియోజకవర్గంలో



ప్రయోగాత్మకంగా ఐదుగురు సభ్యులతో కమిటీ వేయగా..ఆ కమిటీ పనితీరును పరిశీలించాక..మిగతా అన్ని ప్రాంతాల్లో కమిటీలు వేయాలని పవన్ డిసైడ్ అయ్యారట. సేమ్‌టైమ్ పార్టీ అంతర్గత వ్యవహారాలు, వివాదాల పరిష్కరానికి కూడా..కాన్‌ఫ్లిక్ట్ మేనేజ్‌మెంట్ వింగ్‌ను కూడా ఏర్పాటు చేయబోతున్నారట.పైలెట్ ప్రాజెక్టుగా మొదట ఐదుగురు సభ్యుల కమిటీని పిఠాపురం నుంచి ప్రారంభించారు. పిఠాపురంలో ఆరు నెలల పాటు పరిస్థితులను గమనించిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా ఇదే విధంగా పార్టీని బలోపేతం చేసేందుకు నేతలకు ప్రత్యేక బాధ్యతలను అప్పచెప్పినట్లు సమాచారం. పిఠాపురం మోడల్‌ను త్వరలో మిగతా నియోజకవర్గాల్లో కూడా అమలు చేయబోతున్నారట. ఫ్యూచర్ బేస్డ్ పొలిటికల్ ప్లాన్స్‌లో భాగంగా పార్టీ స్ట్రక్చర్‌పై పవన్ పెడుతున్న ఫోకస్ ఇంట్రెస్టింగ్‌గా మారింది. పిఠాపురం ఎమ్మెల్యేగా ఉన్న ఆయన..తన సీటును పదిలం చేసుకునేందుకు పార్టీకి బలమైన పునాదులు వేసేలా ప్లాన్ స్టార్ట్ చేశారటగోదావరి జిల్లాలను తన రాజకీయ క్షేత్రానికి కేంద్రంగా మార్చుకునేలా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పుడున్న బలం చెక్కుచెదరకుండా ఉండాలంటే..భవిష్యత్‌లో పార్టీ ఇంకా బలపడి ఎదగాలంటే..ప్రజలకు మరింత దగ్గర కావాలన్నది పవన్ వ్యూహమంటున్నారు. అందుకే ఫైవ్ మెన్ కమిటీలను ఏర్పాటు చేసే ఆలోచనకు శ్రీకారం చుట్టారట. పార్టీని తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దేందుకు మాస్టర్ స్కెచ్ రెడీ చేస్తున్నారట పవన్. పంచసూత్ర ద్వారా పవన్ పార్టీని ఎలా బలోపేతం చేస్తారో..ఆ కమిటీలు పార్టీ యాక్టివిటీని, డెవలప్‌మెంట్‌ను ఎలా బ్యాలెన్స్ చేస్తాయో చూడాలి


# పార్లమెంట్ ముందుకు అమరావతి బిల్లు

విజయవాడ,డిసెంబర్ 5(భారత శక్తి):

ధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం, 2014లోని 5(2) సెక్షన్‌ను సవరించే ప్రతిపాదనకు కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ ఇప్పటికే ఆమోదం తెలిపింది. ఈ సవరణ బిల్లును కేంద్ర కేబినెట్ ఆమోదం తర్వాత పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నారు. పార్లమెంట్ ఆమోదం అనంతరం అమరావతిని రాష్ట్ర రాజధానిగా ప్రకటిస్తూ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. ఈ ప్రక్రియ రెండు వారాల్లో పూర్తి కావచ్చని తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 5(2) సెక్షన్ ప్రకారం, హైదరాబాద్‌ను 10 సంవత్సరాలు రెండు రాష్ట్రాలకు ఉమ్మడి రాజధానిగా పేర్కొన్నారు. అయితే, విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌కు కొత్త రాజధాని పేరు ఎక్కడా పేర్కొనలేదు, కేవలం "రెసిడ్యువరీ ఆంధ్రప్రదేశ్ క్యాపిటల్" అని మాత్రమే పేర్కొన్నారు. ఈ లోపం వల్ల రాజధాని విషయంలో చట్టపరమైన అస్పష్టత ఏర్పడింది. 2015లో టీడీపీ ప్రభుత్వం అమరావతిని రాజధానిగా ప్రకటించినా, గెజిట్ నోటిఫికేషన్ జారీ కాలేదు. అసెంబ్లీలో అమరావతిని ప్రతిపక్ష నేతగా జగన్ కూడా ఆమోదించడంతో ఇక రాజధాని సమస్య ఉండదనుకున్నారు.కానీ 2019-2024 మధ్య జగన్ సీఎం అయ్యాక మూడు రాజధానుల విధానం తెరపైకి తెచ్చారు. అమరావతి ప్రాజెక్టును నిలిపివేశారు. దీనికి వ్యతిరేకంగా అమరావతి రైతులు తీవ్ర పోరాటం చేశారు. న్యాయపరంగా కూడా జగన్ ప్రయత్నాలు సాధ్యం కాలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అమరావతిని ఏకైక రాజధానిగా ప్రకటించడంతో, చట్టబద్ధత కల్పించాలని కేంద్రాన్ని కోరింది. మే 8, 2025న ఏపీ కేబినెట్ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో అమరావతిని రాజధానిగా చట్టంలో చేర్చాలి అనే ప్రతిపాదన ఆమోదించారు. ఈ ప్రతిపాదనను కేంద్రానికి పంపారు. తాజా సమాచారం ప్రకారం, కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ ఈ సవరణకు ఆమోదం తెలిపింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదేశాల మేరకు ప్రక్రియ వేగవంతం చేస్తున్నారు.కేబినెట్ సమావేశంలో ఆమోదం తర్వాత, సవరణ బిల్లును వింటర్ సెషన్‌లో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నారు. బిల్లు రెండు సభల్లో ఆమోదం పొందిన తర్వాత, అమరావతిని రాజధానిగా ప్రకటిస్తూ గెజిట్ విడుదల చేస్తారు. ఈ ప్రక్రియ రెండు వారాల్లో పూర్తి కావచ్చని అంచనా. అమరావతిలో రెండో విడత భూసమీకరణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో అమరావతికి గెజిట్ వస్తే రైతులు మరింత ధైర్యంగా భూములు ఇచ్చే అవకాశం ఉంది.

వైసీపీ స్టాండ్ ఏంటీ

రాష్ట్ర విభజన చట్టంలోని పదేళ్లకు మించకుండా ఏపీ, తెలంగాణకు ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్ కొనసాగింది. ఆ గడువు ముగియడంతో తెలంగాణ రాజధానిగా హైదరాబాద్ కొనసాగుతోంది. ఇప్పుడు విభజన చట్టాన్ని సవరిస్తే ఏపీకి కొత్త రాజధాని ఏర్పాటవుతుంది. అప్పుడు అమరావతి అన్‌స్టాపబుల్ అన్న ఎక్స్‌పెక్టేషన్స్ ఉన్నాయి. ఇక పార్లమెంట్‌లో ఎలాగూ ఎన్డీయే పక్షాలకే బలం ఉండటంతో విభజన బిల్లు పాస్ అవడం ఈజీ కానుంది.అయితే అమరావతి బిల్లు పార్లమెంట్‌కు వచ్చినప్పుడు వైసీపీ సభ్యులు మద్దతిస్తారా లేదా అన్నది కూడా ప్రజల్లో చర్చ పెట్టాలని చూస్తోందట కూటమి. భవిష్యత్‌లో మళ్లీ రాజధాని మార్పుపై ఎలాంటి నిర్ణయాలు జరగకుండా ఉండాలనే ఉద్దేశంతోనే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి చట్ట సవరణకు శ్రీకారం చుట్టింది.విభజన చట్టంలోని సవరణ ముసాయిదాకు కేంద్ర న్యాయశాఖ ఇప్పటికే గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ ముసాయిదాను ప్రధాని ఆధ్వర్యంలోని కేంద్ర క్యాబినెట్ ఆమోదించాల్సి ఉంది. కేంద్ర మంత్రివర్గం ఆమోదం తర్వాత, పార్లమెంట్ ఉభయ సభల్లో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదింపజేస్తారు. పార్లమెంట్‌లో ఆమోదం పొందిన




తర్వాత, రాష్ట్రపతి సంతకంతో అమరావతిని ఏపీ రాజధానిగా ప్రకటిస్తూ అధికారికంగా గెజిట్ రిలీజ్ కానుంది.అమరావతికి చట్టబద్ధత కల్పిస్తే..ప్రజల్లో ఉన్న అయోమయానికి చెక్ పెట్టడంతో పాటు ఇన్వెస్టర్లలో నమ్మకం కలగనుంది. డిసెంబర్‌లో జరిగే పార్లమెంట్ సమావేశాల్లో అమరావతి బిల్లు ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఇదే జరిగితే అమరావతికి రాజముద్ర వేస్తూ..కొత్త ఏడాదిలో కేంద్ర ప్రభుత్వం ప్రకటన విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది.

# వియన్ జీవితం స్ఫూర్తిదాయకం

**-జిల్లా సమగ్ర అభివృద్ధిలో వియన్ పాత్ర మరువలేనిది**

**-సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి**

సూర్యాపేట(భారతి శక్తి జిల్లా ప్రతినిధి) డిసెంబర్ 5:నల్లగొండ జిల్లా కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, పీడిత తాడిత పేద ప్రజల హక్కుల కోసం తన జీవితాంతం పోరాటం చేసిన మల్లు వెంకట నరసింహారెడ్డి (వి ఎన్) జీవితం స్ఫూర్తిదాయకం అని సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మల్లు వెంకట



నరసింహారెడ్డి భవన్ లో వియన్ 21 వవర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సంస్మరణ సభలో ఆయన మాట్లాడుతూ నల్లగొండ జిల్లాలో కమ్యూనిస్టు పార్టీని నిర్మించడంలో వి. ఎన్. పాత్ర మరువలేనిది అన్నారు. ఎన్ని ఆటంకాలు వచ్చిన కడదాకా కమ్యూనిస్టు పార్టీని కంటికి రెప్పలా కాపాడిన మహా నాయకుడు వివన్ అన్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో అనేకమంది కార్యకర్తలను తయారుచేసి వారిని నాయకత్వం లోకి తీసుకువచ్చిన గొప్ప నాయకుడు వివన్ అన్నారు. కమ్యూనిస్టు పార్టీలో చీలికలు వచ్చినప్పుడు మొక్కవోని ధైర్యంతో పార్టీని కంటికి రెప్పలా కాపాడిన మహా నాయకుడు వివన్ అన్నారు. నల్లగొండ జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం వి ఎన్ చేసిన పోరాటం మరువలేనిది అన్నారు. నలగొండ జిల్లాలో నాగార్జునసాగర్ ప్రాజెక్టు కట్టాలని అనేక ఉద్యమాలు పోరాటాలు చేసిన ఫలితంగా నాగార్జున సాగర్ డ్యాం నిర్మాణం జరిగిందన్నారు. బీబీనగర్ నుండి నడికుడి వరకు రైలు మార్గం నడపాలని జిల్లాలో పెండింగ్ లో ఉన్న ప్రాజెక్టులు పూర్తి చేయాలని ఏడు దశాబ్దాల పాటు ఉమ్మడి నల్గొండ జిల్లాలో అనేక ఉద్యమాలు నిర్వహించిన నాయకుడు వి ఎన్ అన్నారు.ఎలాంటి ఆడంబరాలకు పోకుండా నిడా రంబర జీవితాన్ని గడిపిన గొప్ప నాయకుడు వివన్ అన్నారు.పదవుల కోసం ఏనాడు పాపులాడకుండా కమ్యూనిస్టు పార్టీ అభివృద్ధికి విశేష కృషి చేశారని అన్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో సిపిఎం పార్టీ బలమైన పార్టీగా తీర్చిదిద్దడంలో వివన్ విశేష కృషి చేశారని అన్నారు. నేటికీ నల్గొండ జిల్లాలో కమ్యూనిస్టు నాయకులుగా ఉన్న వారంతా వివన్ శిష్యులేనని అన్నారు. రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలకు రాష్ట్ర అధ్యక్షులుగా, పనిచేశారని రాష్ట్రంలో రైతాంగం, వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం వేలాది మంది ప్రజలను కదిలించి అనేక ఉద్యమాలు పోరాటాలు నిర్వహించిన గొప్ప పోరాట యోధుడు వివన్ అన్నారు. సిపిఎం పార్టీ కేంద్ర కమిటీ సభ్యునిగా చాలాకాలం పని చేశారని ఆయన ఆశయాన్ని నేటి యువత ముందుకు తీసుకుపోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మట్టిపల్లి సైదులు అధ్యక్షతన జరిగిన ఈ వర్ధంతి సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోట గోపి, జిల్లా కమిటీ సభ్యులు వేల్పుల వెంకన్న,ఎల్గూరి గోవింద్, బెల్లంకొండ వెంకటేశ్వర్లు, మేకన బోయిన శేఖర్ , వీరబోయిన రవి, మద్దెల జ్యోతి, కొప్పుల రజిత, సిపిఎం పార్టీ వన్ టౌన్ కార్యదర్శి వల్లపు దాసు సాయికుమార్ 2 టౌన్ కార్యదర్శి పిండిగా నాగమణి, సిపిఎం సూర్యాపేట రూరల్ మండల కార్యదర్శి మేరెడ్డి కృష్ణారెడ్డి, నాయకులు చిన్న పంగి నరసయ్య, మేకన బోయిన సైదమ్మ, ఎం రాంబాబు, బ త్తుల వెంకన్న, యాతకుల వెంకన్న, సాన బోయిన ఉపేందర్, ఉయ్యాల నగేష్, కంచు గట్ల శ్రీనివాస్, ముక్కెర్ల వెంకన్న, కామల్ల లింగయ్య, ఒట్టే ఎర్రయ్య, సత్యం,యాతాకుల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు

# ఐటీడీఏ పల్స్ యాప్ లాంచ్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 5 (భారత శక్తి) ఆదిలాబాద్ జిల్లాలోని ఐ.టి.డి.ఎ పరిధిలో గల నాలుగు జిల్లాలు ఆదిలాబాదు, నిర్మల్, మంచిర్యాల మరియు ఆసిఫాబాద్ లోని గిరిజన పాఠశాలల్లో/ హాస్టల్ కామన్ డైట్ మెనూ అమలు చేయడానికి ఐటీడిఏ పల్స్ యాప్ ని లాంచ్ చేయడం జరిగింది. ఈ యాప్ ద్వార ఎచ్ ఎం/ఎచ్ డబ్ల్యూ ఓ లు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్ మరియు రాత్రి భోజనం ఫోటోలు అప్లోడ్ చేయడం జరుగుతుంది. ఇప్పటి వరకు ఎచ్ ఎం/ఎచ్ డబ్ల్యూ ఓ లు ఈ యాప్ ని మంచిగా ఉపయోగించి ఫొటోస్ అప్లోడ్ చేస్తున్నారు. ఈ ఐటీడిఏ పల్స్ యాప్ ద్వార ఎచ్ ఎం/ఎచ్ డబ్ల్యూ ఓ పెట్టినటువంటి ఫోటోలు నిత్యం



పర్యవేక్షించడం జరుగుతుంది. ఈ యాప్ లో ఏ వైన సమస్యలు ఉన్నచో ఎప్పటికప్పుడు పరిష్కరించడం జరుగుతుంది మరియు ఆహారంలో నాణ్యత, పరిశుభ్రతను నిర్ధారించడానికి.ఎచ్ ఎం/ఎచ్ డబ్ల్యూ ఓ లు ఫోటోలను అప్లోడ్ చేసిన తర్వాత రోజువారీగా పి ఓ పేషి స్వయంగా పర్యవేక్షిస్తుంది. ఎచ్ ఎం/ఎచ్ డబ్ల్యూ ఓ "ఏ ఐ" ద్వారా అప్లోడ్ చేసిన ఆహార పదార్థాలను వాటి నాణ్యతను పర్యవేక్షిస్తాయి. వచ్చే విద్యా సంవత్సరం నుండి పూర్తిస్థాయిలో అమలు చేయడం జరుగుతుంది.

# అవని కరదీపిక ఆవిష్కరణ

కడప, డిసెంబర్ 5(భారత శక్తి):"ఒక కుటుంబం – ఒక వ్యాపారవేత్త" అన్న నినాదంతో.. స్వయం సహాయక సంఘాల మహిళలను లక్షాధికారులు చేయాలన్న సంకల్పంతో "మెప్మా" సంస్థ రూపొందించిన "అవని" అనే కరదీపికను జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిఆర్ఓ విశ్వేశ్వర నాయుడు, మెప్మా పీడీ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




## ప్రణాళిక ప్రకారం ఇస్తేమా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి: జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి


కడప, డిసెంబర్ 5(భారత శక్తి) : జనవరి 23, 24, 25 తేదీల్లో జిల్లాలో జరగనున్న రాష్ట్ర స్థాయి "శుభే ఆంధ్రాకే ఖురానోకా దీనీ ఇజ్తెమా" కార్యక్రమాన్ని ప్రణాళిక ప్రకారం ప్రశాంతంగా విజయవంతం చేయడానికి అన్ని రకాల ఏర్పాట్లను పక్కాగా చేయాలని.. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధికారులు, ఇజ్తెమా కమిటీ సభ్యులకు సూచించారు.శుక్రవారం జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డితో కలిసి.. కొప్పర్తి పారిశ్రామిక వాడ సమీపంలో 350 ఎకరాల విస్తీర్ణంలో జనవరి 23, 24,



25 తేదీల్లో నిర్వహించనున్న ఇస్తేమా కార్యక్రమ నిర్వహణా ఏర్పాట్ల పరిశీలన నిమిత్తం ఆ ప్రాంతాన్ని పరిశీలించి ఇస్తేమా కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఇస్తేమా నిర్వహణ ఏర్పాట్ల కోసం రూపొందించిన ప్రణాలిక మ్యాపును పరిశీలించారు. రెండు తెలుగు రాష్ట్రాలకు కలిపి అత్యంత ప్రాధాన్యతతో ఈసారి కడప జిల్లాలో ఘనంగా నిర్వహిస్తున్న ఇస్తేమా కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి జిల్లా యంత్రాంగం అన్ని శాఖల సమన్వయంతో సహాయ సహకారాలు అందిస్తోందన్నారు. జనవరి మాసంలో మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని కార్యవర్గ కమిటీ సభ్యులు అధికారులు తమ విధులను బాధ్యతగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు అధికారులు సహకరిస్తారన్నారు. ముఖ్యంగా ఇస్తేమా కార్యక్రమానికి సంబంధించి రోడ్ మ్యాపు, త్రాగునీరు, విద్యుత్, మెడికల్, ట్రాఫిక్, బందోబస్తు, ఫైర్ సేఫ్టీ, బ్యారికెట్స్ తదితర మౌలిక అంశాలపై జిల్లా కలెక్టర్ కమిటీ సభ్యులు, అధికారులకు దిశా నిర్దేశం చేశారు. మూడు రోజులపాటు జరగనున్న రాష్ట్రస్థాయి ఇస్తేమా కార్యక్రమాలను పటిష్టంగా నిర్వహించడానికి పక్కా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే వివిధ రకాల మౌలిక సదుపాయాల కల్పనకు సంబందిత శాఖల అధికారులకు విధులు కేటాయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి ఆంధ్ర ప్రదేశ్ తో పాటు తెలంగాణ, దేశవ్యాప్తంగా ముస్లిం మైనార్టీ పెద్దలు హాజరు కానున్నయని, ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు కార్యవర్గ సమితీలు సమన్వయ సహకారాలతో ముందుకెళ్లాలన్నారు. కమలాపురం ఎమ్మెల్యే కృష్ణ చైతన్య రెడ్డి మాట్లాడుతూ.. భారీస్థాయిలో ప్రజలు హాజరవుతున్న నేపథ్యంలో ఎక్కడా కూడా ఏ చిన్నపాటి అవాంతరాలకు అవకాశం లేకుండా ఇస్తేమా కార్యక్రమాన్ని ప్రశాంత వాతావరణంలో జరగడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు.ఈ కార్యక్రమంలో కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, ఏపి ఐఐసి జెడ్ఎం శ్రీనివాస మూర్తి, డిపివో రాజ్యలక్ష్మి, ఏపీఎస్పీడిసిఎల్ ఎస్ఈ రమణ, ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఈ ఏడుకొండలు, ఆర్ అండ్ బి ఎస్ఈ భాస్కర్ రెడ్డి, తదితర అధికారులు, కమిటీ కార్యవర్గ సభ్యులు నాయకులు తదితరులు పాల్గొన్నారు,

## అనుమతి లేకుండా ప్రజా బహిరంగ కార్యక్రమాలు, సభలు, ర్యాలీలు నిషేధం: జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 5 (భారత శక్తి): నిర్మల్ జిల్లాలో శాంతి భద్రతల దృష్ట్యా, ప్రశాంతత ను పెంపొందించేందుకు 31 డిసెంబర్ 2025 వరకు, జిల్లా అంతటా 30 పోలీస్ యాక్ట్ 1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ ఒక ప్రకటనలో తెలిపారు.



ఈ 30 పోలీస్ ఆక్ట్ 1861 అమలులో ఉన్నందున జిల్లాలో సబ్ డివిజనల్ పోలీస్ అధికారి లేదా పోలీస్ ఉన్నత అధికారుల నుంచి అనుమతి లేకుండా ఎటువంటి పబ్లిక్ మీటింగులు, ఊరేగింపులు,ధర్నాలు జరుపరాదు. నిషేదిత ఆయుధములు అయిన కత్తులు, చాకులు, కర్రలు, జెండా కర్రలు, దుడ్డుకర్రలు, తుపాకులు ప్రేలుడు పదార్థములు, నేరమునకు పురిగొల్పే ఎటువంటి ఆయుధములను వాడరాదు. ప్రజలకు ఇబ్బంది, చిరాకు కలిగించేందుకు దారితీసే పబ్లిక్ మీటింగ్ లను మరియు జనసమూహం పోగు అవుట వంటివి నిషేధం.రాళ్ళను జమ చేయుట, ధరించి సంచరించుట వంటివి నిషేధం. లౌడ్ స్పీకర్ లు, డీజే లు వంటివి కూడా ఈ సమయంలో నిషేధము.నియమాలు ఎవరైనా ఉల్లంఘించిన 30 పోలీస్ యాక్ట్ 1861 కింద శిక్షార్హులు అవుతారని ఎస్పీ పేర్కొన్నారు.

## స్క్రబ్ టైపస్" పట్ల అప్రమత్తత అవసరం: జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

కడప, డిసెంబర్ 5(భారత శక్తి): రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల వ్యాప్తి చెందుతున్న "స్క్రబ్ టైపస్ ఫీవర్" ను అరికట్టేందుకు వైద్యాధికారులు అవసరమైన ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. రాష్ట్ర సచివాలయం నుండి సానుకూల ప్రజా దృక్పథం, ఏజెంట్ స్పేస్ కోసం




డాక్యుమెంట్ అప్‌లోడ్, సీజనల్ వ్యాధులు, ఆరోగ్య శాఖ యొక్క ప్రాధాన్యత అంశాలు, వరి సేకరణ, ఎరువుల సరఫరా, తదితర అంశాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుండి జిల్లా.కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తో పాటు జేసీ అదితి సింగ్ హాజరయ్యారు.సిఎస్ వీసీ ముగిసిన అనంతరం సంబందిత అధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... రాష్ట్ర ముఖ్య కార్యదర్శి సూచనల మేరకు జిల్లాలో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, ప్రత్యేక అమలు కార్యక్రమాలతో పాటు.. ప్రధానంగా సీజనల్ వ్యాధుల వ్యాప్తిని అరికట్టే చర్యలపై దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా ప్రజారోగ్యం, పారిశుద్ధ్యం, సంక్షేమ హాస్టళ్లలో మెరుగైన సదుపాయాలు, మాధకద్రవ్యాల నిరోధం, దేవాలయాల్లో మెరుగైన సేవలు, గ్రామవార్డు సచివాలయాల్లో సేవల మెరుగు.. తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆయా సేవలను మెరుగుపరచాలన్నారు. ఈ విషయంలో అన్ని శాఖల జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో ప్రత్యేక పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై క్రమం తప్పకుండా మీటింగ్స్ నిర్వహించాలన్నారు.అనంతరం "స్క్రబ్ టైపస్ ఫీవర్" వ్యాప్తి నియంత్రణ కోసం వైద్య ఆరోగ్యశాఖ రూపొందించిన గోడపత్రాలను జిల్లా కలెక్టర్ వైద్యాధికారులతో కలిసి ఆవిష్కరించారు.కార్యక్రమంలో డిఆర్వో విశ్వేశ్వర నాయుడు, డిపివో రాజ్యలక్ష్మి, డిఎంహెచ్ వో డా. నాగరాజు, డిసిహెచ్ ఓ డా. హిమదేవి, మెప్మా పీడి కిరణ్ కుమార్, ఐసిడిఎస్ పీడి రమాదేవి, మార్క్ ఫెడ్ సిఎం.పరిమళ జ్యోతి, డిఎవో చంద్రా నాయక్, కెఎంసి కమిషనర్ మనోజ్ రెడ్డి, సంబందిత శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, డిసెంబర్ 5 :సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం నందికంది, కొనాపూర్ గ్రామాలలో శుక్రవారం టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పర్యటించారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన సర్పంచ్ అభ్యర్థుల తరపున ఇంటింటి ప్రచారంలో ఆమె పాల్గొన్నారు. నిర్మల జగ్గారెడ్డి రాక సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు నందికంది గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. నందికంది సర్పంచ్ అభ్యర్థి రేచర్ల స్రవంతి విజయభాస్కర్ రెడ్డి తరపున ఆమె ఇంటింటికి వెళ్లి తమ అభ్యర్థిని గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అనంతరం కోనాపూర్ గ్రామం లో సర్పంచ్ అభ్యర్థి చిరంజి దశరథ్ తరపున నిర్మల జగ్గారెడ్డి ఇంటిటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని, కాంగ్రెస్ పార్టీకి చెందిన అభ్యర్థి ని గెలిపిస్తే నిధులు తీసుకువచ్చి గ్రామాన్ని అభివృద్ధి చేస్తారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచితబస్సు,సన్న బియ్యం, రైతు రుణమాఫీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ లాంటి పథకాలను చూసి ప్రజలు ఓటు వేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిడీసి చైర్మెన్ , బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గడీల రామ్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు సిద్దన్న, సదాశివ పేట మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు చిరంజీవి, పిల్లోడి విశ్వనాథ్, అమర్నాథ్ రెడ్డి, శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలకు పారమిత అభినందించిన చైర్మన్ ప్రసాద్ రావు

కరీంనగర్, డిసెంబర్ 5(భారతశక్తి ప్రతినిధి):

కరీంనగర్ పట్టణంలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఆల్ఫోర్స్ ఈ టెక్నో పాఠశాలలో మూడు రోజుల పాటు నిర్వహించిన బాలల వైజ్ఞానిక ప్రదర్శనలో నగరంలోని పారమిత విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కన భరచి మొదటి స్థానాలు కైవసం చేసుకుని రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలకు ఎంపికయ్యారని విద్యాసంస్థల డైరెక్టర్ అనుకర్ రావు తెలిపారు.

శుక్రవారం పారమిత హెరిటేజ్ పాఠశాలలో 9 వ తరగతి చదువుతున్నవి. వికాస్, పారమిత ఉన్నత పాఠశాలలో 8 వ తరగతి చదువుతున్న ఎం.హరినాథ్ రెడ్డి రాష్ట్ర స్థాయి ఇన్స్పైర్ పోటీలకు ఎంపికయ్యారు. జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో పారమిత హెరిటేజ్ పాఠశాలలో 9 వ తరగతి చదువుతున్న మిహ ముభారక్ వ్యర్థ పదార్థాల నిర్వహణ అనే అంశంపై , పారమిత ఉన్నత పాఠశాలలో 9 వ తరగతి చదువుతున్న 8 వ తరగతి చదువుతున్నకె. రుగ్వేద్ "ఆరోగ్యం పరిరకక్షణ" అనే అంశంపై, అద్భుత ప్రదర్శన ఇచ్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.



రాష్ట్ర స్థాయి ఇన్స్పైర్ పోటీలకు, వైజ్ఞానిక ప్రదర్శనలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ఛైర్మన్ డా: ఇనుగంటి ప్రసాదరావు, పారమిత విద్యాసంస్థల డైరెక్టర్లు ప్రసూన, రాకేష్, రశ్మిత, అనుకర్ రావు, ప్రాచీ, వినోద రావు, వి.యు. యం ప్రసాద్, హనుమంతరావు, ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్, గోపీకృష్ణ, బాలాజి, సమన్వయకర్తలు, గైడ్ టీచర్స్ లలిత్ మోహన్ సాహు, అంజన్ కుమార్, మహేష్, ఉపాధ్యాయులు, విధ్యార్థిని విధ్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

# రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టు సమస్యలు పరిష్కారించాలి:టిజేయు జిల్లా కన్వీనర్ ఎం.గిరి

## - రాష్ట్ర టిజెయు ప్రతినిధులకు గవర్నర్ హామీ

సంగారెడ్డి,భారతశక్తి ప్రతినిధి, డిసెంబర్ 5:

తెలంగాణ రాష్ట%శీ%లో జర్నలిస్ట్ ల సమస్యలు పరిష్కారించటం లో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించటం తగదని టిజేయు జిల్లా కన్వీనర్ ఎం.గిరి పేర్కొన్నారు. రెండు సంవత్సరాలు గడిచినా జర్నలిస్టులకు అప్పటి నుంచి పెండింగ్‌లో ఉన్న హెల్త్ కార్డులు,అక్రెడిటేషన్ కార్డులు, ఇళ్ల స్థలాల విషయాల్లో ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోలేదనిపేర్కొన్నారు. జర్నలిస్టుల సమస్యలు పై టి జే యు రాష్ట్ర అధ్యక్షులు రాష్ట్ర గవర్నర్ వి ష్ణు దేవ్ కలసి వినతిపత్రం అందజేశారన్నారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ.. గత 20 నెలలుగా ప్రభుత్వం కొత్త అక్రెడిటేషన్ కార్డులు జారీచేయకుండా పాత కార్డులనుస్పందించి జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు, హెల్త్ కార్డులు జారీ చేయాలన్నారు. ఆరోగ్యం సమస్యలు ఉన్నా జర్నలిస్ట్ లకు హెల్త్ కార్డులు పని చేయటం లేదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాలు కావస్తున్నా జర్నలిస్టుల సమస్యలు పరిష్కారం కావటం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం కార్యక్రమాలను ప్రజల్లోకి నిత్యం తీసుకెళ్లడం కోస%శీ% నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. జర్నలిస్ట్ సంఘాలు ఏకం కావాలనన్నారు. రాబోవు కాలంలో టిజేయు రాష్ట్ర శాఖ మహా ఉద్యమాలు చేపట్టనున్నదని పేర్కొన్నారు.



GITAM
DEEMED TO BE UNIVERSITY

# గీతంలో అంతర్జాతీయ సదస్సు

## - జంతు అధ్యయనాల నుంచి ఔషధ ఆవిష్కరణ, అనువాద పరిశోధనపై చర్చ

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, డిసెంబర్ 5 :

భారతదేశంలోని ప్రయోగశాల జంతు శాస్త్రవేత్తల సంఘం (ఎల్ఏఎస్ఏ) సహకారంతో గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీలో 'జంతు అధ్యయనాల నుంచి ఔషధ ఆవిష్కరణ, అనువాద పరిశోధన' పేరిట అంతర్జాతీయ సదస్సును ఈనెల 19-20 తేదీలలో నిర్వహించనున్నారు. ఈ 13వ అంతర్జాతీయ ప్రీక్లినికల్ సదస్సుకు ముందురోజు, డిసెంబర్ 18న ఒక కార్యశాలను కూడా ఏర్పాటు చేస్తున్నట్టు నిర్వాహక కార్యదర్శులు డాక్టర్ జి. సుహాసిన్, డాక్టర్ ఎం.జె. మహేష్ కుమార్ శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. ఈ కార్యశాలలో, ప్రీక్లినికల్ పరిశోధన నాణ్యతను పెంపొందించడానికి, శాస్త్రీయ అధ్యయనాలలో ప్రయోగశాల జంతువుల నైతిక, మానవీయ, బాధ్యతాయుతమైన వినియోగాన్ని ప్రోత్సహించడానికి రూపొందించిన ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఎల్ఏఎస్ఏ సభ్యులు, ప్రముఖ శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు, పరిశ్రమ నిపుణులు, ప్రీక్లినికల్, అనువాద పరిశోధనలో నిమగ్నమైన పరిశోధకులకు శక్తివంతమైన వేదికను అందించడం ఈ సదస్సు లక్ష్యమని తెలిపారు. ఈ సమావేశంలో వినూత్న పద్ధతుల మార్పిడిని సులభతరం చేయడంతో పాటు ఇటీవలి శాస్త్రీయ పురోగతులను వెల్లడిస్తుందన్నారు. ఔషధ ఆవిష్కరణ, అభివృద్ధికి మద్దతు ఇచ్చే కీలకమైన అంశాలను అందిస్తుందని తెలిపారు. ఈ రెండు రోజుల సదస్సు విద్యా సంస్థలు, పరిశ్రమలు, పరిశోధన సంస్థలు, నియంత్రణ సంస్థల మధ్య పరస్పర అవగాహనను పెంపొందించి, ప్రోత్సహించడమే గాక, వారి మధ్య సహకారాన్ని పెంపొందిస్తుందన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ నిపుణులు, పరిశోధనా పండితులు, పరిశ్రమ నాయకులు అందించే కీలక ఉపన్యాసాలు, సాంకేతిక ప్రదర్శనలు, ముఖాముఖి చర్చలు, పోస్టర్ల ప్రదర్శన ఉంటాయని తెలియజేశారు.ముందుగా నిర్వహించే కార్యశాల, ప్రధాన సమావేశం రెండింటిలో పాల్గొనడానికి తమ పేర్లు నమోదు చేసుకునే ప్రతినిధులకు ఒకే రిజిస్ట్రేషన్ కిట్ లభిస్తుందన్నారు. ముందుగా వచ్చిన వారికి తొలి ప్రాధాన్యం కింద పరిమిత సంఖ్యలో వసతి సౌకర్యం కల్పిస్తున్నట్టు తెలిపారు. ఈ సదస్సులో మౌఖిక ప్రదర్శనలకు ఆరు, పోస్టర్ల ప్రదర్శనకు 12 అవార్డులను ఇచ్చి సత్కరిస్తామన్నారు. మరిన్ని వివరాలు, పేర్ల నమోదు కోసం www.lasacon2025vizag.com, or www.lasaindia.com. వెబ్ సైట్లను సందర్శించాలని సూచించారు.

# పటిష్ట భద్రతకు ప్రత్యేక ప్రణాళిక

## పోలీసు అధికారులతో సిపి వీడియో కాన్ఫరెన్స్




కరీంనగర్, డిసెంబర్ 5(భారతశక్తి ప్రతినిధి):

గ్రామ పంచాయతీ ఎన్నికలను నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పటిష్ట చర్యలు చేపట్టింది. శుక్రవారం కమిషనరేట్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో పోలీస్ సీపీగౌష్ ఆలం, కరీంనగర్ రూరల్, హుజురాబాద్ డివిజన్ లోని ఉన్నతాధికారులు, క్లస్టర్ ఇంచార్జిలు, రూట్ ఇంచార్జులు, గ్రామ పోలీసు అధికారులందరితో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, ఎన్నికల బందోబస్తు ప్రణాళిక అమలుపై స్టేషన్ హౌస్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎన్నికల అధికారులు చేయవలసిన చేయకూడని పనుల గురించి చిన్న హ్యాండ్‌బుక్‌లెట్‌ను తయారు చేసి అందరికీ అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ బుక్‌లెట్‌లో ఎన్నికల నియమావళి, భద్రతా ప్రణాళికకు సంబంధించిన వివరాలు క్షుణ్ణంగా పొందుపరిచినట్లు సీపీ వెల్లడించారు. రూట్లు, క్లస్టర్ల విభజన, సిబ్బంది మోహరింపు

కమీషనరేట్ పరిధిలోని కరీంనగర్ రూరల్, హుజురాబాద్ డివిజన్లలోని 15 పోలీసు స్టేషన్ల పరిధిని పోలింగ్ కేంద్రాలకు అనుగుణంగా విభజించారు:

రూట్ల సంఖ్య 104,

క్లస్టర్ల సంఖ్య 57, ?క్లస్టర్ ఇంచార్జిలు, 83 మంది అధికారులు ఉన్నారు

గ్రామ పోలీసు అధికారులు క్షేత్రస్థాయిలో అన్ని గ్రామాలు కవర్ అయ్యేలా మొత్తం 309 మందిని నియమించారు.

బందోబస్తు పర్యవేక్షణ

ఎన్నికల ప్రారంభం అయ్యేవరకు క్షేత్రస్థాయిలో ?మొత్తం 508 మంది పోలీసు అధికారులు నిరంతరంగా విధులు నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు. పర్యవేక్షణ బాధ్యతలను ఉన్నతాధికారులకు అప్పగించారు:ల

పర్యవేక్షణ ఏసీపీ స్థాయి 2, ఏసీపీ స్థాయి అధికారులు

పూర్తిస్థాయి పర్యవేక్షణ 4 ఇన్‌స్పెక్టర్లు

క్షేత్రస్థాయి పర్యవేక్షణ 25 మంది ఇన్‌స్పెక్టర్లు, స్టేషన్ల ఎస్సైలు ఉన్నారని చెప్పారు.

రౌడీ షీటర్లపై కఠిన చర్యలు

శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా ఉండేందుకు, కమిషనరేట్ పరిధిలోని రౌడీ షీటర్ల బైండోవర్‌లను పూర్తిగా పూర్తి చేశామని సీపీ తెలిపారు. కదలికలపై నిరంతరం నిఘా ఉంచేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని తెలిపారు.

ఎన్నికలు ప్రశాంతంగా, విజయవంతంగా ముగిసేందుకు ప్రజలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పోలీసు అధికారులకు పూర్తిగా సహకరించాలని సీపీ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీలు వెంకటరమణ , భీంరావు , ఏసీపీ లు శ్రీనివాస్ జి , వేణుగోపాల్ , వాసాల సతీష్ లతో పాటు ఇన్స్పెక్టర్లు ఇతర అధికారులు సిబ్బందిపాల్గొన్నారు.

# మహిళ హక్కులకై ఉద్యమించాలి: ఐద్వా జిల్లా కార్యదర్శి నాగమణి



కరీంనగర్, డిసెంబర్ 5(భారతశక్తి ప్రతినిధి):దేశవ్యాప్తంగా మహిళలు అన్ని రంగాల్లో వివక్షకు గురవుతున్నారని, మహిళా హక్కుల సాధనకై ఐక్య ఉద్యమాలు నిర్వహిస్తామని ఐద్వా జిల్లా కార్యదర్శి కోనేటి నాగమణి అన్నారు.

ఐద్వా 14వ జాతీయ మహాసభలు హైదరాబాద్ నడిబొడ్డున జరగబోతున్నాయని, ప్రచార క్యాంపెయిన్ శుక్రవారం కరీంనగర్ నగరంలో పలు వార్డులలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగమణి మాట్లాడుతూ అడుగడుగున మహిళలు అణచివేతకు, వేధింపులకు గురవుతున్నారని, ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు మహిళలని రాజకీయంగా వాడుకుంటూ అధికారంలోకి వచ్చాక విస్మరిస్తున్నారని అన్నారు. దేశంలో మను ధర్మశాస్త్రం పేరిట మహిళలని అణిచివేస్తూ, మహిళలు వంటింటి కుందేలు గానే ఉండాలని, భావిస్తున్నారని, బేటి బచావో, బేటి పడావో నినాదాలుగానే మిగిలిపోతున్నాయని, దేశంలో మహిళలకు రక్షణ లేకుండా పోతుందని,రోజు రోజుకు మహిళలపై అగాయిత్యాలు,అత్యాచారాలు పెరిగిపోతున్నాయని, అరికట్టవలసిన ప్రభుత్వాలు నిద్రావస్తలో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏదైనా సంఘటనలు జరిగినప్పుడే తూతూ మంత్రంగా హడావిడిగా పర్యటనలు చేసి చేతులు దులుపుకుంటున్నారని. శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టడం లేదని అన్నారు. మహిళల రక్షణకై ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసి నిందితులకు శిక్షలు పడే విధంగా చూడాలని అన్నారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం అనేక సమస్యలపై పోరాడుతుందన్నారు. స్థానిక సమస్యలపై ఐద్వా పోరాడుతోందని అన్నారు. కరపత్రాల ప్రచార క్యాంపియన్ లో అనేక సమస్యలు ఐద్వా బృందం దృష్టికి వచ్చాయని ఆ సమస్యల పరిష్కారానికి ఐద్వా కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా టౌన్ ప్రధాన కార్యదర్శి చేని రోజా లక్ష్మి, రజిని, మానస, సావిత్రి, రాజేశ్వరి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

## ఆ నలుగురి కాబంధహస్తాలోంచి బాపుపేటను కాపాడుదాం:కాంగ్రెస్ పార్లమెంట్ ఇంచార్జి రాజేందర్ రావు

### దోపిడి వ్యవస్థకు చమర గీతం పాడండి



కరీంనగర్, డిసెంబర్ 5(భారతశక్తి ప్రతినిధి):

పారిశ్రామిక ప్రాంతానికి కేంద్ర బిందువైన బావుపేట గ్రామాన్ని ఇకపై బంగారు బాట పట్టిస్తామని గ్రామస్తులు దోపిడీ వ్యవస్థకు చమర గీతం పాడాలని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు పిలుపునిచ్చారు. గ్రానైట్ పరిశ్రమల పరంగా ఎంతో మందికి ప్రయోజనం కలిగించే బావుపేట గ్రామం ఉందని, ఆ ఫలాలు ప్రజలకు అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. అవినీతి రహిత, స్వచ్ఛమైన పాలన అందించేందుకు సర్పంచ్ అభ్యర్థి దీకొండ రవీందర్ ను గ్రామస్తులు భారీ మెజార్టీతో గెలిపించాలని రాజేందర్రావు కోరారు. శుక్రవారం గ్రామపంచాయతీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బావుపేట గ్రామ సర్పంచ్ గా పోటీ చేస్తున్న దీకొండ రవీందర్ కు మద్దతుగా రాజేందర్ రావు ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభించి ప్రచారం నిర్వహించారు. ముందుగా రాజేందర్రావుకు మహిళలు గ్రామస్తులు పూలదండలు వేసి మంగళ హారతులు డప్పు చప్పులతో అపూర్వ స్వాగతం పలికారు. స్వచ్ఛమైన పాలన అందించేందుకు దీకొండ రవీందర్ కు గ్రామస్తులంతా ఓటు వేసి గెలిపించాలని కోరారు. వృద్ధులు మహిళలు గ్రామస్తులను ఇంటింటికి వెళ్లి ఆప్యాయంగా పలకరించారు రాజేందర్ రావు.

ఈ సందర్భంగా రాజేందర్రావు మాట్లాడుతూ తన తండ్రి వెలిచాల జగపతిరావు కరీంనగర్ ఎమ్మెల్యేగా పనిచేసిన కాలంలో బావుపేటను అన్ని రంగాల్లో తీర్చిదిద్దారని పేర్కొన్నారు. బావుపేట గ్రామాన్ని కొందరు మచ్చ తెచ్చే పనులు చేపడుతున్నారని విమర్శించారు. బావుపేట గ్రామాన్ని పారిశ్రామికపరంగా ఎంతో అభివృద్ధి చేస్తామని గ్రామంలో యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఆ నలుగురు వ్యక్తులు బావుపేట గ్రామాన్ని గుప్పిట్లో ఉంచుకొని కోట్లాది రూపాయల అక్రమంగా అర్జిస్తున్నారని ఆరోపించారు. గ్రామస్తులకు చెందాల్సిన ఫలాలను వారి గుప్పెట్లో పెట్టుకొని ఆటలాడుతున్నారని ఆరోపించారు. ఇంకనుంచి ఆటలకు గ్రామస్తులు చమర గీతం పాడాలని కోరారు. గ్రామ ప్రజలను అనేక రకాలుగా ఇబ్బందులు పెడుతూ అక్రమాలకు పాల్పడుతూ దోపిడీ వ్యవస్థను ఏర్పరచుకొని కోట్లాది రూపాయలు దండుకుంటున్నారని మండిపడ్డారు. అక్రమార్కుల భరతం పట్టాలంటే.. దోపిడి వ్యవస్థకు అడ్డుకట్ట వేయాలంటే స్వచ్ఛమైన అవినీతిరహితమైన పాలన అందించేందుకు మీ ముందుకు వచ్చిన దీకొండ రవీందర్ ను గ్రామస్తులు ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. రవీందర్ గెలుపుతో బావు పేట గ్రామాన్ని బంగారు బాట పట్టిస్తామని తాను పూచి ఇస్తున్నానని తాను ముందుండి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి అయ్యేలా చూస్తానని రాజేందర్ రావు హామీ ఇచ్చారు. కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటున్నానని తెలిపారు. ప్రజలే తన కుటుంబమని ఏ ఆపద వచ్చినా ముందుంటానని రాజేందర్రావు పేర్కొన్నారు. బావుపేట గ్రామాన్ని దత్తత తీసుకొని అవినీతి రహిత పాలన అందిస్తానని వెల్లడించారు.. గత పాలకులు బావుపేట ను జేబు సంస్థ గా మార్చారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అభ్యర్థి దీకొండ రవీందరు పలువురు కాంగ్రెస్ నాయకులు గ్రామస్తులు ప్రజలు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వలస కూలీల పిల్లలను గుర్తించండి

### ప్రతి ఒక్కరిని బడిలో చేర్పించాలి

### ఇటుక బట్టీల యజమానులు సహకరించాలి

### జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి




కరీంనగర్, డిసెంబర్ 5(భారతశక్తి ప్రతినిధి): జిల్లావ్యాప్తంగా వలస కూలీలు, కార్మికుల పిల్లలను గుర్తించి ప్రత్యేక పాఠశాలల్లో చేర్పించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో మండల విద్యాధికారులు, ఇటుక బట్టీలు, పరిశ్రమల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ సాధారణంగా వలస కూలీలు ఎక్కువగా పనిచేసే చోటే వర్క్ సైట్ స్కూళ్లు ప్రారంభిస్తారని తెలిపారు. కానీ పిల్లలకు పాఠశాల వాతావరణం ఉండాలనే ఉద్దేశంతో వారి కుటుంబాలకు సమీపంగా ఉన్న పాఠశాలల్లో ప్రత్యేక తరగతిలో బోధిస్తున్నామని అన్నారు. ఇటుక బట్టీలు, పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికుల పిల్లలను గుర్తించి ఈ బడిలో చేర్పించాలని ఆదేశించారు. వారికి పోషకాహారం, దుస్తులు, పుస్తకాలు అందిస్తామని తెలిపారు. ఇటుక బట్టీల యజమానులు సాయంగా పిల్లలకి రవాణా సౌకర్యం కల్పించాలని కోరారు. గత ఏడాది సుమారు 500 మంది వలస కూలీల పిల్లలను ఈ పాఠశాలల్లో చేర్పించి విద్య అందించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ ఏడాది మరింత శ్రద్ధతో ప్రత్యేక పాఠశాలలపై దృష్టి పెట్టాలని అన్నారు. ప్రత్యేక పాఠశాలల్లో చేరిన వలస కార్మికుల పిల్లలకి ఇంగ్లీషులో బోధించాలని సూచించారు. భవిష్యత్తులో వారికి చదువు పట్ల శ్రద్ధ పెరిగి ఎక్కడికి వెళ్ళినా చదువుకునే ఉత్సాహం ఉండేలా తీర్చిదిద్దాలని సూచించారు. బడి బయట ఉన్న పిల్లలను కూడా గుర్తించి బడిలో చేర్పించాలని అన్నారు. ఇప్పటికే 185 మంది పిల్లలను గుర్తించినట్లు విద్యాధికారులు తెలిపారు.

**పదవ తరగతి విద్యార్థులపై దృష్టి పెట్టాలి**

పదవ తరగతి చదువుతున్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి నూరు శాతం ఫలితాలు వచ్చేలా చూడాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మండల విద్యాధికారులను ఆదేశించారు. మండల విద్యాధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి పదవ తరగతి విద్యార్థి పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని అన్నారు. ప్రత్యేక అధికారులు పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న స్పెషల్ క్లాస్ లను పర్యవేక్షించాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు స్లిప్ టెస్టులు నిర్వహిస్తూ బోర్డు పరీక్షలకు సిద్ధం చేయాలన్నారు. మండల విద్యాధికారులు వారానికి రెండు సార్లు ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాలను సందర్శించాలని ఆదేశించారు. విద్యాశాఖ ఆధ్వర్యంలోని పూర్వ ప్రాథమిక పాఠశాలల్లో కనీసం 20 మంది పిల్లల నమోదు తప్పనిసరిగా ఉండాలని అన్నారు. అన్ని పాఠశాలలకు మధ్యాహ్న భోజనం వండేందుకు గ్యాస్ కనెక్షన్లు ఇచ్చామని వాటిని విధిగా ఉపయోగించాలని పేర్కొన్నారు. స్నేహిత ఫిర్యాదుల పెట్టెలను ప్రతి పాఠశాలలో తప్పక నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాధికారి మొండయ్య, విద్యాశాఖ క్వాలిటీ కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, మండల విద్యాధికారులు పాల్గొన్నారు.

## శ్రీకాంత్, సురేందర్ రెడ్డి ల మృతి బాధాకరం

### కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి




కరీంనగర్, డిసెంబర్ 5(భారతశక్తి ప్రతినిధి): పొన్నం శ్రీకాంత్ , బండ సురేందర్ రెడ్డి ల అకాల మరణం అత్యంత బాధాకరమని కుటుంబాలను సీపీఐ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి పరామర్శించారు. కరీంనగర్ నగరంలోని రేకుర్తి,హౌసింగ్ బోర్డు కాలనీ లో నివాసముంటున్న మృతుల కుటుంబాల ఇంటికి వెళ్లి వారి చిత్ర పాటలకు పూలమాలవేసి నివాళ్లర్పించారు. మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. గత మూడు రోజుల క్రితం యాక్సిడెంట్లో మరణించిన గ్రంధాలయ మాజీ చైర్మన్ పొన్నం అనిల్ సోదరుని మరణం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని,అతి చిన్న వయస్సులో శ్రీకాంత్ మరణం కుటుంబానికి ఎంతో బాధ కలిగిస్తుందని, ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండ సురేందర్ రెడ్డి గత కొంత కాలంగా అనారోగ్యానికి గురై చికిత్స పొందుతూ ఆకస్మికంగా మృతి చెందడం వామపక్ష ఉద్యమానికి తీరనిలోటు అన్నారు. తాను సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గా పనిచేస్తున్న సమయంలో వామపక్షాల సమావేశాలలో,ప్రజల పక్షాన నిలబడి సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే అనేక పోరాటాలలో తనతో సురేందర్ రెడ్డి కలిసి పనిచేశారని, ఆయన మరణం జీర్ణించుకోలేని విషయమని, వారి కుటుంబం సభ్యులకు సానుభూతి ప్రకటించారు. పరామర్శించిన వారిలో సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు,బూడిద సదాశివ, అల్గునూర్ మాజీ సర్పంచ్ జె. వి. రమణా రెడ్డి ఉన్నారు.

## ఘనంగా సరస్వతీ మాత దత్తపౌర్ణమి యజ్ఞం



కరీంనగర్, డిసెంబర్ 5(భారతశక్తి ప్రతినిధి):

శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్లో దత్త పౌర్ణమి యజ్ఞం ఘనంగా నిర్వహించారు. స్థానిక నగరంలోని సరస్వతి పాఠశాల ఆవరణలో కార్యదర్శి ఇంజనీర్ కోల అన్నారెడ్డి, మాదాసు నర్సయ్య- లక్ష్మి, ప్రణయ్- నాగరాణి ,యజ్ఞం లో పాల్గొనగ శంకర్ ఆర్యన్ యజ్ఞం గావించారు.

యజ్ఞం హిందూ ధర్మం లో చాలా గొప్పది. ఇది కేవలం పూజ మాత్రమే కాదు. మానవ జీవితానికి అవసరమైన ఆధ్యాత్మిక, శాస్త్రీయ ప్రయోజనాలను కలిగి ఉంటుంది. అని ప్రిన్సిపాల్ సముద్రాల రాజమౌళి తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చక్రవర్తుల రమణాచారి, ఎలగందుల సత్యనారాయణ, మేచినేని దేవేందర్ రావు, గట్టు శ్రీనివాస్, రాపర్తి శ్రీనివాస్, డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, పులాల శ్యామ్,డాక్టర్ నాళ్ల సత్య విద్యాసాగర్, గోలి పూర్ణచందర్, కొత్తూరి ముకుంద%శీ%, గట్టు రాం ప్రసాద్, నడిపెల్లి దీన్ దయాల్ రావు, అప్పిడి వకులాదేవి తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యలపై గవర్నర్‌కు వినతి

### - సానుకూలంగా స్పందించిన గవర్నర్

### - టిజెయు రాష్ట్ర అధ్యక్షులు కప్పర ప్రసాద్



సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, నవంబర్ 5:

రాష్ట్రంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా, తెలంగాణ జర్నలిస్ట్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కప్పరావర ప్రసాద్ తోటి నాయకులు గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను కలిసి వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టుల సమస్యలపై సత్వరమే పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని గవర్నర్ సానుకూలంగా స్పందించారు. ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తోందని నాయకులు గవర్నర్‌కు వివరించారు. ముఖ్యంగా సమాచార %డ% పౌర సంబంధాల గుర్తింపు కమిటీలో డబ్ల్యూ జె ఐ టి జె యు లకు ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. ఐ పి ఆర్ తక్షణమే ప్రాతినిధ్యం ఇవ్వలన్నారు. జర్నలిస్టుల సమస్య పై నిరంతరం పోరాడే యూనియన్ కు మొదటి ప్రాధాన్యత కల్పించలన్నారు. జర్నలిస్ట లు తీవ్ర అన్యాయానికి దారి తీస్తోందని తెలిపారు. అదేవిధంగా, అక్రెడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు, నివాస స్థలాల పంపిణీలో వివక్షత చూపుతున్నారని ఆరోపించారు. అన్ని జర్నలిస్టులకు ఎటువంటి పక్షపాతం లేకుండా న్యాయం చేయాలని గవర్నర్‌ను వారు కోరారు. ఈ సందర్భంగా గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ మాట్లాడుతూ, వినతిపత్రంలోని అంశాలను పరిశీలించి త్వరలోనే తగిన చర్యలు తీసుకుంటామని నాయకులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలోడబ్ల్యూ జె ఐ అధ్యక్షులు రాణా ప్రతాప్,టి జె యు అధ్యక్షులు, ఉపాధ్యక్షులు తాడూరు కరుణాకర్, కార్యదర్శి శివనాద్రి ప్రమోద్ కుమార్,కప్పర ప్రసాద్ రావు,రాజు సుబ్బయ్య,కర్నాకర్,జనరల్ సెక్రటరీ రవికంటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## తాడ్వాయి మండలంలో ఘనంగా సద్గురు శ్రీ శబరి మాతాజీ దివ్య పాదుకా పూజోత్సవంలో పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) డిసెంబర్ 05: శుక్రవారం తాడ్వాయి మండల కేంద్రంలో సద్గురు శ్రీ శబరి మాతాజీ దివ్య పాదుకా పూజోత్సవ వేడుకలు శోభాయమానంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మదన్ మోహన్ ప్రత్యేక పూజల్లో పాల్గొని అమ్మవారి పాదుకాలకు అభిషేకం చేశారు. భక్తుల సమక్షంలో నిర్వహించిన పూజా కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో సాగాయి.

అనంతరం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే మదన్ మోహన్ పాల్గొని, వచ్చిన భక్తులకు స్వయంగా అన్నదానం చేశారు. భక్తులకు సేవ చేయడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే తెలిపారు. స్థానికులు, భక్తులు, సేవక బృందం కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## అంగన్వాడీల్లో విద్యతో పాటే ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ: జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



కరీంనగర్, డిసెంబర్ 5(భారతశక్తి ప్రతినిధి):అంగన్వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్య బోధించడంతో పాటు పిల్లల ఆరోగ్యం, పోషణపై సిబ్బంది ప్రత్యేక దృష్టి సారిస్తారని, పిల్లలను చేర్పించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అలుగునూర్ లోని కాకతీయ కాలనీ అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన శుక్రవారం సభకు జిల్లా కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆటపాటలతో కూడిన అంగన్వాడీ విద్య పిల్లల భవిష్యత్తుకు ఎంతగానో ఉపకరిస్తుందని అన్నారు. అంగన్వాడీల్లో పిల్లల బరువులు, ఎత్తు కొలుస్తూ వారు పరిపూర్ణ ఆరోగ్యంగా ఉండేలా చూస్తారని అన్నారు. పోషకాహారంతో పాటు ఆలనా పాలన చూసే అంగన్వాడి కేంద్రాలలో పిల్లలను చేర్పించాలని సూచించారు. ప్రభుత్వ దవాఖానాలు, ఆరోగ్య కేంద్రాల్లో అన్ని రకాల మందులు అందుబాటులో ఉంటాయని, బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ఈ కేంద్రాల నుంచి ఉచితంగా మందులు స్వీకరించాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణీలు 4 ఏ. ఎన్. సి పరీక్షలు చేయించుకోవాలని, ఎంతో ఖరీదైన టీఫా వంటి స్కానింగ్ సౌకర్యం కూడా ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉందని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఆరోగ్య పరీక్షలు, ప్రసవాలు చేయించుకోవడం ద్వారా డబ్బు ఆదాతో పాటు ఆరోగ్యం బాగుంటుందని సూచించారు. వైద్య ఆరోగ్యశాఖ ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంపును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, మెప్మా పీడీ స్వరూపారాణి, సిడిపిఓ శ్రీలత, తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి, చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ సంపత్, డిహెచ్ఈడబ్ల్యూ కోఆర్డినేటర్ శ్రీలత, సఖి కేంద్రం అడ్మిన్ లక్ష్మి, మెప్మా డీఎంసీ శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు, విద్యార్థులకు ప్రత్యేక దంత వైద్య క్యాంపులుజిల్లాలోని పారిశుద్ధ్య కార్మికులు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రత్యేక దంత వైద్య క్యాంపుల ద్వారా ఉచిత వైద్యం అందించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ప్రభుత్వ దంత వైద్యుల బృందాన్ని ఆదేశించారు. ఇందుకు అవసరమైన ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ లో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి దంత వైద్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ కరీంనగర్ కార్పొరేషన్, జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల్లోని పారిశుద్ధ్య కార్మికులు, మల్టీ పర్పస్ వర్కర్లకు ప్రత్యేక క్యాంపు ద్వారా ఉచిత దంత వైద్య పరీక్షలు చేయాలని అన్నారు. కస్తూరిబా గాంధీ విద్యాలయాలు, మోడల్ స్కూల్, ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులందరికీ దశలవారీగా దంత వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. దంత సమస్యలు ఎక్కువగా ఉన్న వారిని గుర్తించి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో తదుపరి చికిత్స అందజేయాలని అన్నారు. ఇందుకోసం ఒక ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. క్యాంపుల నిర్వహణ, చికిత్స కోసం అవసరమైన దంత వైద్య సిబ్బందిని జిల్లాలోని వివిధ ప్రభుత్వ ఆసుపత్రుల నుండి డిప్యూటేషన్ ద్వారా వినియోగించుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ దంత వైద్యులు అందించిన సేవల ప్రగతి నివేదికను జిల్లా కలెక్టర్ కు అందజేశారు. సమావేశంలో ప్రభుత్వ దంత వైద్య అధికారులు రవి ప్రవీణ్ రెడ్డి, రణదీప్, ప్రవీణ్, రాజు, సతీష్ పాల్గొన్నారు.

# సాయుధ దళాల నిధి సేకరణ ప్రారంభించిన కలెక్టర్

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, డిసెంబర్ 5: డిసెంబర్ 7వ తేదీన సాయుధ దళాల పతాక



దినోత్సవం సందర్భంగా సంగారెడ్డి కలెక్టరేట్ కార్యాలయంలో విరాళాల సేకరణ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రావీణ్య ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... సాయుధ దళాల పతాక నిధికి మొదటి విరాళాన్ని అందించినట్లు పేర్కొన్నారు. దేశ రక్షణ కోసం యువత ముందుకు రావాలన్నారు. భారత సైనిక దళాల దేశభక్తి సాహసం త్యాగాలను ఈ సందర్భంగా కలెక్టర్ కొనియాడారు. ఇటీవల జరిగిన ఆపరేషన్ సింధూర్ ప్రకృతి వైపరీత్యాల సమయంలోను సైనికులు దేశం గర్వించేలా కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఏఐసీసీ తెలంగాణ ఇంఛార్జి మీనాక్షీ నటరాజన్ తో మాజీ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్ రావు

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) డిసెంబర్ 05:



శుక్రవారం ఏఐసీసీ తెలంగాణ ఇంఛార్జి మాజీ పార్లమెంట్ సభ్యురాలు గౌరవ మీనాక్షీ నటరాజన్ తో, ఏఐసీసీ సెక్రెటరీ సచిన్ సావంత్ తో ముఖముఖి లో పాల్గొన్న మాజీ మున్సిపల్ చైర్మన్ మాజీ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్ గుప్తా.

# నేడే శ్రీ మహాశక్తి దేవాలయంలో అయ్యప్ప స్వామి పడిపూజ మహోత్సవం

**-పడి పూజకు సర్వాంగ సుందరంగా ముస్తాబైన శ్రీ మహాశక్తి దేవాలయం**
**-కావేటి పరమేశ్వర్ గురుస్వామి ఆధ్వర్యంలో పడిపూజ**
**-పడిపూజలో పాల్గొననున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్**

కరీంనగర్, డిసెంబర్ 5(భారతశక్తి ప్రతినిధి):

కరీంనగర్ లోని ముగ్గురు అమ్మవార్లు శ్రీ మహాదుర్గ, శ్రీ మహాలక్ష్మి, శ్రీ మహాసరస్వతిల మహిమాన్విత దివ్య క్షేత్రం శ్రీ మహాశక్తి దేవాలయంలో నేడు శనివారం సాయంత్రం 6 గంటలకు చేపట్టే శ్రీ అయ్యప్ప స్వామి పడిపూజ మహోత్సవ వేడుకల కోసం ఆలయం సర్వాంగ సుందరంగా ముస్తాబయింది. శ్రీ శ్రీ శ్రీ జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష విద్యారణ్య పీఠాధిపతులు శ్రీ శ్రీ శ్రీ విద్యారణ్య భారతి స్వామి దివ్య ఆశీస్సులతో పడిపూజ కార్యక్రమాన్ని కావేటి పరమేశ్వర్ గురుస్వామి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించడానికి ఆలయ నిర్వాహకులు విస్తృత ఏర్పాట్లు చేశారు. పడిపూజ కార్యక్రమంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ పాల్గొననున్నారు. పూజ అనంతరం స్వాములకు, వచ్చే భక్తుల కోసం ఎలాంటి లోటుపాట్లు లేకుండా అల్పాహారం ఏర్పాటు చేశారు. పడి పూజ నిర్వహించేందుకు దేవాలయంలో ప్రత్యేక వేదిక ఏర్పాటు చేసి పూలతో వైభవంగా అలంకరించారు. ఆలయాన్ని, పరిసరాలను కూడా వివిధ పూలతో, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. మొదటగా వాస్తు పూజ, గణపతి, సుబ్రహ్మణ్య, దేవత షోడశోపచార పూజ, అయ్యప్ప స్వామి ప్రాణప్రతిష్ఠ, పడి పూజ, అయ్యప్ప స్వామికి అభిషేకం, మంత్రపుష్పం తదితర క్రతువులతో పూజలు నిర్వహించనున్నారు. స్వాములు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. 36వ శబరిమల యాత్ర చేస్తున్న సందర్భంగా పరమేశ్వర్ గురుస్వామి గురించిఉమ్మడి కరీంనగర్ జిల్లానే కాకుండా తెలంగాణ వ్యాప్తంగా అయ్యప్ప దీక్షలో మాల వేయించి, దీక్షకు సంబంధించిన నియమాలు, సందేహాలను నివృత్తి చేసే విషయంలో కావేటి పరమేశ్వర్ గురుస్వామికి ఎంతో గుర్తింపు ఉంది. భక్తులను ఆధ్యాత్మిక మార్గంలో నడిపించి, ఉన్నత స్థితికి చేర్చడంలో కావేటి పరమేశ్వర్ గురుస్వామి కీలక పాత్ర పోషించడంతో, అనేక మంది అయ్యప్ప స్వామి భక్తులు పరమేశ్వర్ గురుస్వామిని దైవ సమానులుగా భావిస్తుంటారు. శ్రీ అయ్యప్ప స్వామి దీక్ష, సమస్త భక్తజనుల ప్రయోజనాల కోసం చేస్తున్న కృషికి జాతీయస్థాయిలో గుర్తింపు పొంది, ఇటీవలే అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచారసభ 2025 సంవత్సరంకుగాను తెలంగాణ రాష్ట్రం నుండి పరమేశ్వర్ స్వామిని ఎంపికచేసి కాంచీపురంలో "అయ్యప్ప సేవ రత్న" అవార్డు ను అందించారు. కావేటి పరమేశ్వర్ గురుస్వామి ఆధ్వర్యంలో చేపట్టే పడిపూజకు ఎంతో ప్రాధాన్యత, విశిష్టత, నిష్ఠ, సమయపాలన, క్రమశిక్షణ ఉంటుంది. పూజచేసిన, ఇరుముడికట్టిన ఎలాంటి దక్షిణ తీసుకోకుండా 36 సంవత్సరాలుగా ఉచితంగానే సేవ చేయడం విశేషం. పేద, ధనిక భేదాలు లేకుండా ఏ స్వామి పిలిచినా తమ ఇంటికెళ్లి పూజ, భజన కార్యక్రమాలు చేస్తూ సేవ చేస్తుంటారు. వృత్తిరీత్యా విశ్రాంత ఉపాధ్యాయుడు అయినా పరమేశ్వర స్వామి టీచర్ గా ఉన్న సమయంలో కూడా అటు స్కూలుకు, ఇటూ విద్యార్థులకు కూడా విద్యా బోధనలు నేర్పుతూ తనకు తోచిన విధంగా సేవ చేస్తూ వచ్చారు. పేద విద్యార్థుల చదువుకు ఎలాంటి ఇబ్బందులు ఉండకూడదని తలచి పాఠశాలలకు



తన మిత్రబృందం ద్వారా బెంచీలు, ఆర్వో ప్లాంట్, ప్రొజెక్టర్లు, అలాగే విద్యార్థులకు నోటు బుక్స్, టెక్స్ట్ బుక్స్ గైడ్స్, పెన్నులు కూడా అందించారు. పదవ తరగతి చదివే ప్రభుత్వ పాఠశాల పిల్లలకు ఉదయం మరియు సాయంత్రం స్టడీ అవర్స్ నిర్వహించి విద్యార్థులకు ఇబ్బందులు రాకుండా టిఫిన్లు, స్నాక్స్ అందించి వారిని ప్రోత్సహించారు. అయ్యప్ప సేవా సమితి ఏర్పాటు చేసి ఎన్నో వేల పడిపూజలు భజనలు చేస్తూ అయ్యప్ప గురుస్వామిలలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకొని నూతనంగా అయ్యప్ప మాల వేసుకొని కన్నె స్వాములకే కాకుండా వివిధ అయ్యప్ప భక్తులకు ఆదర్శంగా నిలిచారు. గతంలో అయ్యప్ప స్వామిని దీక్షాపరులను కించపరిచినప్పుడు, నిరసన కార్యక్రమాలను స్వాములందరితో కలిసి నిర్వహించారు. కరీంనగర్ అయ్యప్ప దేవాలయంలో అయ్యప్ప స్వామికి లక్ష దీపార్చన, సహస్ర ఘటాభిషేకం, అయ్యప్ప స్వామి సప్తాహ నామస్మరణం లాంటి తదితర కార్యక్రమాలను అయ్యప్ప స్వామి దీక్ష పరుల సహాయ సహకారాలతో నిర్వహించారు. ఈ సంవత్సరం 36వ శబరిమల యాత్ర చేస్తున్నటువంటి పరమేశ్వర్ గురుస్వామి యావత్ అయ్యప్ప స్వాములకు ఆదర్శంగా నిలుస్తారు.

# ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలి: జిల్లా ఎన్నికల పరిశీలకులు రవి నాయక్



సూర్యాపేట (భారత శక్తి జిల్లా ప్రతినిధి) డిసెంబర్ 5:

జిల్లాలో నిర్వహించబోయే గ్రామపంచాయతీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని సూర్యాపేట జిల్లా ఎన్నికల పరిశీలకులు రవి నాయక్ అధికారులు శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ తేజస్ నందాలాల్ పవర్ తో కలిసి గ్రామ పంచాయితీ ఎన్నికల నిర్వహణ పై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ విషయంపై రాండమైజేషన్ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మొదటి విడత ఎన్నికలు జరిగే ఆత్మకూరు ఎస్, సూర్యాపేట,జాజిరెడ్డిగూడెం, నాగారం, నూతనకల్, మద్దిరాల, తిరుమలగిరి, తుంగతుర్తి మండలాల్లో లోని ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికల పోలింగ్ విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు,ఓ.పీ.ఓలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. స్థానికత, విధులు నిర్వర్తిస్తున్న మండలం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని, సిబ్బందికి పోలింగ్ విధులను కేటాయించారు. జిల్లాలో మొదటి విడత లో 159 గ్రామ పంచాయతీల సర్పంచ్, 1442 వార్డు స్థానాలకు ఎన్నికల నిర్వహణ కోసం 20 శాతం రిజర్వ్ సిబ్బంది కలుపుకుని ప్రిసైడింగ్ అధికారులు 1683, ఓ.పీ.ఓలు 2260 పోలింగ్ కోసం ర్యాండమైజేషన్ జరిపారు. ఈ ర్యాండమైజేషన్ ప్రక్రియలో అదనపు కలెక్టర్ కే. సీతారామారావు, జడ్పీ సి ఈ ఓ వి వి అప్పారావు,డీపీఓ యాదగిరి, డి ఎల్ పి ఓ నారాయణ రెడ్డి, అధికారులు,తదితరులు పాల్గొన్నారు

# కోమల్ జనని మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని ప్రారంభించిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్

సంగారెడ్డి,భారత శక్తి ప్రతినిధి, డిసెంబర్ 5 :



సంగారెడ్డి పట్టణంలో బైపాస్ లో కోమల్ జనని మల్టీస్పెషల్ హాస్పిటల్ ని స్థానిక ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ప్రారంభించారు. అధునాతన వైద్య సదుపాయాలతో, అన్ని విభాగాల్లో నైపుణ్యం కలిగిన వైద్య బృందంతో ఈ ఆసుపత్రి ఏర్పాటు చేసినట్లు జనని ఆసుపత్రి యాజమాన్యం ఎమ్మెల్యే కి వివరించారు. ప్రభుత్వ ఆసుపత్రిలతో పాటు ప్రైవేట్ రంగ ఆసుపత్రిలు కూడా ఆరోగ్య సేవల విస్తరణలో కీలక పాత్ర పోషిస్తుందని ఎమ్మెల్యే అన్నారు. స్థానిక ప్రజలకు మెరుగైన చికిత్స అందుబాటులోకి రావడం శుభ పరిమాణం అన్నారు. నిర్వాహకులు ఎమ్మెల్యే కు పుష్ప గుచ్ఛంతో స్వాగతం పలికి,శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ బొంగుల విజయలక్ష్మి రవి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గోవర్ధన్ నాయక్, రాకేష్, నాయకులు జీవీ శ్రీనివాస్ ,అఖిల్ తదితరులు ఉన్నారు.

# గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లను పరిశీలించిన టీజీఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, నవంబర్ 5:

ఈ నెల 8,9 వ తేదీలలో ఫ్యూచర్ సిటీ వేదికగా జరగనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ కార్యక్రమ ఏర్పాటు పనులను టీజీఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పరిశీలించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గ్లోబల్ సమ్మిట్ ను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నేపథ్యంలో అందుకు అనుగుణంగా ఏర్పాట్లు అనుగుణంగా చేయాలని ఆమె



అధికారులకు సూచించారు. ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సమ్మిట్ జరిగే ప్రాంతాన్ని పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. వెయ్యి మందికి పైగా గ్లోబల్ డెలిగేట్స్ , 500 కు పైగా కంపెనీ ప్రతినిధులు హాజరుకానుండటంతో వారికి ఎలాంటి ఇబ్బంది కాకుండా ఏర్పాట్లు ఉండాలని ఆమె అధికారులను ఆదేశించారు.

# అంగరంగవైభవంగా అయ్యప్పస్వామి మహా పడిపూజ

## అయ్యప్ప స్వామి నామస్మరణ, కీర్తనలతో మారుమ్రోగిన శివాలయం పీఠం

మణుగూరు, డిసెంబర్ 05 (భారతశక్తి): పట్టణంలోని శ్రీ నీలకంఠేశ్వర స్వామి ఆలయ ఆవరణలో గల శివాలయం పీఠంలో



అయ్యప్పస్వామి మహాపడిపూజ మహోత్సవం యాకయ్య గురుస్వామి, అర్చకులు బాలాజీ శర్మ నేతృత్వంలో అత్యంత వైభవంగా కన్నులపండువగా జరిగింది. గురువారం రాత్రి శివాలయం పీఠంలో అయ్యప్ప మాలలు ధరించిన వర్రే వెంకటేశ్వరరావు ( కిరణ్), కనుకు రమేష్, నరేంద్ర రెడ్డి, నిమ్మనగోటి పుల్లారావు, నిమ్మనగోటి అఖిల్ స్వాముల ఆధ్వర్యంలో అర్చకులు బాలాజీ శర్మ కలశాలు పెట్టి వేద మంత్రోచ్చారణతో అంగరంగ వైభవంగా మహాపడి పూజ కార్యక్రమం నిర్వహించారు. అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన హరిహర తనయుడు తన్మయత్వం చెందేలాగా శరణం శరణం అయ్యప్ప.. స్వామియే శరణం అయ్యప్ప అంటూ అయ్యప్ప స్వామి నామస్మరణతో భజన కీర్తనలతో స్వాములు, భక్తులు పరవశించిపోయారు. పీఠంలో మాలలు ధరించిన స్వాములు గానమృతాలతో భజనలు చేస్తుంటే వీక్షించే భక్తులు అయ్యప్పస్వామి నామస్మరణ చేస్తుంటే శివాలయంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ముందుగా నిత్యపూజలో భాగంగా పీఠంలోని వర్రే వెంకటేశ్వరరావు ( కిరణ్), కనుకు రమేష్, నరేంద్ర రెడ్డి, పుల్లారావు, అఖిల్ స్వాములతో అర్చకులు బాలాజీ శర్మ గౌరమ్మను చేసి గణపతి హెూమం, సమస్త దేవతా ప్రార్థన, కలశాలు ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలతో ప్రాణప్రతిష్ఠ చేశారు. అనంతరం అగ్రగణుడు గణపతి పూజ, అష్టోత్తర శతనామావళి, దూపము, నైవేద్యము, కర్పూర హారతి, శ్రీ సుబ్రహ్మణ్యస్వామి పూజ, అష్టోత్తరశత నామావళి, దూపము, నైవేద్యము, కర్పూర హారతి, శ్రీ అయ్యప్ప స్వామిపూజ,శ్రీ అయ్యప్ప స్వామి అంగపూజ, అష్టోత్తర శత నామావళి పూజ, దూపము, దీపము, నైవేద్యము,హారతి, శ్రీ అయ్యప్ప స్వామి శరణు ఘోషఅయ్యప్ప స్వామికి కలశాలతో అభిషేకము, పంచామృతాలతో అభిషేకాలు, వేద మంత్రాల నడుమ పుష్పాభిషేకం, స్వామివారికి నైవేద్యాన్ని సమర్పించి పడిపూజను నిర్వహించి పడిని వెలిగించారు. అనంతరం మంత్రపుష్పం, ఆత్మ ప్రదక్షణ, భూతనాథ సోత్ర రత్నావళి, మంగళ హారతి,క్షమాపణ మంత్రాన్ని తో పూజా కార్యక్రమాన్నినిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలోపాల్గొన్నారు. భక్తులందరికీ యాకయ్య, విద్యాసాగర్ రెడ్డి గురుస్వాములు తీర్థ ప్రసాదాలు అందించారు. అనంతరం పడిపూజ నిర్వహించిన స్వాములు ఏర్పాటు చేసిన అల్పాహార ప్రసాదంను భక్తులు, స్వాములు స్వీకరించారు. ఈ మహాపడిపూజ మహోత్సవానికి అయ్యప్ప స్వాములు, భక్తులు పాల్గొని అయ్యప్ప నామస్మరణం, భజన పాటలు, భక్తి గీతాలను ఆలపించి పేటతుళ్ళి ఆడారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు సుకలపాటి నాగేశ్వరరావు, బోడ బాలాజీ, మోర్ శ్రీను, సత్తి, మోహన్ లాల్, సదానందం, కన్నె, కత్తి, గద, పెరు స్వాములు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# తాడ్వాయి మండలంలో ఘనంగా సద్గురు శ్రీ శబరి మాతాజీ దివ్య పాదుకా పూజోత్సవంలో పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) డిసెంబర్ 05: శుక్రవారం తాడ్వాయి మండల కేంద్రంలో సద్గురు శ్రీ శబరి మాతాజీ దివ్య పాదుకా పూజోత్సవ వేడుకలు శోభాయమానంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే



మదన్ మోహన్ ప్రత్యేక పూజల్లో పాల్గొని అమ్మవారి పాదుకాలకు అభిషేకం చేశారు. భక్తుల సమక్షంలో నిర్వహించిన పూజా కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో సాగాయి. అనంతరం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే మదన్ మోహన్ పాల్గొని, వచ్చిన భక్తులకు స్వయంగా అన్నదానం చేశారు. భక్తులకు సేవ చేయడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే తెలిపారు. స్థానికులు, భక్తులు, సేవక బృందం కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# బిజెపి బీఆర్ఎస్ పార్టీలకు స్థానిక ఎన్నికలవేళ షాక్! -భారీగా కాంగ్రెస్ పార్టీలో చేరిక

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) డిసెంబర్ 05: (బీజెపి)(బిఆర్ఎస్) పార్టీల నుండి పలువురు నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. తిప్పాపూర్, బిక్నూర్, గ్రామాల నుండి పెద్ద ఎత్తున చేరికలు జరిగాయి. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ కాంగ్రెస్ పార్టీ కండువా వేసి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం, స్థానిక అభివృద్ధి పనులకు ఆకర్షితులై శుక్రవారం తమ పార్టీలను వదిలేసి అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన 'అభయహస్తం' (ఆరు గ్యారెంటీలు) వంటి సంక్షేమ పథకాలు ప్రజల మద్దతును కూడగట్టడంతో పాటు, ప్రతిపక్ష పార్టీల నాయకులను ఆకర్షిస్తున్నాయని తెలిపారు. జరుగుతున్న



స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించి అభివృద్ధికి బాటలు వేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో బిక్కనూరుకు చెందిన రాజబాబు గౌడ్, బిజెపి నాయకులు కార్యకర్తలు 150 మందితో కాంగ్రెస్ పార్టీలో చేరారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కన్న తల్లి కర్కశం

దేవరకొండ డిసెంబర్ 5, భార్యాభర్తల మధ్య ఉన్న విభేదాలతో ఓ కన్నతల్లి తన ఐదు నెలల వయసు ఉన్న కుమారుడిని అడవి శాఖ వాహనంలో వదిలి వెళ్ళిన ఘటన గురువారం నల్గొండ జిల్లా దేవరకొండ పట్టణంలో జరిగింది ఈ ఘటనకు సంబంధించి పోలీసులు ఐసిడిఎస్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం దేవరకొండ అటవి శాఖ అధికారులు గురువారం సాయంత్రం డిండి రోడ్డు వైపు వెళ్తూ తాటికోల్ ఎక్స్ రోడ్డు వద్ద తమ వాహనాన్ని రోడ్డు పక్కనే ఆపి టీ తాగేందుకు వెళ్లారు ఆ క్రమంలో ఒక మహిళ ఐదు నెలల వయసు గల బాలుడిని జీపు సీట్లో వదిలిపెట్టి వెళ్ళింది టీ తాగి జీప్ దగ్గరికి వచ్చిన అడవి శాఖ అధికారులు జీపులో శిశువు ఏడుస్తూ కల్పించాడు దాంతో శిశువును దేవరకొండ పోలీస్ స్టేషన్ తరలించి విషయాన్ని ఐసిడిఎస్ అధికారులకు పోలీసు వారు సమాచారం అందించారు

# ఉద్యాన రైతులకు ఇన్పుట్ సబ్సిడీ విడుదల: జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

వైయస్సార్ కడప జిల్లా, డిసెంబర్ 5(భారత శక్తి):

2025 ఏప్రిల్ మాసంలో వై.యస్.ఆర్. కడప జిల్లాలో కురిసిన అధిక వర్షాలు వలన నష్టపోయిన ఉద్యాన రైతులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇన్ పుట్ సబ్సిడీ విడుదల చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

అరటి (461.00 హె), బొప్పాయి (22.00 హె), మరియు ఉద్యాన పంటలు (45.94హె) లకు నష్టం వాటిల్లిందనీ తెలిపారు. జిల్లాలో 14 మండలాలలో 528. 94 హెఎలలో 718 ఉద్యాన రైతులకు నష్టం వాటిల్లగా రాష్ట్ర ప్రభుత్వం రూ.1,85,01,250/- ఇన్ పుట్ సబ్సిడీ విడుదల చేయడం జరిగిందనీ ఆ ప్రకటనలో తెలిపారు.

లిమండలాల వారిగా వివరాలులి

1.లింగాల మండలంలో అత్యధికంగా 280.45 హెక్టార్లు నష్టం వాటిల్లగా 359 మంది రైతులకు రూ.92,02,850 సబ్సిడీ మంజూరైంది.

2. కాశీనాయన మండలంలో 98.95 హెక్టార్ల హెక్టార్లు నష్టం వాటిల్లగా 116 మంది రైతులకు రూ.39,13,250 సబ్సిడీ మంజూరైంది.

3. వేముల మండలంలో 63.56 హెక్టార్లు నష్టం వాటిల్లగా 114 మంది రైతులకు రూ.24,24,600 సబ్సిడీ మంజూరైంది.

4. సింహాద్రిపురం మండలంలో 31.42 హెక్టార్లు నష్టం వాటిల్లగా 56 మంది రైతులకు రూ.12,87,150 సబ్సిడీ మంజూరైంది

5. ఒంటిమిట్ట మండలంలో 14.90 హెక్టార్లు నష్టం వాటిల్లగా 24 మంది రైతులకు రూ.4,62,000 సబ్సిడీ మంజూరైంది.

6. దువ్వూరు మండలంలో 17.21 హెక్టార్ల నష్టం వాటిల్లగా 16 మంది రైతులకు రూ.4,30,250 సబ్సిడీ మంజూరైంది.

7. పోరుమామిళ్ళ మండలంలో 7.77 హెక్టార్లు నష్టం వాటిల్లగా 11 మంది రైతులకు రూ.2,71,950 సబ్సిడీ మంజూరైంది.

8. కలసపాడు మండలంలో 4.29 హెక్టార్లు నష్టం వాటిల్లగా 4 మంది రైతులకు రూ.1,50,150 సబ్సిడీ మంజూరైంది.

9. ముద్దనూరు మండలంలో 3.74 హెక్టార్లు నష్టం వాటిల్లగా 5 మంది రైతులకు రూ.1,26,300 సబ్సిడీ మంజూరైంది.

10. ఎన్.కె.పల్లి మండలంలో 2.4 హెక్టార్లు నష్టం వాటిల్లగా 6 మంది రైతులకు రూ.84,000 సబ్సిడీ మంజూరైంది.

11. తొండూరు మండలంలో 1.63 హెక్టార్లు నష్టం వాటిల్లగా 2 మంది రైతులకు రూ.57,050 సబ్సిడీ మంజూరైంది.

12. ఖాజీపేట మండలంలో 1.22 హెక్టార్లు నష్టం వాటిల్లగా 1 రైతుకు రూ.42,700 సబ్సిడీ మంజూరైంది.

13. సిద్దవటంలో 1 హెక్టార్లు నష్టం వాటిల్లగా 1 రైతుకు రూ.35,000 సబ్సిడీ మంజూరైంది.

14. చక్రాయపేట మండలంలో 0.4 హెక్టార్లు నష్టం వాటిల్లగా 3 మంది రైతులకు రూ.14,000 సబ్సిడీ మంజూరైంది.

జిల్లా వ్యాప్తంగా మొత్తం నష్టం విస్తీర్ణం: 528.94 హెక్టార్లు,మొత్తం రైతులు: 718

మొత్తం ఇన్ పుట్ సబ్సిడీ: రూ.1,85,01,250/-

# ప్రకృతి వ్యవసాయంపై కిసాన్ మేళా

## పాల్గొన్న జిల్లా వ్యవసాయ అధికారి- శ్రీధర్ రెడ్డి

సూర్యాపేట (భారతశక్తి జిల్లా ప్రతినిధి) డిసెంబర్ 5:

కృషి విజ్ఞాన కేంద్రం గడ్డిపల్లి లో శుక్రవారం నాడు నిర్వహించిన ప్రపంచ మృత్తిక దినోత్సవ కార్యక్రమంలో భాగంగా ప్రకృతి వ్యవసాయంపై కిసాన్ మేళాను ఏర్పాటు చేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి సూర్యాపేట జిల్లా వ్యవసాయ అధికారి జి శ్రీధర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారని కే.వి.కే సీనియర్ సైంటిస్ట్ అండ్ హెడ్ ఇన్చార్జ్ డి. నరేశ్ .ఈ కార్యక్రమాన్ని మొదటగా వ్యవసాయ ప్రదర్శనను.జి. శ్రీధర్ రెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.తర్వాత ప్రదర్శనలో ఏర్పాటు చేసిన డెమోస్ అని చూసి రైతులకు ఉపయోగపడే ప్రకృతి వ్యవసాయాన్ని తిలకించారు.వారు మాట్లాడుతూ నేలను (మట్టి) పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకతపై ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు అన్నారు.ఆరోగ్యకరమైన నేలలు ఆరోగ్యకరమైన నగరాలకు పునాది, భవిష్యత్ నాంది అన్నారు. రైతులు సేంద్రియ ఎరువులు జీవ సంబంధ పురుగు మందులు పచ్చిరొట్ట, జీవన ఎరువులు ఉపయోగించాలి. సమగ్ర వ్యవసాయ పద్ధతులను పాటించి నేల కోతను అరికట్టాలి. నీటి వినియోగాన్ని సమర్థవంతంగా చేపట్టాలి. భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా ఎరువులు వాడాలి. నేలను కప్పి ఉంచే పద్ధతిని అనుసరించాలి. పంట మార్పిడి, అంతరపంటలు, సాగు విధానాల కొనసాగింపుతో నేత కోతను అరికట్టవచ్చు అనిరసాయనక ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులు వాడాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కే.వి.కే సీనియర్ సైంటిస్ట్ అండ్ హెడ్ ఇన్చార్జ్ శ్రీ డి. నరేశ్ మాట్లాడుతూ



రైతులు కేవలం ఒకే రకమైన పంటలు వేసుకోకుండా సమగ్ర వ్యవసాయ విధానాలను పాటిస్తూ అధిక దిగుబడులను సాధించవచ్చని తెలిపారు. నేల సారవంతం తగ్గడానికి గల కారణాలు, నేల ఆరోగ్య పరిరక్షణకు పాటించవలసిన పద్ధతుల గురించి తెలిపారు. అలాగే సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులు అవలంబిస్తూ నేల ఆరోగ్యన్ని కాపాడుకోవాలి సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారితో నేల పరిరక్షణకై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రైతులకు భూసార ఆరోగ్య పత్రాలను పంపిణీ చేయడం జరిగింది. అలాగే సేంద్రియ వ్యవసాయం చేసే రైతులకు సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి జి. శ్రీధర్ రెడ్డి, కే.వి.కే శాస్త్రవేత్తలు డీ.నరేష్, సి.హేచ్. నరేష్, ఎ.కిరణ్, పి.అక్షిత్ సాయి, యన్ సుగంధి, నూతనకల్ మండల వ్యవసాయ అధికారి కే .మల్లారెడ్డి, కంప్యూటర్ ప్రోగ్రామర్ ఏ. నరేశ్, సూపర్డెంట్ ఉపేందర్, స్టెనో ఎం.సైదులు ఇఫ్కో జిల్లా మేనేజర్ ఏ. వెంకటేశ్, రైతులు మరియు వ్యవసాయ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# నగునూరులో అన్నపూర్ణ గోపినీ సర్పంచ్ గా గెలిపించండి: వెలిచాల రాజేందర్ రావు



కరీంనగర్, డిసెంబర్ 5(భారతశక్తి ప్రతినిధి):

సర్పంచ్ ఎన్నికల్లో నగునూరు లో అన్నపూర్ణ గోపిని సర్పంచ్ గా భారీ మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం

గ్రామపంచాయతీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కరీంనగర్ రూరల్ మండలం నగునూరు గ్రామ సర్పంచ్ గా పోటీ చేస్తున్న నర్సింగోజు అన్నపూర్ణ గోపికి మద్దతుగా వెలిచాల రాజేందర్ రావు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్నూరు కాపు సంఘం, రెడ్డి సంఘం ఆత్మీయ సమావేశాల్లో పాల్గొన్నారు.. నగునూరు సర్పంచ్ గా పోటీ చేస్తున్న అన్నపూర్ణ కు ఓటు వేసి గెలిపించాలని రాజేంద్ర రావు కోరారు. మున్నూరు కాపు సంఘం రెడ్డి సంఘం ప్రతినిధులు ముందుకు వచ్చి భారీ మెజారిటీతో గెలిపిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వారికి రాజేందర్రావు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థులను సర్పంచులుగా గెలిపించడం ద్వారా గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయని రాజేందర్రావు పేర్కొన్నారు. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలనీ, అభివృద్ధిని అడ్డుకునే వారిని ఓడించాలని కోరారు. అన్నపూర్ణ గోపిని గెలిపిస్తే నగునూరును అత్యుత్తమ గ్రామపంచాయతీ గా తీర్చిదిద్దుతామనీ, అందుకు గ్రామ ప్రజలు అవకాశం ఇవ్వాలని రాజేందర్ రావ్ కోరారు. కరీంనగర్ రూరల్ మండలం ఎలబోతారం గ్రామానికి చెందిన స్వతంత్ర సర్పంచ్ అభ్యర్థి ఎ. రమేష్ కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఇంచార్జి వెలిచాల రాజేందర్ ఆధ్వర్యంలో పార్టీ లో చేరారు.

# కాంగ్రెస్ పార్టీకి కామారెడ్డి ప్రజలు స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారు : బీజేపీ జిల్లా ఇంచార్జి విక్రమ్ రెడ్డి



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) డిసెంబర్ 05: శుక్రవారం బీజేపీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు నీలం చిన్న రాజులు అధ్యక్షతన ఏర్పాటు చేసిన జిల్లా పదాధికారుల సమావేశం ఏర్పాటు చేయటం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన బీజేపీ జిల్లా ఇంచార్జి విక్రమ్ రెడ్డి మాట్లాడుతూ, సర్పంచ్ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి బీజేపీ కార్యకర్త శక్తి వంచన లేకుండా పని చేయాలని అన్నారు. కామారెడ్డి బీసి డిక్లరేషన్ చేసి బీసి లను 42 శాతం రిజర్వేషన్ ఇస్తాం అని మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి కామారెడ్డి ప్రజలు స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారని అన్నారు. భారతీయ జనతా పార్టీ తరుపున బీసి లకు 50 శాతం బలపరిచామని అన్నారు. అబద్ధపు 420 హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు నమ్మడం లేదని అన్నారు. జిల్లా లోని అన్ని మండలాల పరిధిలో బీజేపీ తరుపున సర్పంచ్, వార్డు సభ్యులకి అభ్యర్థులను నిలిపామని మెజారిటీ స్థానాల్లో బీజేపీ గెలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తల్లిదండ్రులు అకాడమిక్ కమిటీగా ఏర్పాటు అయి పాఠశాలను పరిశీలించండి: జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

వై ఎస్ ఆర్ కడప, డిసెంబర్ 5(భారత శక్తి): పిల్లల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు తో పాటు ప్రధాన బాధ్యత తల్లిదండ్రులదే అని.. అదే లక్ష్యంగా తల్లి దండ్రులు - ఉపాధ్యాయుల సమావేశాలను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత తో నిర్వహిస్తోందని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు.

శుక్రవారం మైదుకూరు నియోజకవర్గం లోని ఒనిపెంట మహాత్మా జ్యోతీభా పూలే బీసీ సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశానికి ముఖ్య అతిధులుగా జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తోపాటు మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ లు హాజరయ్యారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు వారిలో నైతిక విలువలు పెంపొందించేలా వారి భవిష్యత్తుకు బాటలు వేసే బాధ్యత ఉపాధ్యాయులదే అన్నారు. విద్యార్థుల దశను, దిశను మార్చగలిగే సాధనం ఉపాధ్యాయులు మాత్రమే అని అభివర్ణిస్తూ విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాల్సిన వారి ఆశయానికి తల్లిదండ్రులు సహకరించాలన్నారు. సమాజానికి సరైన చదువు ఇవ్వకపోతే అభివృద్ధికి కళ్లెం వేసినట్లే అన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసమే పేరెంట్స్ కమిటీలు దోహద పడుతాయని, విద్యార్థుల భద్రతకు పాఠశాల ఉపాధ్యాయులే కాకుండా తల్లిదండ్రుల బాధ్యత చాలా అవసరం అన్నారు.

పాఠశాలల్లో చదువు, మంచి మార్కులే కాదు. విలువలతో కూడిన బుద్ధులు, పలురకాల నైపుణ్యతతో కూడిన వివేకం విద్యార్థులకు అందించే కళాశాలలుగా, మేథో నిధులుగా విద్యాలయాలు అభివృద్ధి చెందాలన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని.. రాష్ట్ర ప్రభుత్వం అనేక సంస్కరణలు ప్రవేశ పెట్టడం జరిగిందని.. పేద విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సక్రమంగా సమకూర్చి ప్రభుత్వ పాఠశాలలను ఆధునిక విద్యాలయాలుగా తీర్చిదిద్దాలని.. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకి సూచించారు. గురుకుల పాఠశాలలో ఇంకా కొన్ని పూర్తి చేయవలసిన అభివృద్ధి పనులు ఉన్నాయని త్వరలోనే వాటిని కుడా ఎమ్మెల్యే గారి సహకారంతో పూర్తి చేస్తామన్నారు. ఈ గురుకులానికి త్వరలో జూనియర్ కళాశాలను కూడా నిర్వహణలోకి తీసుకువస్తామన్నారు.

అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కేవలం మౌలిక వసతులే కాకుండా విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను, సత్ ప్రవర్తనను నేర్పించే ప్రధాన ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. అందుకోసం పాఠశాల నిర్వహణ కమిటీలను పటిష్టంగా నిర్వహిస్తూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను సమన్వయం చేస్తూ పేరెంట్స్, టీచర్స్ సమావేశాలను అన్ని పాఠశాలల్లో నిర్వహించడం జరుగుతోందన్నారు.

ఇందుకోసం పేరెంట్స్ కమిటీలు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలు సమన్వయంతో పనిచేసి ఆదర్శవంతంగా ముందుకెళ్లాలన్నారు. పాఠశాలలకు సంబంధించి ఏ అభివృద్ధి కార్యక్రమం అయినా పేరెంట్స్ కమిటీల ద్వారా నిర్వహించడం జరుగుతోందని ఈ అవకాశాన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తల్లిదండ్రులు అకడమిక్ కమిటీగా ఏర్పడి విద్యతో పాటు పిల్లలకు ఆసక్తి ఉన్న రంగాలలో వారిని నిష్ణాతులుగా తీర్చిదిద్దేందుకు ప్రోత్సహించాలని సూచించారు.

తల్లిదండ్రులు 15 నుండి 20 నిమిషాలు వారి పిల్లలతో కేటాయించి వారి విద్యా, ఆసక్తులను గమనిస్తూ, వారు సాధిస్తున్నటు వంటి విజయాలను ప్రోత్సహించడం చేయాలన్నారు.అలాగే వారి ప్రవర్తనను కూడా గమనిస్తూ.. ధైర్యాన్ని అందించాలన్నారు. ఇలాంటి అంశాలపై పిల్లలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కూర్చొని చర్చించుకోవడమే ఈ మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ యొక్క ముఖ్య ఉద్దేశం అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ పాఠశాలల ఆస్తులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రధానంగా ఉపాధ్యాయుల మీదే ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలను పరిశుభ్రంగా ఉంచి అక్కడ విద్యార్థులకు కావలసిన అన్ని సదుపాయాల్లో ఆయా పాఠశాలను ఆధునిక దేవాలయాలుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత విద్యాశాఖ అధికారులపై ఉందన్నారు.

ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ

సమాజంలో ఉన్నత స్థానాల్లో ఉన్న వ్యక్తుల పూర్వపరాలను పరిశీలిస్తే.. వారి విద్యాభ్యాసం సాగించిందంతా ప్రభుత్వ పాఠశాలల్లోనే అన్న విషయాన్ని గుర్తు చేశారు. ప్రస్తుతం అభివృద్ధి పథంలో నడుస్తున్న ఈ గురుకుల పాఠశాల గత నేపథ్యం గమనిస్తే.. గతంలో కంటే ప్రస్తుతం గురుకులం ఎంతో పురోగతి సాధించిందన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్యను అందించడంతో పాటు.. విద్యార్థినులకు మెరుగైన వసతి కల్పించడం జరుగుతోందన్నారు. తనుకూడా పిల్లల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి.. ఉపాధ్యాయిల సహకారంతో గురుకులం, విద్యార్థుల విద్యాభివృద్ధికి బాటలు వేస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల ద్వారా.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య క్రమేపీ పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాలన్నీ కూడా.. ప్రభుత్వ పాఠశాలలను పటిష్టం చేసి,పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అన్నారు.ఆ దిశగా విద్యాశాఖ గురుతర బాధ్యత తో పనిచేయాలన్నారు. ప్రభుత్వ ఆశయ సాధనలో ప్రతి అధికారీ భాగస్వాములు కావాలన్నారు.వనిపెంట మహాత్మా జ్యోతీభా పూలే బీసీ సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులు పదవ తరగతి తర్వాత ఇంటర్మీడియట్ కొరకు ఇతర ప్రాంతాలకు వెళ్ళి చదువుకోవడానికి ఇబ్బంది పడకుండా వనిపెంట లోనేఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కొనసాగించేందుకు ఈ విషయం ను గౌ.రాష్ట్ర ముఖ్యమంత్రి గారి దృష్టి కి తీసుకొని వెళ్లడం జరిగిందని, జిల్లా కలెక్టర్ గారు ఈ విషయం లో చొరవ చూపాలని తెలిపారు.

డిఈఓ శంషుద్దీన్ మాట్లాడుతూ జిల్లాలో ఏ నియోజకవర్గానికి లేనటు వంటి ఒక ప్రత్యేకత మైదుకూరు నియోజవర్గానికి ఉందన్నారు. ఈ ప్రాంతం సమగ్ర అభివృద్ధితో పాటు ఆధ్యాత్మిత నిధి కలిగినటు వంటి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవస్థానం, చాపాడు దగ్గర వినోబా భావే స్థాపించిన విద్యాలయం నెలకొని ఉన్న ఈ ప్రాంతంలో మహాత్మా జ్యోతీభా పూలే గురుకుల విద్యాలయం ఉండడం మన అదృష్టం అన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యాభివృద్ధితో పాటు పాఠశాల సమగ్ర అభివృద్ధి, పిల్లల శారీరక, మానసిక పరిపక్వత అలాగే.. సామాజికంగా పాఠశాల గత, ప్రస్తుత పరిస్థితులు పరిణామాలు ఎలా ఉన్నాయో తల్లిదండ్రులకు వివరించడం జరుగుతుందన్నారు. సమాజమంతా పాఠశాలలో ఉంటుందని, అందులో సమాజంలో ఉన్నటువంటి వ్యక్తులందరూ ఉంటారన్నారు.మనిషి బాగుండాలి అంటే చదువు ముఖ్యం,సమాజం బాగుండాలంటే పాఠశాలలు బాగుండాలి అన్న ధోరణితో.. పాఠశాల సమగ్ర అభివృద్ధికి ఉపాధ్యాయులు, పేరెంట్స్



పాటుపడాలని కోరారు.

అనంతరం ఆ పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు పాఠశాల అభివృద్ధిపై విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు భావోద్వేగాలకు లోనవుతూ వారి అనుభవాలను పంచుకున్నారు.

ఈ కార్యక్రమంలో ముందుగా అత్యధిక విద్యార్థుల సంఖ్య ఉన్న గురుకుల పాఠశాలలో పాఠశాల తరగతి గదులు, ఇంటర్ మీడియేట్ అకాడమీ నూతన భవనాలు, కిచెన్, తదితర భవనాలను ఎమ్మెల్యే తో కలిసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు.

ఈ కార్యక్రమంలో బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్, నియోజకవర్గ ప్రత్యేక అధికారి, డ్వామా పీడి అదిశేషారెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ డిడి సరస్వతి, ప్రిన్సిపాల్ నిర్మల, తహసీల్దార్ రాజ సింహా నరేంద్ర, ఎంపిడిఓ శ్రీధర్ నాయుడు, ఎంపిపి థామస్, విద్యార్థినీలు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు,పూర్వ విద్యార్థులు, దాతలు, పేరెంట్స్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




# ఐసీసీ ప్లేయర్ ఆఫ్‌ది మంత్.. షఫాలీ వర్మ నామినేట్



మహిళల వన్డే వరల్డ్ కప్ ఫైనల్‌లో అద్భుత ప్రదర్శన చేసిన షఫాలీ వర్మ నవంబర్ నెలకు.. ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ది మంత్‌గా నామినేటైంది. సెమీఫైనల్ మ్యాచ్‌కు ముందు ప్రతికా రావల్ గాయపడటంతో అనూహ్యంగా జట్టులోకి షఫాలీ వచ్చింది. మొదటి మ్యాచ్‌లో విఫలమైంది. అయితే దక్షిణాఫ్రికాతో జరిగిన ఫైనల్‌లో.. 78 బంతుల్లో 87 పరుగులు చేసి సత్తా చాటింది. బంతితోనూ విజృంభించింది. కీలకమైన రెండు వికెట్లను నేలకూల్చింది. ఇలా షెఫాలీ వర్మ తన ఆల్ రౌండ్ ప్రదర్శనతో రాణించి.. టీమ్‌ఇండియా తొలిసారి విశ్వవిజేతగా అవతరించడంలో కీలకంగా నిలిచింది. తాజాగా ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ది మంత్ కోసం యూఏఈకి చెందిన ఈషా ఓజా, థాయ్‌లాండ్‌కు చెందిన తిపట్చా పుట్టావాంగ్ కూడా షఫాలీ వర్మతో పాటు నామినేట్ అయ్యారు. ఐసీసీ ఉమెన్స్ ఎమర్జింగ్ నేషన్స్ ట్రోఫీ సందర్భంగా ఓజా మ్యాచ్ విన్నింగ్ ప్రదర్శన చేసింది. ఏడు టీ20 మ్యాచ్‌ల్లో ఆమె 137.50 స్ట్రైక్ రేట్‌తో 187 పరుగులు చేసింది. బంతితో కూడా రాణించింది. 18.14 సగటుతో 7 వికెట్లు తీసింది. అలాగే థాయ్‌లాండ్‌కు చెందిన ఎడమచేతి వాటం స్పిన్నర్ తిపట్చా పుట్టావాంగ్ ఐసీసీ ఉమెన్స్ ఎమర్జింగ్ నేషన్స్ టోర్నమెంట్‌లో 15 వికెట్లు సాధించింది.

## పెళ్లి వాయిదా తర్వాత..
# స్మృతి మంధాన తొలి పోస్ట్

భారత మహిళల జట్టు స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన, మ్యూజిక్ డైరెక్టర్ పలాశ్ ముచ్చల్ వివాహం వాయిదా పడిన విషయం తెలిసిందే. ఈ పరిణామాల తర్వాత స్మృతి మంధాన సోషల్ మీడియాలో తొలిసారిగా యాక్టివ్‌గా కనిపించారు. ఓ వాణిజ్య ప్రకటనకు సంబంధించిన వీడియోను ఇన్‌స్టాలో పోస్టు చేశారు. అందులో ఆమె చేతికి ఉంగరం లేకపోవడం ఆసక్తిగా మారింది. దీంతో ఆ షూట్ నిశ్చితార్థానికి ముందు చేశారా లేక తర్వాత చేశారా అనే చర్చ మొదలైంది. అభిమానులు ఆమెకు మద్దతుగా పోస్టులు పెడుతున్నారు. స్మృతి, ముచ్చల్ వివాహం నవంబర్ 23న జరగాల్సి ఉంది. కానీ.. పెళ్లికి కొన్ని గంటల ముందు స్మృతి నాన్న అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరారు. ఆ తర్వాత ఆమెకు కాబోయే భర్త పలాశ్ ముచ్చల్ సైతం అనారోగ్యానికి గురయ్యారు. ఈ క్రమంలో వివాహాన్ని వాయిదా వేసినట్లు మంధాన ప్రతినిధి ప్రకటించారు. ఆ తర్వాత తన వివాహ వేడుకకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియా ఖాతా నుంచి స్మృతి తొలగించడం పలు ఊహాగానాలకు కారణమైంది. ఈ పరిణామాల నడుమ పలాశ్ తల్లి అమిత ఇటీవల మీడియాతో మాట్లాడుతూ.. ఇప్పుడు అంతా బాగానే ఉందని, త్వరలో వారిద్దరి వివాహం జరుగుతుందని చెప్పారు.



## కేఎల్ రాహుల్ టాప్ ఆర్డర్‌లో ఆడితే
# మరిన్ని సెంచరీలు చేస్తాడు: డేల్ స్టెయిన్



ప్రస్తుతం టీమ్ఇండియా, దక్షిణాఫ్రికా మధ్య మూడు వన్డేల సిరీస్ జరుగుతోంది. ఇందులోభాగంగా ఇప్పటికే రాంచీ, రాయ్‌పూర్ వేదికగా రెండు వన్డేలు ముగిశాయి. తొలి వన్డేలో టీమ్ఇండియా 17 పరుగులతో విజయం సాధిస్తే, రెండో మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 6 వికెట్ల తేడాతో గెలిచింది. ఈ రెండు మ్యాచుల్లోనూ కేఎల్ రాహుల్ అర్ధసెంచరీలతో రాణించాడు. మొదటి వన్డేలో 60 (56 బంతుల్లో), రెండో మ్యాచ్‌లో 66* (43 బంతుల్లో) పరుగులు చేశాడు. బ్యాటింగ్‌లో నిలకడ ప్రదర్శిస్తున్న అతన్ని దక్షిణాఫ్రికా మాజీ ఫాస్ట్ బౌలర్ డేల్ స్టెయిన్ ప్రశంసించాడు. 'కేఎల్ రాహుల్‌కు ఎలా ఆడాలో తెలుసు. ఒకవేళ అతడు మూడో స్థానంలో బ్యాటింగ్‌కు దిగితే.. కచ్చితంగా సెంచరీలు సాధించగలడు. కానీ ప్రస్తుతం అతడు ఆడుతున్న స్థానాల్లో... జట్టు కోసం తాను ఎలాంటి పాత్ర పోషించాలో తెలుసు. మొదటివన్డేతో పాటు, రెండో మ్యాచ్‌లోనూ అతడు హాఫ్ సెంచరీలు చేశాడు. ఎప్పుడు తగ్గాలో.. ఎప్పుడు వేగంగా ఆడాలనే విషయంపై అతడికి అవగాహన ఉంది' అని డేల్ స్టెయిన్ కొనియాడాడు. కేఎల్ రాహుల్ ఇప్పటివరకు వన్డేల్లో 83 ఇన్నింగ్స్‌ల్లో 49.50 యావరేజ్‌తో 3,218 పరుగులు చేశాడు. ఇందులో మూడు సెంచరీలు, 20 హాఫ్ సెంచరీలున్నాయి. అతడు చివరిసారిగా వన్డే వరల్డ్‌కప్ 2023లో నెదర్లాండ్స్ మీద సెంచరీ చేశాడు. ఆ మ్యాచ్‌లో అతడు కేవలం 64 బంతుల్లోనే 102 పరుగులు సాధించాడు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్, వైస్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ గాయాల కారణంగా వన్డే జట్టుకు దూరమయ్యారు. ఈ నేపథ్యంలో కేఎల్ రాహుల్ దక్షిణాఫ్రికాతో జరుగుతున్న వన్డే సిరీస్‌కు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. రాంచీ వేదికగా జరిగిన మొదటి వన్డేలో టీమ్ఇండియా 17 పరుగులతో విజయం సాధించింది. రాయ్‌పూర్ వన్డేలో సఫారీల జట్టు 4 వికెట్ల తేడాతో గెలిచింది. సిరీస్ విజేతను నిర్ణయించే కీలకమైన మూడో వన్డే విశాఖపట్నం వేదికగా రేపు (శనివారం) జరగనుంది. దీంతో అభిమానుల్లో ఈ మ్యాచ్‌పై ఆసక్తి నెలకొంది.



# అందుకే ఐపీఎల్‌కు వీడ్కోలు పలికా.. : ఆండ్రీ రస్సెల్

వెస్టిండీస్ మాజీ ఆల్‌రౌండర్ ఆండ్రీ రస్సెల్ ఇటీవలే ఐపీఎల్‌కు వీడ్కోలు పలికిన విషయం తెలిసిందే. ఐపీఎల్ 2026 మినీ ఆక్షన్‌కు ముందు కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టు అతడిని రిలీజ్ చేసింది. అనంతరం అతడు రిటైర్మెంట్ ప్రకటించి అందరినీ ఆశ్చర్యానికి గురిచేశాడు. కోల్‌కతా నైట్ రైడర్స్ యాజమాన్యం రస్సెల్‌ను పవర్ కోచ్‌గా నియమించుకుంది. అయితే తాను ఐపీఎల్‌కు వీడ్కోలు నిర్ణయం ఎందుకు తీసుకోవాల్సి వచ్చిందో, తాజాగా.. 'క్రిక్‌బజ్'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరించాడు. వెస్టిండీస్ మాజీ ఆల్‌రౌండర్ ఆండ్రీ రస్సెల్ ఇటీవలే ఐపీఎల్‌కు వీడ్కోలు పలికిన విషయం తెలిసిందే. ఐపీఎల్ 2026 మినీ ఆక్షన్‌కు ముందు కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టు అతడిని రిలీజ్ చేసింది. అనంతరం అతడు రిటైర్మెంట్ ప్రకటించి అందరినీ ఆశ్చర్యానికి గురిచేశాడు. కోల్‌కతా నైట్ రైడర్స్ యాజమాన్యం రస్సెల్‌ను పవర్ కోచ్‌గా నియమించుకుంది.





# ఎంటర్‌టైన్‌మెంట్ ఇండస్ట్రీలో భారీ డీల్..
## నెట్‌ఫ్లిక్స్ చేతికి వార్నర్ బ్రదర్స్!

ఎంటర్‌టైన్‌మెంట్ ఇండస్ట్రీలో భారీ డీల్ ఖరారైంది. వార్నర్ బ్రదర్స్ డిస్కవరీకి చెందిన స్టూడియోలు, స్ట్రీమింగ్ యూనిట్‌ను కొనుగోలు చేసేందుకు నెట్‌ఫ్లిక్స్ ఒప్పందం కుదుర్చుకుంది. ప్రపంచంలో అతిపెద్ద స్ట్రీమింగ్ సర్వీస్ అయిన నెట్‌ఫ్లిక్స్, ప్రపంచంలోనే పురాతన స్టూడియోలు కలిగిన వార్నర్ బ్రదర్స్ డిస్కవరీకి మధ్య ఈ డీల్ కుదరడం విశేషం. ఈ ఒప్పందం విలువ దాదాపు 72 బిలియన్ డాలర్లు (సుమారు రూ.6.47 లక్షల కోట్లు). ఒక్కో 'వార్నర్ బ్రదర్స్' షేరుకు 27.75 డాలర్లు చెల్లించేందుకు నెట్‌ఫ్లిక్స్ బిడ్ వేసినట్లు తెలిసింది. సీఎన్‌ఎన్, టీబీఎస్, టీఎన్‌టీ వంటి కేబుల్ ఛానళ్లలో ప్రారంభించిన మార్పుల ప్రక్రియను వార్నర్ బ్రదర్స్ పూర్తి చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాతే కొనుగోలు ప్రక్రియ పూర్తవుతుంది. హాలీవుడ్‌లో అత్యంత విలువైన కంపెనీగా ఎదిగిన నెట్‌ఫ్లిక్స్ ఈ స్థాయి కొనుగోలు చేపట్టడం ఇదే తొలిసారి. లైబ్రరీ, స్టూడియో వంటివేవీ లేకుండానే ఆ సంస్థ ఈ స్థాయికి చేరింది. ఇతరుల నుంచి లైసెన్స్‌డ్ ప్రోగ్రామ్స్ తీసుకుని వాటిని ఒరిజినల్ కంటెంట్ కింద మార్చుకుంటూ వచ్చింది. ఈ కొనుగోలుతో హెచ్‌బీఓ నెట్‌వర్క్‌కు నెట్‌ఫ్లిక్స్ యజమానిగా మారుతుంది. అలాగే 'ది సొప్రానోస్', 'ది వైట్ లోటస్' వంటి హిట్ షోల లైబ్రరీలను సొంతం చేసుకుంటుంది. 'హ్యారీ పోటర్', 'ఫ్రెండ్స్' వంటి సినిమా, టీవీ ఆర్కైవ్స్ కూడా నెట్‌ఫ్లిక్స్ చేతుల్లోకి వెళతాయి.



## 10 నిమిషాల డెలివరీ సర్వీసులను నిషేధించాలి


**: రాఘవ్ చడ్డా**




క్విక్ కామర్స్ సంస్థలు అందిస్తున్న 10 నిమిషాల డెలివరీ వ్యవస్థను నిషేధించాలని ఆప్ ఎంపీ రాఘవ్ చడ్డా డిమాండ్ చేశారు. ఈ పద్ధతిలో గిగ్ కార్మికుల పట్ల దారుణంగా వ్యవహరిస్తున్నారని అభిప్రాయపడిన ఆయన.. డెడ్‌లైన్‌ను అందుకునేందుకు కార్మికులు తీవ్ర ఒత్తిడిలో పనిచేయాల్సి వస్తోందన్నారు. రాజ్యసభ జీరో అవర్‌లో ఇదే అంశాన్ని ఆప్ ఎంపీ ప్రస్తావించారు. "గిగ్ కార్మికులు రోబోలు కాదు. ఈ విషయంపై సభ ఆలోచన చేయాలి. 10 నిమిషాల క్రూరత్వ పద్ధతికి ముగింపు పలకాలి. వేగంగా సేవలు అందుతున్నాయని వినియోగదారులు ఆశిస్తున్నప్పటికీ.. గిగ్ కార్మికుల సంక్షేమం గురించి చట్టసభ ఆలోచించాలి" అని రాఘవ్ చడ్డా పేర్కొన్నారు. రేటింగ్ తగ్గించడం, ప్రోత్సాహకాల్లో కోత, ఐడీ బ్లాక్ వంటి భయాలతో నిర్దిష్ట సమయంలో డెలివరీ చేసేందుకు కార్మికులు వేగంగా, సిగ్నల్స్ జంప్ చేస్తూ వెళ్లాల్సి వస్తోందన్నారు. ఈ క్రమంలో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని.. వీటితోపాటు కస్టమర్ల వేధింపులు, ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేయాల్సి రావడం వంటి సవాళ్లు ఎదుర్కొంటున్నారని చెప్పారు. గిగ్ కార్మికులు భారత ఆర్థిక వ్యవస్థకు కనిపించని చక్రాలుగా సేవలందిస్తున్నారని ఆప్ ఎంపీ పేర్కొన్నారు. కంపెనీలకు తమ బిలియన్ డాలర్ల విలువను పెంచుకునేందుకు, యూనికార్న్‌గా ఎదగడానికి క్విక్ కామర్స్, ఇన్‌స్టంట్ డెలివరీ వంటి వ్యవస్థలు దోహదపడినప్పటికీ.. గిగ్ కార్మికుల పరిస్థితులు మాత్రం రోజువారీ కూలీల కంటే దారుణంగా ఉన్నాయన్నారు.

# ఫోన్‌లో లొకేషన్ ట్రాకింగ్‌ను తప్పనిసరి చేసే యోచనలో కేంద్రం?

స్మార్ట్‌ఫోన్లలో శాటిలైట్ ఆధారిత లొకేషన్ ట్రాకింగ్ సిస్టమ్‌ను నిరంతరం యాక్టివేట్ చేసి ఉంచడాన్ని తప్పనిసరి చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ మేరకు టెలికాం ఇండస్ట్రీ నుంచి వచ్చిన ప్రతిపాదనల ఆధారంగా ఫోన్ తయారీ సంస్థలకు ఆదేశాలు ఇవ్వాలనే ఆలోచనలో ఉంది. దీనిపై ఆయా వర్గాలతో చర్చలు జరిపింది. కానీ, యాపిల్, గూగుల్, శామ్‌సంగ్ అందుకు సుముఖంగా లేవని ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వర్గాలను పేర్కొంటూ పలు జాతీయ మీడియా సంస్థలు కథనాలు ప్రచురించాయి. యూజర్ల ప్రైవసీ నిబంధనలను ఉల్లంఘించినట్లు అవుతుందని ఆయా కంపెనీలు పేర్కొన్నాయి. ఇప్పటి వరకైతే కేంద్రం దీనిపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. పలు దర్యాప్తు సంస్థలు విచారణల్లో భాగంగా లొకేషన్ కోసం సెల్యూలార్ టవర్ డేటాపై ఆధారపడుతున్నాయి. దీంట్లో కచ్చితమైన లొకేషన్‌ను గుర్తించడం సాధ్యం కాదు. దీంతో అసిస్టెడ్ జీపీఎస్ సిస్టమ్‌ను తప్పనిసరి చేయాలని టెలికాం సంస్థలు ప్రతిపాదించాయి. దీనివల్ల కేవలం మీటర్ దూరం వ్యత్యాసంతో వ్యక్తి ఉన్న కచ్చితమైన ప్రాంతాన్ని గుర్తించొచ్చు. చట్టపరమైన దర్యాప్తుల్లో లొకేషన్ ట్రాకింగ్ ఒక్కోసారి కీలకం అవుతుంది. ప్రస్తుత వ్యవస్థ కారణంగా ఆయా విచారణలు బాగా ఆలస్యం అవుతున్నాయి. అయితే ట్రాకింగ్‌ను తప్పనిసరి చేసే విధానం ప్రపంచంలో ఎక్కడా లేదని యాపిల్, గూగుల్ వంటి కంపెనీల తరఫు లాబీ గ్రూప్ వాదిస్తోంది. ఇదే గనక అమలు చేస్తే ఫోన్లు నిరంతర నిఘా పరికరాలుగా మారతాయని పేర్కొంది. అప్పుడు న్యాయపరమైన, ప్రైవసీ, భద్రతాపరమైన సమస్యలు తలెత్తుతాయని పేర్కొంది. యూజర్లలో మిలిటరీ, జర్నలిస్టులు, న్యాయమూర్తుల వంటివాళ్లు కూడా ఉంటారని గుర్తుచేసింది. కొత్త ఫోన్లలో సంచార్ సాథీ యాప్‌ను తప్పనిసరి చేస్తూ ఇచ్చిన ఆదేశాలను కేంద్ర ప్రభుత్వం ఇటీవల వెనక్కి తీసుకున్న విషయం తెలిసిందే. విపక్షాలు సహా పలు వర్గాల నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమైన నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకుంది.



## విమానం రద్దయ్యిందా..? రీఫండ్ పొందండి ఇలా..

నిర్వహణపరమైన లోపాలతో వందల సంఖ్యలో ఇండిగో విమాన సర్వీసుల రద్దుతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిపై ఎయిర్‌లైన్ స్పందిస్తూ ప్రయాణికులకు బహిరంగ క్షమాపణలు తెలియజేసింది. అంతేకాదు.. డిసెంబరు 515 తేదీల్లో ప్రయాణాలకు సంబంధించి రీఫండ్ కూడా ప్రకటించింది. మరి విమానం రద్దయిన సమయంలో రీఫండ్ పొందడం ఎలాగో తెలుసా? విమానాన్ని షెడ్యూల్ సమయానికి నడపకపోయినా.. లేదా ఆ సర్వీసును రద్దు చేసినా ప్రయాణికులు పూర్తి రీఫండ్ అందుకోవచ్చు. లేదంటే ఎలాంటి అదనపు ఛార్జీలు లేకుండా తర్వాత అందుబాటులో ఉండే విమానానికి టికెట్ రీబుక్ చేసుకునే సదుపాయం ఉంటుంది. డీజీసీఏ నిబంధనల ప్రకారం.. నాన్‌రిఫండబుల్/ప్రమోషనల్ టికెట్లకు కూడా అసాధారణ పరిస్థితుల్లో రీఫండ్ ఆప్షన్ వర్తిస్తుంది. టికెట్ డబ్బులు తిరిగిచ్చే బాధ్యత విమానయాన సంస్థలదే. ప్రయాణికులు ఏ విధంగా చెల్లింపులు చేశారో.. అదే విధంగా రీఫండ్ చేయాల్సి ఉంటుంది.

నిర్వహణపరమైన లోపాలతో వందల సంఖ్యలో ఇండిగో విమాన సర్వీసుల రద్దుతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిపై ఎయిర్‌లైన్ స్పందిస్తూ ప్రయాణికులకు బహిరంగ క్షమాపణలు తెలియజేసింది. అంతేకాదు.. డిసెంబరు 515 తేదీల్లో ప్రయాణాలకు సంబంధించి రీఫండ్ కూడా ప్రకటించింది. మరి విమానం రద్దయిన సమయంలో రీఫండ్ పొందడం ఎలాగో తెలుసా? విమానాన్ని షెడ్యూల్ సమయానికి నడపకపోయినా.. లేదా ఆ సర్వీసును రద్దు చేసినా ప్రయాణికులు పూర్తి రీఫండ్ అందుకోవచ్చు.


## జయకృష్ణ సినిమా.. మహేశ్ బాబు ప్రమేయం లేదు

**: దర్శకుడి స్పష్టత**



ఘట్టమనేని కుటుంబం నుంచి వస్తున్న మరో కొత్త హీరో ఘట్టమనేని జయకృష్ణ. అజయ్ భూపతి 'శ్రీనివాస మంగాపురం' అనే సినిమాతో టాలీవుడ్‌కు పరిచయం కానున్నారు. ఇందులో హీరోయిన్‌గా రవీనా టాండన్ కుమార్తె రషా థడానీ నటిస్తున్నారు. అయితే ఈ సినిమాలో మహేశ్ బాబు ప్రమేయం ఉన్నట్లు వస్తోన్న వార్తలపై తాజాగా అజయ్ భూపతి స్పందించారు. అలాగే ఈ సినిమా నేపథ్యం గురించి ప్రస్తావించారు. వాస్తవికతకు పెద్దపీట వేస్తూ భావోద్వేగాలతో మనసుల్ని హత్తుకునే ప్రేమకథలా దీన్ని రూపొందించనున్నట్లు చెప్పారు. ''ఇది ప్రేమకథా నేపథ్యంలో రానుంది. కానీ, ఇప్పటివరకూ ఇలాంటి కథను ఎవరూ తెరకెక్కించలేదు. ఆ ప్రేమలో అమాయకత్వం, భావోద్వేగం అన్నీ ఉంటాయి. ఈ సినిమాలో కొత్త నటీనటులను తీసుకోవాలని భావించా. జయకృష్ణ , రషా థడానీ భాగమవుతారని ఊహించలేకపోయాను. ఇందులో మహేశ్‌బాబు, రవీనా టాండన్ ప్రమేయం ఉందంటూ వస్తోన్న వార్తల్లో నిజం లేదు. వారిద్దరూ నాపై పూర్తి నమ్మకంతో ఉన్నారు. జయకృష్ణ కుటుంబానికి కథ కూడా తెలియదు'' అని అజయ్ భూపతి చెప్పారు. జయకృష్ణకు ఇది తొలి సినిమా కాగా.. రషా ఇప్పటికే 'ఆజాద్' సినిమాతో బాలీవుడ్‌లో తొలి అడుగువేశారు. ఇప్పుడీ కొత్త చిత్రంతో తెలుగు ప్రేక్షకుల్ని పలకరించనున్నారు. ఇందులో ఆమె చాలా బలమైన.. నటనా ప్రాధాన్యమున్న పాత్రలో కనిపించనున్నారు.

## ఇది మరపురాని ప్రయాణం.. 'పుష్ప'పై అల్లు అర్జున్ పోస్ట్



తెలుగు ఇండస్ట్రీ ఘనతను ప్రపంచానికి చాటిన సినిమాల్లో 'పుష్ప' ఒకటి. అల్లు అర్జున్‌కు నేషనల్ అవార్డు తీసుకువచ్చిన ఈ చిత్రం రెండో భాగం విడుదలై నేటికి ఏడాది పూర్తయింది. తాజాగా పుష్ప సినిమాతో తన ప్రయాణాన్ని గుర్తుచేసుకుంటూ అల్లు అర్జున్ పోస్ట్ పెట్టారు. ఇది ఐదేళ్ల ప్రయాణమని అన్నారు. ''పుష్పని నా జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేను. ఈ చిత్రంతో ప్రేక్షకులు మాపై చూపిన ప్రేమాభిమానాలు ప్రత్యేకమైనవి. వాళ్లు ఎంతో ధైర్యాన్నిచ్చారు. అద్భుతమైన విజయాన్ని ఇచ్చినందుకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులకు ఎప్పటికీ రుణపడి ఉన్నాం. ఈ సినిమాలో ప్రత్యక్షంగా, పరోక్షంగా భాగమైన అందరికీ కృతజ్ఞతలు. సుకుమార్‌తో కలిసి వర్క్ చేయడం నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నా'' అని రాసుకొచ్చారు. ఈ 'పుష్ప 2' విడుదలై ఏడాదైన సందర్భంగా నిర్మాణసంస్థ కూడా పోస్టర్ షేర్ చేసింది. సుకుమార్ దర్శకత్వంలో అల్లు అర్జున్ హీరోగా తెరకెక్కిన 'పుష్ప' మొదటి భాగం 2021లో ప్రేక్షకుల ముందుకువచ్చి సూపర్ హిట్‌గా నిలిచింది. దీనికి కొనసాగింపుగా 'పుష్ప 2' గతేడాది డిసెంబర్ 5న రిలీజై పలు రికార్డులు బ్రేక్ చేసింది. ఈ సినిమాకు మూడోభాగం కూడా ఉన్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. 'పుష్ప 3: ది ర్యాంపేజ్' పేరుతో మూడో భాగం రానున్నట్లు గతంలో పోస్టర్ విడుదలైంది. గతంలో దీని గురించి సైమా వేదికగా సుకుమార్ క్లారిటీ ఇచ్చారు. 'పుష్ప 3' కచ్చితంగా ఉంటుంది' అన్నారు.

## మిస్ వరల్డ్ కిరీటం నా జీవితాన్ని మార్చింది: ఐశ్వర్యారాయ్

1994లో మిస్ వరల్డ్ కిరీటాన్ని సొంతం చేసుకోవడం వల్ల తన జీవితం పూర్తిగా మారిపోయిందని నటి ఐశ్వర్యారాయ్ అన్నారు. ఏ ఈవెంట్‌లో అయినా తన మార్క్ చూపి అందరినీ ఆకర్షించే ఐశ్వర్య తాజాగా రెడ్ సీ ఫెస్టివల్‌లో బ్లాక్ అండ్ వైట్ డ్రెస్‌లో మెరిశారు. ఆ వేదికపై తన కెరీర్ గురించి మాట్లాడారు. ''1994లో మిస్ వరల్డ్ పోటీల్లో అనుకోకుండా పాల్గొన్నాను. దాన్ని నేను అందాల పోటీలా భావించలేదు. కచ్చితంగా టైటిల్ నాకే రావాలని అనుకోలేదు. అంతర్జాతీయ పోటీలో భారత్‌కు ప్రాతినిధ్యం వహించే అవకాశం రావడం అదృష్టంగా భావించి ఆ పోటీల్లో పాల్గొన్నా. ఆ సమయంలో భారతీయుల గురించి చాలా తక్కువమందికి మాత్రమే తెలుసు. ఈ విషయం నన్ను ఆశ్చర్యపరిచింది. అందుకే వేదికపై మన దేశం గొప్పతనాన్ని చెప్పాను'' ''ఇక ఆ టైటిల్ గెలవడంతో నా జీవితమే మారిపోయింది. మణిరత్నం దర్శకత్వంలో మొదటి సినిమా (ఇరువర్) చేశాను.

## 'అవతార్ 3'లో 'వారణాసి' సర్‌ప్రైజ్



'వారణాసి' సినిమాను దర్శకధీరుడు రాజమౌళి భారీ స్థాయిలో తెరకెక్కించనున్న విషయం తెలిసిందే. వీరిద్దరి కాంబినేషన్‌లో సినిమా వస్తుందని తెలిసినప్పటినుంచే ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి ఏర్పడింది. తాజాగా దీనికి సంబంధించిన ఓ ఆసక్తికర విషయం హాలీవుడ్‌లోనూ వైరల్ అవుతోంది. అవతార్ 3 సినిమాలోను 'వారణాసి' సర్‌ప్రైజ్ ఉండనున్నట్లు హాలీవుడ్ మీడియా పేర్కొంది. దీంతో ఈ న్యూస్ సోషల్ మీడియాలో షేర్ అవుతోంది. 'అవతార్' డైరెక్టర్ జేమ్స్ కామెరూన్ అంటే రాజమౌళికి ఎంత అభిమానమో తెలిసిన విషయమే. సందర్భం వచ్చినప్పుడల్లా జక్కన్న ఆయన గురించి చెబుతూనే ఉంటారు. ఇప్పుడు జేమ్స్ కామెరూన్ దర్శకత్వం వహించిన 'అవతార్ 3' (అవతార్- ఫైర్ అండ్ యాష్) సినిమాలో రాజమౌళి 'వారణాసి' సర్‌ప్రైజ్ ప్లాన్ చేసినట్లు వార్తలు వస్తున్నాయి. డిసెంబర్ 19న 'అవతార్ 3' ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సినిమాలోనే 'వారణాసి'కి సంబంధించిన ప్రత్యేక వీడియోను ప్రదర్శించే ఆలోచన చేస్తున్నట్లు హాలీవుడ్ మీడియా పేర్కొంది. ప్రస్తుతం 'వారణాసి' సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇందులో మహేశ్ .. రుద్ర పాత్రలో నటిస్తున్నారు. విలన్ పాత్ర కుంభగా పృథ్వీరాజ్ సుకుమారన్ కనిపించనున్నారు. ప్రియాంకా చోప్రా.. మందాకినిగా సందడి చేయనున్నారు. ఇప్పటికే విడుదలైన వీరి లుక్స్‌కూ విశేష స్పందన దక్కింది. 2027 వేసవి లో సినిమాని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

# సినిమా

## అసలేం జరుగుతోంది?



నేచురల్‌స్టార్‌నాని హీరోగా నటించిన కృష్ణ గాడి వీర ప్రేమ గాథ సినిమాతో తెలుగు ఇండస్ట్రీలోకి అడుగు పెట్టిన బ్యూటీ మెహ్రీన్ పిర్జాదా.. ఈ చిత్రంలో తన క్యూట్ నెస్‌తో ఆకట్టుకుంది. ఆతర్వాత వరుసగా మహానుభావుడు, రాజా ది గ్రేట్, ఎఫ్2, ఎఫ్3 సినిమాలతో హిట్స్ అందుకుంది. ఆ తర్వాత వ్యక్తిగత కారణాలతో కొద్దిరోజులుగా సినీ పరిశ్రమకు దూరం అయ్యింది. ప్రస్తుతం కొత్త ప్రాజెక్టుల కోసం ఎదురుచూస్తున్న ఈభామ.. సోషల్ మీడియాలో మాత్రం ఫ్యాన్స్‌తో టచ్‌లోనే ఉంటుంది. ఎప్పటికప్పుడు ఓ రేంజ్ లో అందాలు ఆరబోస్తూ అభిమానులను పలకరిస్తుంది. అయితే తాజాగా ఇండిగో విమాన సర్వీసుల రద్దుపై మెహ్రీన్ ఫైర్ అయ్యింది. ' ఇది ఏమాత్రం అంగీకారం కాదు. ప్యాసింజర్లు రోజుల తరబడి ఎయిర్ పోర్టుల్లో చిక్కుకుంటున్నరు. ఇదేదో చిన్న గ్లిచ్‌కాదు, నిర్లక్ష్యం. కొత్త డీజీసీఏ నిబంధనలు వచ్చినప్పుడే మీ షెడ్యూల్స్‌సరి చేసుకోవాల్సింది. కస్టమర్లను తప్పుదోవ పట్టించడం కాదు.. మీరు సృష్టించిన గందరగోళం దారుణమైనది. అసలేం జరుగుతోంది? బహిరంగంగా చెప్పండి.. మీ వల్ల ఇబ్బంది పడుతున్న వారికి పరిహారం చెల్లించండి' అంటూ డిమాండ్ చేసింది. కాగా.. 550 విమానాలను రద్దు చేయడంతో ప్రయాణికులు ఎయిర్‌పోర్టుల్లో నిరసనలు తెలుపుతున్న సంగతి తెలిసిందే.



## ఆగిన అఖండ 2

నందమూరి బాలకృష్ణ నటించిన అఖండ 2 సినిమా విడుదల వాయిదా పడింది. ఇవాళ రిలీజ్ కావాల్సిన మూవీని అనివార్య కారణాలతో పోస్ట్‌పోన్ చేస్తున్నట్లు నిర్మాణ సంస్థ 14 రీల్స్ ప్లస్ తెలిపింది. త్వరలోనే రిలీజ్ డేట్ ప్రకటిస్తామని ట్వీట్ చేసింది. బోయపాటి శ్రీను తెరకెక్కిన ఈ చిత్రాన్ని ఈనెల 5న ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనుకున్నారు. ఇందుకోసం ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక ప్రదర్శనలకు ఏర్పాట్లు చేశారు. అయితే ఆర్థికపరమైన విషయాల్లో సమస్యలు తలెత్తడంతో ప్రీమియర్ షోలన్నీ రద్దయ్యాయి. ఇవాళ విడుదల కావాల్సిన మూవీని కూడా వాయిదా వేస్తున్నట్లు మేకర్స్‌ప్రకటించారు. 'ఈ విషయం పట్ల మేము ఎంతగానో చింతిస్తున్నాం. ప్రతి ఒక్క సినీ అభిమాని నిరాశను మేము అర్థం చేసుకుంటాం. వీలైనంత త్వరగా ఈ సమస్య సాల్వ్ చేసేందుకు ట్రై చేస్తున్నం. ఈ నిర్ణయం పట్ల కలిగిన అసౌకర్యానికి హృదయపూర్వక క్షమాపణలు తెలియజేస్తున్నం. ఈ సమయంలో మీ మద్దతు మాకు చాలా అవసరం. అతి త్వరలో సానుకూల నిర్ణయంతో మీ ముందుకు వస్తం' అంటూ నిర్మాణ సంస్థ పోస్ట్‌చేసింది.




## అదిరిపోయే ట్రీట్


బాలీవుడ్‌బాద్‌షా షారుఖ్ ఖాన్, కాజోల్ జంటగా నటించిన 'దిల్‌వాలే దుల్హానియా లే జాయేంగే'(డీడీఎల్‌జే) భారతీయ సినిమా చరిత్రలో గొప్ప ప్రేమకథల్లో ఒకటిగా హృదయాలను గెలుచుకుంది. ముఖ్యంగా ఈ జంట కెమిస్ట్రీ మూవీలోని మరపురాని సంభాషణలు, అద్భుత సంగీతం డీడీఎల్‌జే ని కేవలం సినిమాగా కాకుండా ఒక గొప్ప అనుభూతిగా మార్చాయి. ఆదిత్య చోప్రా దర్శకత్వంలో అక్టోబర్ 20,1995లో విడుదలైన ఈమూవీ ఇప్పటికీ.. మహారాష్ట్రలోని మరాఠా మందిర్ థియేటర్ లో ఆడుతూనే ఉంది. కాగాఈ చిత్రం విడుదలై ఇటీవలే 30 ఏండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా వారికి అరుదైన గౌరవం దక్కింది. ఈ సినిమాలోని ప్రధాన పాత్రలైన రాజ్ (షారుఖ్ ఖాన్), సిమ్రాన్ (కాజోల్)ల కాంస్య విగ్రహాన్ని లండన్‌లోని ప్రఖ్యాత లీసెస్టర్ స్క్వేర్ లో ఏర్పాటుచేశారు. ఈ వేడుకకు ముఖ్య అతిథులుగా వచ్చిన షారుఖ్ ఖాన్, కాజోల్ తమ చేతుల మీదుగా ఈ విగ్రహాన్ని ఆవిష్కరించడమే కాకుండా తమ ఐకానిక్ పోజులతో వైరల్‌గా నిలిచారు. అనంతరం షారుఖ్ ఖాన్ తనదైన శైలిలో స్పందిస్తూ.. 'పెద్దపెద్ద దేశాల్లో ఇలాంటి చిన్న చిన్న విషయాలు జరుగుతూనే ఉంటాయి, సెనోరిటా!' అంటూ ఈ సినిమాలోని తన ఫేమస్ డైలాగ్‌తో అదరగొట్టాడు. మరోవైపు లండన్‌లోని 'సీన్స్ ఇన్ ది స్క్వేర్' ట్రైల్‌లో చోటు దక్కించుకున్న మొట్టమొదటి భారతీయ చిత్రంగా డీడీఎల్‌జే నిలిచింది.

# వాయు నాణ్యతను మెరుగు పరిచేందుకు కలిసికట్టుగా పని చేయాలి

**: అదనపు కమిషనర్ రఘు ప్రసాద్**



హైదరాబాద్, డిసెంబర్ 05 (భారత శక్తి): గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జాతీయ స్వచ్ఛ వాయు కార్యక్రమం కింద నగర స్థాయి మానిటరింగ్ అండ్ ఇంప్లిమెంటేషన్ కమిటీ సమావేశం శుక్రవారం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో అదనపు కమిషనర్ సి.ఎన్. రఘు ప్రసాద్ అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశంలో మూడు కమిషనరేట్ల ట్రాఫిక్ పోలీస్ అధికారులు (రాచకొండ, సైబరాబాద్, హైదరాబాద్), తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి, టీజీఎస్ ఆర్టీసీ, హెచ్ఎంఆర్ఎల్,సివిల్ సప్లైస్, ట్రాన్స్‌పోర్ట్ శాఖ,టీజీఐఐసీ, ఈపిటీఆర్ఐ,సీపీసీబీ సాంకేతిక నిపుణులు, జిహెచ్ఎంసి అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో నగరంలోని కాలుష్య హాట్ స్పాట్ల డేటా సమీక్ష, సిటీ యాక్షన్ ప్లాన్ పురోగతి పరిశీలన, సూక్ష్మ స్థాయి వ్యూహాలు, రోడ్డు ధూళి తగ్గింపు, వాహనాల ఉద్గారాల నియంత్రణ, పరిశ్రమల కాలుష్య నియంత్రణ, నిర్మాణ & కూల్చివేత వ్యర్థాల సమర్థ నిర్వహణ పచ్చదనం విస్తరణ ప్రధాన నిర్మాణ ప్రదేశాల్లో రియల్ టైమ్ మానిటరింగ్ వ్యవస్థలపై సమీక్ష నిర్వహించారు. అదనపు కమిషనర్ రఘు ప్రసాద్ మాట్లాడుతూ, వాయు నాణ్యతను మరింతగా మెరుగు పరిచేందుకు ప్రభుత్వ శాఖలు, విభాగాల మధ్య సమన్వయం, నిర్దేశిత చట్టాల అమలు అవసరమని పేర్కొన్నారు.టీఎస్ పీసీబీ శాస్త్రవేత్తలు డా. ప్రసాద్ దాసరి, శ్రీమతి ఎన్. జయశ్రీలు ప్రధాన హాట్ స్పాట్లలో తక్షణ, దీర్ఘకాలిక చర్యలు అవసరమని సూచించారు.ముఖ్యంగా పంజాగుట్ట పటాన్ చెరువు కారిడార్, చార్మినార్-నాంపల్లి హెరిటేజ్ జోన్, హైటెక్ సిటీ ట్రాన్సిట్ కారిడార్, ఎంజీబీఎస్ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్లలో పటిష్ట చర్యలు చేపట్టాలని చెప్పారు.వాయు కాలుష్యం తగ్గించేందుకు అధిక ట్రాఫిక్, అధిక కాలుష్య ప్రాంతాల్లో ఆర్టీసీ ద్వారా మరిన్ని ఎలక్ట్రిక్ బస్సుల ప్రవేశపెట్టడం, సంప్రదాయ ఆటో రిక్షాలను ఎలక్ట్రిక్ మూడు చక్ర వాహనాలతో భర్తీ చేయడం అన్ని వాహనాలకు తప్పనిసరి పియుసీ సర్టిఫికేట్, పాత వాహనాలపై కఠిన తనిఖీలు టెలికాం నగర్, ఇందిరమ్మ నగర్ వంటి కీలక ట్రాఫిక్ ప్రాంతాల్లో ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, పెలికాన్ సిగ్నల్స్ ఏర్పాటు, పౌరులు తమ నిర్మాణ వ్యర్థాలను జిహెచ్ఎంసి అధీకృత సంస్థలకు (రామ్‌కీ, సోమ శ్రీనివాస్ రెడ్డి) తక్కువ ధరలకు అప్పగించడం, రీసైకిల్ చేసిన నిర్మాణ పదార్థాల వినియోగం వంటివి చేపట్టాలని అన్నారు. ప్లాస్టిక్, ఇతర మున్సిపల్ వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో కాల్చడంపై కఠిన చర్యలు చేపట్టాలన్నారు. ఆధునిక స్వచ్ఛ గాలి సాంకేతికతలను అవలంబించాలని, ఎన్కాప్ కార్యక్రమాలను వేగంగా అమలు చేయాలని అధికారులు నిర్ణయించారు.పౌరులు తమ సీ&డి వ్యర్థాల తరలింపుకు సంప్రదించవలసిన టోల్ ఫ్రీ నంబర్లులో 1800 120 1159, 1800 203 0033 జిహెచ్ఎంసి వెబ్‌సైట్‌ను సందర్శించవలసిందిగా అధికారులు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.



## ముగిసిన హెచ్ఎండీఏ
# చారిత్రాత్మక వేలం పాట్ల సిరీస్

* **రూ. 3,862.8 కోట్లకు చేరిన మొత్తం ఆదాయం..**
* **హైదరాబాద్ రియల్ ఎస్టేట్ పెట్టుబడుల్లో అగ్రగామిగా ఎదిగిన వైనం..**

హైదరాబాద్, డిసెంబర్ 05 (భారత శక్తి): హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్మెంట్ అథారిటీ తన భూ వేలం పాట్ల తాజా దశను విజయవంతంగా పూర్తి చేసింది. మోనిటైజేషన్ కార్యక్రమంలో ఇది ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది. 1.98 ఎకరాల గోల్డెన్ మైల్ స్థలాన్ని సీఓఈయూఎస్ ఎడ్యుకేషన్ మేనేజ్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ ఒక్క ఎకరాకు రూ. 77.75 కోట్లకు పొందింది. ఈ స్థలం ప్రత్యేక ఆకారంలో ఉండటం ఈ ఫలితాన్ని మరింత ప్రత్యేకంగా నిలిపింది.ఈ ఫలితంతో, వేలంపాట్ల ద్వారా హెచ్ఎండీఏ మొత్తం ఆదాయం రూ. 3,862.8 కోట్లకు చేరింది. మెట్రోపాలిటన్ ప్రాంతంలో సముచిత స్థలాలకు ఉన్న బలమైన డిమాండ్‌ను ఇది స్పష్టం చేస్తోంది.హెచ్ఎండీఏ వేలం పాట్ల కార్యక్రమానికి ట్రాన్సాక్షన్ సలహాదారులుగా కుష్మాన్ అండ్ వేక్‌ఫీల్డ్, అలాగే ఏంఎస్టిసీ, ఈఆక్షన్ ప్లాట్‌ఫామ్ మద్దతు అందించాయి. మొత్తం సిరీస్‌లో పారదర్శక, పోటీ ప్రధాన, సమర్థవంతమైన బిడ్డింగ్ ప్రక్రియను వీరు నిర్ధారించారు. ఈ విజయవంతమైన ఫలితాలు హైదరాబాద్‌ను భారతదేశంలో అత్యంత ఆకర్షణీయమైన రియల్ ఎస్టేట్ పెట్టుబడి గమ్యస్థానాల్లో ఒకటిగా మరింత బలపరుస్తున్నాయి.

# సీనియర్ కళాకారునికి ఘన సన్మానం



నాగర్ కర్నూల్ జిల్లా (భారత శక్తి) డిసెంబర్ 5 : కళాకారుడు, కళామతల్లి సేవలో తరిస్తూ తన జీవిత సమస్యలను మరచి ఆత్మానందాన్ని పొందుతాడని శాసనమండలి సభ్యులు, ప్రజాకవి గోరేటి వెంకన్న అన్నారు. కందనూలు కళా సేవా సమితి వారి ఆధ్వర్యంలో ఘంటసాల 103వ జయంతి సందర్భంగా స్థానిక గాయనీ గాయకులచే ఘంటసాల గానలహరి అనంతరం సీనియర్ కళాకారుడు కస్ప కేశవాచారిని కళాసేవా ప్రపూర్ణ అనే బిరుదుతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1980 సంవత్సరం నుండి పౌరాణిక నాటకాలకు పునర్ వైభవం తీసుకురావడానికి కేశవాచారి తో కలిసి తను కృషి చేశానని, అనేక వ్యయప్రయాసాల కోర్చి టికెట్ తో ఆ కాలంలో నాటకాలు ప్రదర్శించామని, ఆ విషయంలో కేశవాచారి పాత్ర ఘణనీయమైనదని అన్నారు. నాటక ప్రదర్శించాలనే తపనే తప్ప కష్టనష్టాలు, కుటుంబ బాధ్యతలు ఆ సమయంలో మరిచి పోవడం, నాటకములో తమ పాత్రకు ప్రాక్టీసు చేయడం, ప్రదర్శించడం అదే కళాకారునిగా తమకు ఆత్మానందాన్ని ఇచ్చేదని అన్నారు. మిత్రుడు కేశవాచారి ఎంతోమంది పౌరాణిక నాటక గురువులకు ఆశ్రయమిచ్చి ఈ ప్రాంతంలో ఎందరో కళాకారులు తయారు కావడానికి కృషి చేశారని ఆనాటి మధుర స్మృతులను జ్ఞాపకం చేసుకున్నారు. అటువంటి కళాసేవకుని గుర్తించి కందనూలు కళా సేవా సమితి వారు కళాసేవా ప్రపూర్ణ బిరుదుతో సత్కరించడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో భాషా సాంస్కృతిక శాఖ మండలి సభ్యులు ముచ్చర్ల దినకర్, జిల్లా యువజన మరియు క్రీడా శాఖ అధికారి సీతారాం నాయక్, జిల్లా నాటక సమాజాల సమాఖ్య అధ్యక్షులు ఆర్. సత్యం, సీనియర్ కళాకారులు కందనూలు కళా సేవా సమితి వ్యవస్థాపక సభ్యులు కెందర్ల అరుణ్ కుమార్, డి రాములు, ఎస్.సురేష్ బాబు, సంస్థ అధ్యక్ష కార్యదర్శులు బి. నర్సింహారెడ్డి, జి.మురళీధర్ రావు, సభ్యులు, జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు పాండుచారి, జిల్లా స్వర్ణకారుల సంఘ అధ్యక్షులు నాగరాజుచారి, గాయని గాయకులు ఇద్రిష్, కృష్ణ, నర్సింహులు, శ్రీనివాసులు, చంద్రశేఖర్, టి.కె. చారి, సునందచారి, రమేష్, సరిత, ఉదయమ్మ, యాదమ్మ, వెంకట్రావమ్మ, కేశవాచారి కుటుంబ సభ్యులు, వివిధ కళా సంస్కృతిక సంఘ ప్రతినిధులు సంగీత అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# హైకోర్టుకు హాజరై క్షమాపణలు చెప్పిన హైడ్రా కమిషనర్ రంగనాథ్

హైదరాబాద్, డిసెంబర్ 05 (భారత శక్తి): హైడ్రా కమిషనర్ రంగనాథ్ గత నెల 27న జరిగిన విచారణకు హాజరు కాలేకపోయినందుకు తెలంగాణ రాష్ట్ర హైకోర్టుకు క్షమాపణలు తెలిపారు. తీవ్ర వరదలు సంభవించిన ప్రాంతానికి వెళ్లవలసి వచ్చినందున విచారణకు హాజరుకాలేకపోయానని ఆయన కోర్టుకు విన్నవించుకున్నారు. హైదరాబాద్ నగరంలోని బతుకమ్మ కుంట కేసు విచారణలో భాగంగా ఆయన ఈరోజు కోర్టుకు హాజరయ్యారు. ఈ కేసులో హైడ్రాపై ఎ. సుధాకర్ రెడ్డి అనే వ్యక్తి కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. ఈ క్రమంలో న్యాయస్థానం ఆదేశాల మేరకు రంగనాథ్ కోర్టుకు హాజరై క్షమాపణలు చెప్పారు. బతుకమ్మ కుంట పరిధిలోని ప్రైవేటు స్థలానికి సంబంధించి యథాతథ స్థితిని కొనసాగించాలని జూన్ 12న ఇచ్చిన ఉత్తర్వులను ఉల్లంఘించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై కోర్టు ధిక్కరణ కింద చర్యలు తీసుకోవాలని సుధాకర్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అక్టోబర్ 31న దీనిని విచారించిన హైకోర్టు, కోర్టు ధిక్కరణ చర్యలు ఎందుకు తీసుకోకూడదో నవంబర్ 27న వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాలని హైడ్రా కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేసింది. అయితే, బాచుపల్లిలో అత్యవసర పనులు ఉన్నందున విచారణకు ప్రత్యక్షంగా హాజరు కాలేకపోతున్నానని, హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ రంగనాథ్ మధ్యంతర పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై హైకోర్టు ధర్మాసనం నవంబర్ 27న విచారణ చేపట్టింది. అధికారిక విధుల కారణంగా మినహాయింపు కోరుతున్నారని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది కోర్టుకు తెలియజేశారు. అయితే హైకోర్టు తీవ్రంగా స్పందించింది. కోర్టు తలచుకుంటే ధిక్కరణను ఎదుర్కొంటున్న కమిషనర్‌ను ఉదయం నుంచి సాయంత్రం వరకు కోర్టులో నిలబెట్టగలదనే విషయాన్ని గుర్తుంచుకోవాలని పేర్కొంది. హాజరు మినహాయింపునకు నిరాకరిస్తూ మధ్యంతర పిటిషన్ కొట్టివేయడంతో, ఆయన ఈరోజు కోర్టుకు హాజరయ్యారు.



## గ్లోబల్ సమ్మిట్ కు
# డీసీఎం డికే శివ కుమార్ కు ఆహ్వానం

హైదరాబాద్, డిసెంబర్ 05 (భారత శక్తి): కర్ణాటక రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ను బెంగుళూరులో రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి మర్యాదపూర్వకంగా కలిసిన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి. డిసెంబర్ 8,9 వ తేదీల్లో ఫ్యూచర్ సిటీలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్లోబల్ సమ్మిట్ కి ప్రభుత్వం తరపున డీకే శివకుమార్ ను ఆహ్వానించడం జరిగింది.ఈ సందర్భంగా మల్ రెడ్డి రంగారెడ్డిని డీకే శివకుమార్ ఆప్యాయంగా పలకరించారు...తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న తాజా రాజకీయ పరిణామాలు, రాష్ట్ర అభివృద్ధి గురించి తెలుసుకోవడం జరిగింది. భవిష్యత్తులో ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డికి అన్నివిధాలుగా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.


## దేవాలయాల సంపద దేవుడిదే..
# బ్యాంకులకు వాడొద్దు: సుప్రీంకోర్టు సంచలన తీర్పు

* **గుడి డబ్బును సహకార బ్యాంకుల కోసం వాడరాదని ఆదేశం**
* **కేరళ హైకోర్టు తీర్పును సమర్థించిన సర్వోన్నత న్యాయస్థానం**
* **ప్రజల నమ్మకాన్ని బ్యాంకులు చూరగొనాలని జస్టిస్ సూర్యకాంత్ హితవు**



ఢిల్లీ, డిసెంబర్ 05 (భారత శక్తి): దేవాలయాల ఆస్తులు, సంపదకు సంబంధించి సుప్రీంకోర్టు శుక్రవారం ఒక సంచలన తీర్పు వెలువరించింది. ఆలయాల సంపద దేవుడికే చెందుతుందని, దాన్ని సహకార బ్యాంకుల మనుగడ కోసం వినియోగించరాదని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ విషయంలో కేరళ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థిస్తూ ఈ ఆదేశాలు జారీ చేసింది. దేవాలయానికి చెందిన డిపాజిట్లను తిరిగి చెల్లించాలని కేరళ హైకోర్టు ఆదేశించడాన్ని సవాలు చేస్తూ అక్కడి సహకార బ్యాంకులు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. ఈ పిటిషన్‌పై జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. విచారణ సందర్భంగా కేరళ హైకోర్టు తీర్పులో ఎలాంటి పొరపాటు లేదని ధర్మాసనం అభిప్రాయపడింది. ఈ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. “సహకార బ్యాంకులను కాపాడటానికి గుడి డబ్బును ఉపయోగిస్తారా? దేవుడి డబ్బు కేవలం ఆలయ ప్రయోజనాల కోసమే వాడాలి. అది బ్యాంకులకు ఆదాయ మార్గం కాకూడదు” అని ఆయన అన్నారు. కస్టమర్ల నుంచి డిపాజిట్లు రాబట్టుకోలేకపోవడం అనేది సహకార బ్యాంకుల సమస్య... అందుకు దేవుడి సొమ్మును వాడటం సరికాదని హితవు పలికారు. ప్రజల నుంచి నమ్మకాన్ని పొందడంలో బ్యాంకులు విఫలమైతే అది వాటి సమస్యేనని పేర్కొంటూ, సహకార బ్యాంకుల పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. దేవాలయాల డిపాజిట్లను తిరిగి ఇవ్వాల్సిందేనని స్పష్టం చేస్తూ కేరళ హైకోర్టు తీర్పును సమర్థించింది.

## సోషల్ మీడియా అంశంలో
# ప్రపంచ దేశాలు మమ్మల్ని అనుసరించాలి: ఆస్ట్రేలియా




ఆస్ట్రేలియా, డిసెంబర్ 05: 16 ఏళ్ల లోపు పిల్లలు సోషల్ మీడియాను ఉపయోగించకుండా ఆస్ట్రేలియా ప్రభుత్వం చట్టం తీసుకువచ్చింది. డిసెంబర్ 10వ తేదీ నుంచి దీనిని అమలు చేయనుంది. దీనితో గడువుకు ముందే ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ మొదలైన సోషల్ మీడియాల్లో అక్కడి పిల్లలను మెటా బ్లాక్ చేస్తోంది. తమ నిర్ణయంపై ఆస్ట్రేలియా ఇంటర్నెట్ రెగ్యులేటరీ స్పందిస్తూ, పిల్లలను సోషల్ మీడియా యాప్‌లకు దూరంగా ఉంచేందుకు తాము తీసుకుంటున్న చర్యలను ప్రపంచ దేశాలు అనుసరించాలని సూచించింది. పదహారేళ్ల లోపు పిల్లలను సోషల్ మీడియాకు దూరంగా ఉంచాలనే నిర్ణయం గురించి మొదట తాను ఆందోళన చెందానని, కానీ ఈ విధానాన్ని చాలామంది తల్లిదండ్రులు స్వాగతిస్తుండటంతో తన ఆలోచనను మార్చుకున్నానని ఇసేఫ్టీ కమిషనర్ జూలీ ఇన్మాన్ గ్రాంట్ పేర్కొన్నారు. దేశంలోని పిల్లలపై సోషల్ మీడియా బ్యాన్ విధించడాన్ని ప్రపంచ దేశాలు ఆసక్తిగా గమనిస్తున్నాయని, ఈ విషయంలో అన్ని దేశాలకు ఆస్ట్రేలియా ఉదాహరణగా నిలుస్తుందని అన్నారు. పిల్లల ఖాతాలను బ్లాక్ చేస్తున్న నేపథ్యంలో అందులోని వారి ఫొటోలు, ఇతర డేటాను డౌన్‌లోడ్ చేసుకోవాలని సోషల్ మీడియా సంస్థలు వారికి సూచిస్తున్నాయి. పదహారేళ్ల కన్నా తక్కువ వయస్సు ఉన్నవారు సోషల్ మీడియాను వాడకుండా నిషేధిస్తూ చేసిన చట్టం వల్ల వేలాదిమంది టీనేజర్ల సామాజిక మాధ్యమ ఖాతాలు ప్రభావితం కానున్నాయి. ఈ నిర్ణయంపై కొందరు న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని చెబుతున్నప్పటికీ, ప్రభుత్వం మాత్రం ఈ చట్టాన్ని అమలు చేస్తామని చెబుతోంది.

# గ్లోబల్ సమ్మిట్‌కు సీఎం చంద్రబాబును ఆహ్వానించిన తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి

అమరావతి, డిసెంబర్ 05 (భారత శక్తి): తెలంగాణ రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఈ సాయంత్రం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025'కు హాజరుకావాల్సిందిగా చంద్రబాబును ఆయన ఆహ్వానించారు. శుక్రవారం అమరావతిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో ఈ సమావేశం జరిగింది. డిసెంబర్ 8, 9 తేదీల్లో హైదరాబాద్ వేదికగా ఈ గ్లోబల్ సమ్మిట్‌ను నిర్వహించనున్నట్లు మంత్రి కోమటిరెడ్డి తెలిపారు. ఈ సదస్సును ప్రపంచ ప్రఖ్యాత దావోస్ సదస్సు తరహాలో నిర్వహిస్తున్నామని చంద్రబాబుకు వివరించారు. ఈ కార్యక్రమానికి ప్రపంచవ్యాప్తంగా పలు ప్రముఖ సంస్థల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, వివిధ రంగాలకు చెందిన నిపుణులు హాజరవుతున్నారని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం తరపున అధికారికంగా ఆహ్వానాన్ని అందించిన కోమటిరెడ్డి, సమ్మిట్ ప్రాధాన్యతను ముఖ్యమంత్రికి తెలియజేశారు.





## అన్ని కాలాలు మనకు అనుకూలంగా ఉండవు: సర్పంచ్‌లతో కేసీఆర్

ఢిల్లీ, డిసెంబర్ 05 (భారత శక్తి): అన్ని కాలాలు మనకు అనుకూలంగా ఉండవని, కొన్ని సమయాల్లో కష్టాలు వస్తాయని, వాటికి వెరవకూడదని తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. మళ్ళీ మన ప్రభుత్వం వస్తుందని, తెలంగాణ పల్లెలకు మంచి రోజులు వస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అప్పటిదాకా ప్రజలు అధైర్యపడవద్దని ఆయన భరోసా ఇచ్చారు. కొత్త సర్పంచ్‌లు గొప్ప ఆలోచనలతో తమ గ్రామాలను అభివద్ధి చేసుకునేందుకు ముందుకు సాగాలని సూచించారు. కేసీఆర్ దత్తత తీసుకున్న గజ్వేల్ నియోజకవర్గ పరిధిలోని ఎర్రవెల్లి, నర్సన్నపేట గ్రామాల నూతన సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు శుక్రవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. వారిని తన నివాసానికి సాదరంగా ఆహ్వానించిన కేసీఆర్, శాలువాతో సత్కరించి మిఠాయిలు పంచారు. ఈ రెండు గ్రామాల్లో సర్పంచ్, వార్డు మెంబర్లను గ్రామస్థులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ నేపథ్యంలో వారు అధినేతను కలిశారు. నూతనంగా ఎన్నికైన ఎర్రవెల్లి గ్రామ సర్పంచి నారన్నగారి కవితా రామ్మోహన్ రెడ్డి దంపతులు, గ్రామ ఉప సర్పంచ్ ఎడ్మ సబితా కరుణాకర్, వార్డు మెంబర్లు, నర్సన్నపేట గ్రామ సర్పంచ్ గిలక బాల నర్సయ్య, ఇరు గ్రామాలకు చెందిన ప్రముఖులు కేసీఆర్‌ను కలిసిన వారిలో ఉన్నారు. వారిని కేసీఆర్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణలోని గ్రామాలన్నీ స్వయం సమృద్ధి చెందాయని తెలిపారు. స్వయం పాలిత కేంద్రాలుగా, గ్రామీణ ఆర్థిక వ్యవస్థలుగా వర్ధిల్లాయని అన్నారు. దళిత, గిరిజన, బహుజన, మహిళా వర్గాలకు, కుల వృత్తులకు తాము అందించిన ప్రోత్సాహం, గ్రామీణాభివృద్ధికి అమలు చేసిన పథకాలు, పల్లె ప్రగతికి అందించిన ఆర్థిక సహకారం తెలంగాణ పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి తోడ్పాటు అందించాయని పేర్కొన్నారు. తాను ముఖ్యమంత్రిగా చేపట్టిన పాలనా సంస్కరణలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని అన్నారు.



## ద్వైపాక్షిక సహకారంపై మోదీ-పుతిన్ సంయుక్త ప్రకటన

ఢిల్లీ, డిసెంబర్ 05 (భారత శక్తి): భారత్, రష్యా మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న వ్యూహాత్మక బంధం మరో చారిత్రక మైలురాయిని చేరుకుంది. ఇరు దేశాల మధ్య వాణిజ్య, ఆర్థిక సంబంధాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లే లక్ష్యంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ శుక్రవారం కీలక ఒప్పందాలపై ఏకాభిప్రాయానికి వచ్చారు. 2030 వరకు ద్వైపాక్షిక వాణిజ్యాన్ని విస్తరించేందుకు ఉద్దేశించిన ఒక సమగ్ర ఆర్థిక సహకార కార్యక్రమానికి ఇరువురు నేతలు ఆమోదం తెలిపారు. ఈ చారిత్రక భేటీ అనంతరం ఇరువురు నేతలు సంయుక్తంగా మీడియా సమావేశంలో మాట్లాడారు.

*** అంబరాన్నంటే లక్ష్యాలు... కొత్త శిఖరాలకు వాణిజ్యం**

ఈ సమావేశంలో ఇరు దేశాలు అత్యంత ప్రతిష్ఠాత్మక లక్ష్యాలను నిర్దేశించుకున్నాయి. 2025 నాటికి పరస్పర పెట్టుబడులను 50 బిలియన్ డాలర్లకు, 2030 నాటికి వార్షిక ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 100 బిలియన్ డాలర్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ప్రధాని మోదీ వెల్లడించారు. ఈ లక్ష్య సాధనలో భాగంగా యురేషియన్ ఎకనామిక్ యూనియన్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని (FTA) వీలైనంత త్వరగా ముగించేందుకు ప్రయత్నిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ దీర్ఘకాలిక ఆర్థిక ప్రణాళిక, భారత్‌రష్యా మధ్య వాణిజ్య సంబంధాలకు ఒక స్పష్టమైన దిశానిర్దేశం చేస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

*** ఇంధనం నుంచి ఎరువుల వరకు... ఒప్పందాల వెల్లువ**

ఈ సమావేశంలో ఇరు దేశాల నేతల సమక్షంలో పలు కీలక రంగాల్లో అవగాహన ఒప్పందాలు (MoUs) జరిగాయి. ముఖ్యంగా, అభివృద్ధి చెందుతున్న భారత ఆర్థిక వ్యవస్థకు నిరంతరాయంగా ఇంధనాన్ని సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నామని అధ్యక్షుడు పుతిన్ హామీ ఇచ్చారు. ఇది భారతదేశ ఇంధన భద్రతకు ఎంతో కీలకమైన భరోసా. అదేవిధంగా, ఎరువుల రంగంలో ఒక పెద్ద ముందడుగు పడింది. రష్యాకు చెందిన ప్రముఖ సంస్థ 'యురాల్‌కెమ్' (URAL CHEM)తో భారతీయ కంపెనీలు కలిసి రష్యాలో ఒక యూరియా ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఇది ద్వైపాక్షిక పారిశ్రామిక సహకారంలో ఒక ముఖ్యమైన పరిణామం. దీనివల్ల భారత రైతాంగానికి ఎరువుల సరఫరా మెరుగుపడనుంది. వీటితో పాటు ఆహార భద్రత, నౌకాయాన శిక్షణ, వైద్య శాస్త్రాలు, వినియోగదారుల రక్షణ, పోర్టులు, షిప్పింగ్ రంగాల్లో సహకారాన్ని పెంపొందించుకునేందుకు కూడా ఒప్పందాలు జరిగాయి. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (FSSAI), రష్యాకు చెందిన వినియోగదారుల రక్షణ సంస్థ మధ్య కుదిరిన ఒప్పందం ఇరు దేశాల మధ్య ఆహార ఉత్పత్తుల వాణిజ్యానికి మరింత ఊతమిస్తుంది.

*** కాలపరీక్షకు నిలిచిన స్నేహం: ప్రధాని మోదీ**

ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ, ఇరు దేశాల సంబంధాలు అనేక చారిత్రక మైలురాళ్లను చేరుకుంటున్న తరుణంలో అధ్యక్షుడు పుతిన్ పర్యటన జరగడం సంతోషంగా ఉందన్నారు. "గత పదేళ్లలో ప్రపంచం ఎన్నో ఒడిదొడుకులను చూసింది. ఈ గందరగోళం మధ్య కూడా భారత్‌రష్యా స్నేహం కాలపరీక్షకు నిలిచింది. దాదాపు 25 ఏళ్ల క్రితం, అధ్యక్షుడు పుతిన్ మన వ్యూహాత్మక భాగస్వామ్యానికి పునాది వేశారు" అని మోదీ గుర్తుచేశారు. అంతర్జాతీయంగానూ సహకారాన్ని విస్తరిస్తూ, భారత్ నేతృత్వంలో ఏర్పాటైన 'ఇంటర్నేషనల్ బిగ్ క్యాట్ అలయన్స్' ఫ్రేమ్‌వర్క్ ఒప్పందంలో చేరేందుకు రష్యా అంగీకరించింది. ఇది పర్యావరణ పరిరక్షణలో ఇరు దేశాల ఉమ్మడి నిబద్ధతకు నిదర్శనం. మొత్తంగా ఈ భేటీ, కేవలం రక్షణ, ఇంధనం వంటి సంప్రదాయ రంగాలకే పరిమితం కాకుండా, ఆర్థిక, పారిశ్రామిక, పర్యావరణ రంగాల్లోనూ భారత్‌రష్యా బంధాన్ని కొత్త శిఖరాలకు

## వక్ఫ్ ఆస్తుల నమోదుకు గడువు పెంపు... స్వాగతించిన మంత్రి అజారుద్దీన్

హైదరాబాద్, డిసెంబర్ 05 (భారత శక్తి): దేశవ్యాప్తంగా వక్ఫ్ ఆస్తులను 'ఉమీద్' పోర్టల్‌లో నమోదు చేసేందుకు విధించిన గడువును పొడిగిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తెలంగాణ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ స్వాగతించారు. ఈ అదనపు సమయాన్ని సద్వినియోగం చేసుకొని, రిజిస్ట్రేషన్ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని రాష్ట్ర వక్ఫ్ బోర్డుకు, ముతావల్లీలకు (ఆస్తుల సంరక్షకులు) ఆయన పిలుపునిచ్చారు. కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ఈ విషయంపై కీలక ప్రకటన చేశారు. వక్ఫ్ ఆస్తుల నమోదుకు శుక్రవారంతో గడువు ముగిసినప్పటికీ, మరో మూడు నెలల పాటు ఎలాంటి జరిమానా విధించబోమని స్పష్టం చేశారు. ఈలోగా నమోదు చేసుకోలేని వారు తమ రాష్ట్రాల్లోని వక్ఫ్ ట్రైబ్యునళ్లను సంప్రదించవచ్చని సూచించారు. దేశవ్యాప్తంగా ఉన్న సుమారు 9 లక్షల వక్ఫ్ ఆస్తులకు గాను, ఇప్పటివరకు కేవలం 1.51 లక్షల ఆస్తులు మాత్రమే పోర్టల్‌లో నమోదయ్యాయని కేంద్ర మంత్రి తెలిపారు. గడువు పొడిగించాలని కోరుతూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత నెలలోనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాశారు. సాంకేతిక సమస్యలు, శతాబ్దాల నాటి రికార్డుల లభ్యతలో జాప్యం, ముతావల్లీలకు ఆన్‌లైన్ ప్రక్రియపై అవగాహన లేకపోవడం వంటి కారణాల వల్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ నెమ్మదిగా సాగుతోందని ఆయన ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. అన్ని ఆస్తుల వివరాలను కచ్చితత్వంతో, పారదర్శకంగా నమోదు చేసేందుకు కనీసం ఏడాది పాటు గడువు పొడిగించాలని కోరారు. "వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు, పారదర్శకతను బలోపేతం చేయడానికి ఈ గడువు పొడిగింపు చాలా ముఖ్యం. దీనివల్ల తెలంగాణ ప్రజలకు ఈ సంస్థల ద్వారా అందే సేవలు, మద్దతు నిరంతరాయంగా కొనసాగుతాయి" అని మంత్రి అజారుద్దీన్ 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు.

## ప్రైవేట్ కంటే ప్రభుత్వ స్కూళ్లల్లోని టీచర్లే బెస్ట్

అమరావతి, డిసెంబర్ 05 (భారత శక్తి): ప్రైవేట్ పాఠశాలలతో పోలిస్తే ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులపై ఉపాధ్యాయులు ఎక్కువ శ్రద్ధ చూపే అవకాశం ఉందని, ప్రభుత్వ టీచర్లే ఉత్తమమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ప్రభుత్వ బడుల్లో ఉపాధ్యాయవిద్యార్థి నిష్పత్తి మెరుగ్గా ఉందని, ప్రతి 18 మంది విద్యార్థులకు ఒక టీచర్ అందుబాటులో ఉండగా, ప్రైవేట్ పాఠశాలల్లో 25 మందికి ఒకరే ఉన్నారని ఆయన గణాంకాలతో సహా వివరించారు. పార్వతీపురం మన్యం జిల్లా, భామినిలోని ఏపీ మోడల్ హైస్కూల్‌లో నిర్వహించిన "మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ 3.0" కార్యక్రమంలో పాల్గొన్న సీఎం, రాష్ట్ర విద్యా వ్యవస్థను పటిష్టం చేసేందుకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, "గత ప్రభుత్వం ఉపాధ్యాయులను అవమానించింది, మద్యం షాపుల వద్ద డ్యూటీలు వేసింది. కానీ మా ప్రభుత్వం టీచర్లకు గౌరవం ఇస్తుంది. మెగా డీఎస్సీ ద్వారా వేలాది ఉపాధ్యాయులను నియమించాం. పారదర్శకంగా బదిలీలు చేపట్టాం. టీచర్లను గౌరవించే బాధ్యత మాది, పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులది," అని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకోవాలని అందరూ కోరుకునే పరిస్థితిని తీసుకొస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

**'కలలకు రెక్కలు'.. విదేశీ విద్యకు భరోసా**

రాష్ట్రంలోని విద్యార్థులు ఉన్నత, విదేశీ విద్యకు దూరమవ్వకూడదనే లక్ష్యంతో 'కలలకు రెక్కలు' అనే సరికొత్త పథకాన్ని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఈ పథకం కింద విదేశాల్లో చదువుకోవాలనుకునే విద్యార్థులకు అయ్యే ఖర్చు మొత్తాన్ని పావలా వడ్డీకే రుణంగా అందిస్తామని హామీ ఇచ్చారు. ఉన్నత చదువుల కోసం విద్యార్థులు తమ ఆశయాలను చంపుకోవాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో రాబోయే మూడేళ్లలో ఆంధ్రప్రదేశ్ విద్యా విధానానికి దేశంలోనే ప్రథమ స్థానం దక్కేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా, విద్యాశాఖను సమర్థంగా నిర్వహిస్తున్నారంటూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ను చంద్రబాబు అభినందించారు.

*** ఆవిష్కరణలకు పెద్దపీట.. ఇన్నోవేటర్స్ సమ్మిట్**

విద్యార్థుల్లో సృజనాత్మకతను, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు వచ్చే ఏడాది జనవరిలో "స్టూడెంట్స్ ఇన్నోవేటర్స్ పార్టనర్‌షిప్ సమ్మిట్" నిర్వహిస్తామని సీఎం ప్రకటించారు. ఏడో తరగతి నుంచే విద్యార్థులను వినూత్నంగా ఆలోచించేలా తీర్చిదిద్దుతామని, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో వారి ప్రతిభను గుర్తించి పారిశ్రామికవేత్తలతో సమావేశమయ్యే అవకాశం కల్పిస్తామని చెప్పారు. భామిని మోడల్ స్కూల్‌లోని ల్యాబ్స్‌ను పరిశీలించిన ఆయన, 'క్లిక్కర్ టూల్' ద్వారా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేసే విధానాన్ని ప్రశంసించారు. 'స్కై, మౌంటెన్, స్టీమ్'గా విద్యార్థులను వర్గీకరించి, వారి బలాబలాలకు అనుగుణంగా బోధన చేయడం మంచి ఫలితాలనిస్తుందన్నారు.

*** విలువలతో కూడిన విద్య.. సంపూర్ణ వికాసం**

చదువుతో పాటు విద్యార్థుల్లో నైతిక విలువలను పెంపొందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం తెలిపారు. ఇందులో భాగంగానే చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాలను విద్యార్థులకు అందిస్తున్నామని చెప్పారు. నాణ్యమైన మధ్యాహ్న భోజనం కోసం 'డొక్కా సీతమ్మ' పథకాన్ని, రాజకీయ రంగులు లేని స్టూడెంట్ కిట్లను అందిస్తున్నామని గుర్తుచేశారు. శనివారం 'నో బ్యాగ్ డే' వంటి కార్యక్రమాలతో విద్యార్థులు కష్టంగా కాకుండా ఇష్టంగా చదువుకునే వాతావరణం కల్పిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, స్థానిక ఎమ్మెల్యే, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## పాన్ మసాలాపై కొత్త సెస్సు.. బిల్లుకు లోక్ సభ ఆమోదం

ఢిల్లీ, డిసెంబర్ 05 (భారత శక్తి): పాన్ మసాలా తయారీ యూనిట్లపై సెస్సు విధిస్తూ, తద్వారా వచ్చే నిధులను జాతీయ భద్రతను బలోపేతం చేయడానికి, ప్రజారోగ్యాన్ని మెరుగుపరచడానికి వినియోగించాలని ప్రతిపాదించే 'హెల్త్ సెక్యూరిటీ సే నేషనల్ సెక్యూరిటీ సెస్సు బిల్లు 2025'ను లోక్‌సభ శుక్రవారం ఆమోదించింది. పాన్ మసాలా కంపెనీలపై సెస్సును ప్రతిపాదిస్తూ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లుపై జరిగిన చర్చకు సమాధానమిస్తూ, ప్రజారోగ్యం రాష్ట్రాల పరిధిలోని అంశం కాబట్టి, సెస్సు ద్వారా వచ్చే నిధులను రాష్ట్రాలతో పంచుకుంటామని ఆమె స్పష్టం చేశారు.



ఈ సెస్సు ద్వారా సమకూరిన నిధులను జాతీయ భద్రత, ప్రజారోగ్యానికి వినియోగించనున్నట్లు తెలిపారు. పార్లమెంటు దిగువ సభలో ఈ బిల్లును మూజువాణి ఓటు ద్వారా ఆమోదించారు. పాన్ మసాలా, ఈ తరహా ఉత్పత్తులను తయారు చేసే యూనిట్లకు ఈ సెస్సు వర్తిస్తుంది. జాతీయ ఆరోగ్యం, జాతీయ భద్రత వంటి అంశాలకు ఈ నిధులను వినియోగిస్తామని ఆర్థిక మంత్రి వెల్లడించారు. ప్రస్తుతం పాన్ మసాలాపై జీఎస్టీ గరిష్ఠ శ్లాబు అయిన 40 శాతం విధిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ సెస్సు వల్ల జీఎస్టీ రాబడిపై ఎలాంటి ప్రభావం ఉండదని స్పష్టం చేశారు. తయారీ సామర్థ్యం ఆధారంగా ఈ సెస్సును విధిస్తామని పేర్కొన్నారు. 201014 మధ్య సెస్సుల రూపంలో ప్రభుత్వానికి వచ్చిన ఆదాయం 7 శాతంగా ఉండగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆ మొత్తం 6.1 శాతానికి తగ్గినట్లు ఆమె వెల్లడించారు.

## నర్సంపేటలో రూ.532 కోట్లతో అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన

నర్సంపేట, డిసెంబర్ 05 (భారత శక్తి): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గంలో పర్యటించి, అభివృద్ధి పనులపై వరాల జల్లు కురిపించారు. ఈరోజు ఆయన రూ.532.24 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేసిన పనులలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, రూ.130 కోట్లతో ప్రభుత్వ వైద్య కళాశాల, రూ.26 కోట్లతో నర్సింగ్ కాలేజీ, పలు రోడ్ల విస్తరణ పనులు ఉన్నాయి. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. "పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ నేతలు ఫాంహౌస్‌లు కట్టుకున్నారు, విమానాలు కొన్నారు కానీ, ఉద్యమగడ్డ వరంగల్‌కు ఏమీ చేయలేదు. వారు ఆస్తులు సంపాదించుకున్నారు తప్ప ఈ ప్రాంత అభివృద్ధిని గాలికొదిలేశారు" అని ఆయన మండిపడ్డారు. తమ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటోందని రేవంత్ రెడ్డి తెలిపారు. రైతు రుణమాఫీని విజయవంతంగా పూర్తి చేశామని, రాష్ట్రవ్యాప్తంగా 3 కోట్ల 10 లక్షల మందికి సన్న బియ్యం అందిస్తున్నామని చెప్పారు. డబుల్ బెడ్ రూం ఇళ్ల పేరుతో కేసీఆర్ పేదలను మోసం చేశారని, తాము పేదల ఆత్మగౌరవం నిలబెట్టేందుకు 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇస్తున్నామని హామీ ఇచ్చారు. హైదరాబాద్‌కు దీటుగా వరంగల్‌ను అభివృద్ధి చేస్తామని సీఎం స్పష్టం చేశారు. మార్చి 31 లోగా వరంగల్‌లో ఎయిర్‌పోర్ట్‌ను ప్రారంభిస్తామని, ఔటర్ రింగ్ రోడ్డు, అండర్ డ్రైనేజీ వ్యవస్థను కూడా నిర్మిస్తామని ప్రకటించారు.

# బడంగ్ పేట్ ను ప్రత్యేక జోన్ గా ఏర్పాటు చేయాలి

**: చిగిరింత పారిజాత రెడ్డి**

హైదరాబాద్, డిసెంబర్ 05 (భారత శక్తి): హైదరాబాద్ లోని జిహెచ్ఎంసీ కార్యాలయంలో కమిషనర్ ఆర్వీ కర్ణన్ ను కలిసి బడంగ్ పేట్ ను ప్రత్యేక జోన్ గా ఏర్పాటు చేయాలని కోరుతూ లేఖను అందజేసిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి. అదేవిధంగా సచివాలయంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కార్యాలయంలో, మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రామకృష్ణకి బడంగ్ పేట్ ప్రత్యేక జోన్ ఏర్పాటు కోరుతూ లేఖను అందజేశారు. ఈ సందర్భంగా మాజీ మేయర్ మాట్లాడుతూ, ప్రతిపక్షాలు ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నాయని, ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలు చేసే కార్యక్రమాలు



చేపడుతున్నారని అన్నారు. పరిపాలన సౌలభ్యం కోసం తాత్కాలికంగా కేటాయించిన ప్రభుత్వ చర్యలను స్థానిక ఎమ్మెల్యే, బీజేపీ నాయకులు అవగాహనరాహిత్యంతో ప్రజల్లో ఆందోళన కలిగించేలా రెచ్చగొడుతున్నారని అన్నారు. ఒక్కరోజులోనే స్థానిక ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడినట్లు, మున్సిపాలిటీలు మార్చుతున్నట్లు వారు ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. ప్రజలు ఎవరూ ఆందోళన చెందవద్దని త్వరలోనే డివిజన్ల ఏర్పాటు, సర్కిళ్ల ఏర్పాటు, ఓటర్ల గణన చేపట్టి అప్పుడు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని అనుకుంటున్నట్లు తెలిపారు. కానీ మేము కూడా ప్రభుత్వంలో భాగంగా ఉన్నప్పటికీ జీహెచ్ఎంసీలో కలపబడిన మీర్ పేట్, జల్ పల్లి, తుక్కుగూడ, ఆదిభట్ల, తుర్కయంజాల్ మున్సిపాలిటీలను అన్ని కలిసి బడంగ్ పేట్ జోన్ గా ఏర్పాటు చేయాలని ఈ బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లో అన్ని సౌకర్యాలు ఉన్నాయని అన్ని మున్సిపాలిటీలకు కేంద్రంగా ఉంటుందని ప్రజలకు రవాణా సౌకర్యంతో పాటు అన్ని వసతులు ఇప్పటికే ఉన్నాయి కాబట్టి ప్రత్యేక జోన్ గా ఏర్పాటు చేయాలని ప్రభుత్వ పెద్దలను తాము కోరుతున్నట్లు లేఖను అందజేయడం జరిగిందని అన్నారు. ఇప్పటికైనా బీజేపీ పార్టీ ప్రజలలో వైషమ్యాలు కలిగించడం మానుకోవాలని హితవు పలికారు. బిఆర్ఎస్ పార్టీ మాత్రం రోజుకో మాటలతో ప్రజలను అయోమానికి గురిచేయడం మానుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి డైరెక్టర్ పన్నాల రాజేందర్ రెడ్డి, ఏఐసీసీ విచార్ విభాగ్ కోఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటి డైరెక్టర్ బొర్రా జగన్ రెడ్డి, నాయకులు దిండు శ్రీనివాస్ గౌడ్, మైనార్టీ చైర్మన్ అఫ్జల్, గిరి ముదిరాజ్, జగన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## జేబీ కాలనీ సమస్యలను పరిశీలించిన కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి

ఎల్ బీ నగర్, డిసెంబర్ 05 (భారత శక్తి): మహేశ్వరం నియోజకవర్గం సరూర్ నగర్ డివిజన్ జింకల బావి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో కలిసి శుక్రవారం డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి కాలనీలోని వీధులను సందర్శించి శానిటేషన్, ఇంజినీరింగ్, జలమండలి విభాగాలకు సంబంధించిన వివిధ సమస్యలను, కావలసిన సదుపాయాల గూర్చి పరిశీలించారు. సంబంధిత జిహెచ్ఎంసి శానిటేషన్, ఇంజనీరింగ్, జలమండలి విభాగాల సిబ్బంది బృందాలకు సమస్యలను వివరించి, తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు మిట్టపల్లి నర్సింహారెడ్డి, కబీర్ దాస్, రవీందర్ రెడ్డి, మాధవ రెడ్డి, కేబుల్ వెంకటేశ్వర్లు, వి వెంకటేష్, ఎం. వెంకటేశ్వర్ రావు, రామ సాయి, సూరపల్లి శ్రీనివాస్, దక్షిణామూర్తి, సుబ్రహ్మణ్యం తదితర కాలనీవాసులు పాల్గొన్నారు.

## తలకొండపల్లి రిపోర్టర్ రాజేందర్ గుండెపోటుతో మృతి

*** నివాళులర్పించిన టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య**

రంగారెడ్డి,డిసెంబర్ 05 (భారత శక్తి): రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం మెట్రో ఈవినింగ్ దినపత్రిక రిపోర్టర్ తకేలపల్లి రాజేందర్ శుక్రవారం ఉదయం గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. ఆయన వయసు 42 సంవత్సరాలు. రాజేందర్ కు భార్య, ముగ్గురు చిన్నపిల్లలు.గత ఏడేండ్లుగా రిపోర్టర్ గా పనిచేస్తున్న రాజేందర్ కు శుక్రవారం తెల్లవారుజామున గుండెనొప్పి రావడంతో చికిత్స కోసం కల్వకుర్తిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి



తరలించారు. చికిత్స పొందుతూ కొద్దిసేపటికే మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజెఎఫ్) రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య, కో కన్వీనర్ పులిపలుపుల ఆనందం, రంగారెడ్డి జిల్లా టిడబ్ల్యుజేఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మిద్దెల సత్యనారాయణ తదితరులు రాజేందర్ స్వగ్రామం గట్టు ఇప్పలపల్లి గ్రామంలోని ఆయన ఇంటికి వెళ్ళి రాజేందర్ భౌతిక కాయాన్ని సందర్శించి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య మాట్లాడుతూ, ఈ మధ్యకాలంలో అనారోగ్య సమస్యలతో అనేకమంది జర్నలిస్టులు పిట్టల్లా రాలిపోతున్నారని, అయినా కూడా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు జర్నలిస్టుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని అన్నారు. జర్నలిస్టులకు హెల్త్ కార్డులు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల జర్నలిస్టులకు వైద్యం అందక చనిపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి కార్పొరేట్ ప్రైవేటు ఆసుపత్రిలో జర్నలిస్టులకు హెల్త్ కార్డులు అమలు చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, రాజేందర్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మామిడి సోమయ్య డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఆమనగల్ బ్లాక్ అధ్యక్షులు దరువుల శంకర్ కార్యదర్శి తిరుపతి సభ్యులు సహాయ కార్యదర్శి తూర్పు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## మహా ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి మొద్దు లచ్చిరెడ్డి

ఎల్బీనగర్, డిసెంబర్ 05 (భారత శక్తి): బి.ఎన్. రెడ్డి నగర్ డివిజన్ భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో బిజెపి పార్టీ డివిజన్ అధ్యక్షులు విష్ణువర్ధన్ రావు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో బి.యన్. రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షురాలు నందికొండ గీతారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, డిసెంబర్ 7వ తారీఖున ఇందిరాపార్క్ వద్ద జరగబోయే మహా ధర్నా కార్యక్రమానికి డివిజన్ పరిధిలోని పార్టీ పతాధికారులు, మోర్చాల అధ్యక్షులు, డివిజన్ కమిటీ సభ్యులు, శక్తి కేంద్రం ఇంచార్జ్ లు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అందరూ భారీ ఎత్తున హాజరై మహా ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రఘురాం నేత,




శంకరయ్య గౌడ్, భూపాల్ రెడ్డి, శ్రీధర్ రావు, ప్రేమ్ నాథ్, జైపాల్ రెడ్డి, రవిశంకర్, మహేష్ గౌడ్, నందకిషోర్, చిత్రంజన్, శ్రీనివాస్ శర్మ, వెంకట్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, మహిళా నాయకురాలు దేవిక, నాయకులు మహేందర్ రెడ్డి, కాంతారావు, ప్రభాకర్ యాదవ్, రాజేంద్రప్రసాద్, నరసింహారెడ్డి, గోపి, రమేష్, మధుసూదన్ రెడ్డి, శ్రీనివాసరావు, కిషోర్, మురళి, విజయ్, సురేష్ కుమార్, భాను, శివకుమార్, సంజీవ, ఠాగూర్ తదితరులు ఉన్నారు.



## గ్లోబల్ సమ్మిట్ బందోబస్తు పై రివ్యూ

*** ఏర్పాట్లను పరిశీలించిన డీజీపీ శివధర్ రెడ్డి**

రంగారెడ్డి జిల్లా, డిసెంబర్ 05 (భారత శక్తి): రంగారెడ్డి జిల్లా కందుకూర్ మండలం ఫ్యూచర్ సిటీలో నిర్వహించే గ్లోబల్ సమ్మిట్ కు సంబంధించి భద్రతా ఏర్పాట్లు, బందోబస్త్ మీద వివిధ డిపార్ట్మెంట్ అధికారులతో తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. శుక్రవారం డీజీపీ శివధర్ రెడ్డి అడిషనల్ డీజీపీలు మహేష్ భగవత్, డీఎస్ చౌహాన్, ఫైర్ డీజీ విక్రమ్ సింగ్ మాన్, టీజీ ఐఐసి ఎండీ శశాంక్, ఐజి రమేష్ రెడ్డిలతో కలిసి రివ్యూ నిర్వహించారు. అనంతరం శివధర్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గ్లోబల్ సమ్మిట్ కు అన్ని రకాల ఏర్పాట్లు జరుగుతున్నాయి. దీనికి సుమారు 3 వేల మంది జాతీయ, అంతర్జాతీయ ప్రముఖులు రానున్నారు.ఈ డెలిగేట్లకు 8, 9 తేదీల్లో మాత్రమే అనుమతి ఉంటుందని గుర్తు చేశారు. ఆ తర్వాత నాలుగు రోజులు మాత్రం కామన్ పబ్లిక్ కి అనుమతి ఉంటుందని అన్నారు.లా అండ్ ఆర్డర్ కి సంబంధించిన స్టాల్స్ ఏర్పాట్లను దగ్గరుండి చూసుకున్నాం. వీఐపీ ప్రతినిధుల చుట్టూ మూడంచెల భద్రత ఉంటుంది. గ్లోబల్ సమ్మిట్ జరిగే ప్రాంతంలో అడుగడుగునా నిఘా పెట్టేందుకు సుమారు వెయ్యికి పైగా సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇవన్నీ సెంట్రల్ పోలీసు కంట్రోల్ రూమ్కు అనుసంధానమై ఉంటాయి. రేపు సాయంత్రం లోపు అన్ని ఏర్పాట్లు పూర్తవుతాయనీ ఆయన అన్నారు.బందోబస్త్ విషయంలో ఏ మాత్రం పొరపాటు చేయవద్దని, అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆయన అధికారులకు సూచించారు. తెలంగాణ ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్థాయిలో ఈ సమ్మిట్ నిర్వహిస్తునందున కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు.ఈ సమ్మిట్ కి కావాల్సిన సదుపాయాలపై, బేరక్స్, మెస్, కిచెన్, మరుగుదొడ్లవంటి మౌలిక సదుపాయల గురించి అధికారులతో చర్చించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం సుమారు వెయ్యి మంది ట్రాఫిక్ పోలీసులను నియమించనున్నారు. రహదారుల మళ్లింపు, బారికేడ్ల ఏర్పాటు, వాహనాల పార్కింగ్ నిర్వహణ వంటి వాటి కోసం ట్రాఫిక్ మార్షల్స్ నియమించుకోనున్నారు. ఎలాంటి ట్రాఫిక్ అంతరాయం, ఇబ్బందులు జరగకుండా ఆయా మార్గాలను పటిష్టమైన పోలీసు బందోబస్తు ఉంటుంది. సాధారణ ప్రజలు, వాహనదారులకు రెండు రోజుల పాటు ఆయా మార్గాలలో రహదారుల మళ్లింపులు ఉంటాయి.


## రూపాయి క్షీణతను అదుపు చేయలేని అసమర్థత కేంద్ర ప్రభుత్వం

*** తీవ్ర విమర్శలు చేసిన కప్పాటి పాండురంగారెడ్డి..**

హైదరాబాద్, డిసెంబర్ 05 (భారత శక్తి): తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి ఒక పత్రికా ప్రకటన విడుదల చేస్తూ, రూపాయి పతనంలో రికార్డుల మీద రికార్డులను బద్దలు కొడుతుంటే ప్రజల జేబులకు చిల్లు పడుతుంటే కేంద్రంలోని బిజెపి సర్కార్ మాటా పలుకూ లేకుండా గుడ్లప్పగించి చూస్తున్నది. వాజ్‌పాయి పాలనలో 2000 సంవత్సరంలో రూపాయి విలువ 43.35 ఉంది. అది మన్మోహన్ సింగ్ అధికారానికి వచ్చిన 2004లో 45.10, మోడీ పదవీ స్వీకారంచేసిన 2014లో 62.33గా ఉంది. ఇప్పుడు .85 90 దగ్గర ఉంది. 1947లో స్వాతంత్ర్యం వచ్చినపుడు రూపాయి విలువ డాలరుకు 3.30 ఉంది.రూపాయి విలువ పతనమౌతుంటే గతంలో ముఖ్యమంత్రిగా నరేంద్రమోడీ ఉన్న



సమయంలో' కేంద్రంలో యుపిఎ అధికారంలో కొనసాగుతున్నప్పుడు ప్రభుత్వం గురించి మోడి ఏమన్నారంటే ఆర్థికం లేదా రూపాయి విలువ పతనం గురించి ప్రభుత్వానికి ఎలాంటి చింత లేదు, తన కుర్చీని ఎలా కాపాడుకోవాలన్నదే మోడీ ఏకైక ఆందోళన అన్నారు.ఈ కారణంగా దేశం ఈ రోజు ఆశాభంగం చెందింది. గత కొన్ని మాసాలుగా పతనం అవుతున్న రూపాయిని నిలబెట్టేందుకు ప్రభుత్వం ఏ చర్యా తీసుకోలేక పోతుంది. ఇలా పతనం అవుతుంటే ఇతర దేశాలు దాన్ని అవకాశంగా తీసుకుంటాయి. అయ్యా మోడి మరి నేడు జరుగుతున్నది ఏమిటి.? గతంలో రూపాయి ప్రాణం తీస్తున్నారని గగ్గోలు పెట్టిన మీరు నేడు చేస్తున్నదేమిటి. రూపాయి పతనం కొందరికి మోదం ఎందరికో ఖేదాన్ని తెస్తుంది. ఎగుమతులు చేసే వారికి, విదేశాల నుంచి మనదేశానికి డబ్బులు పంపేవారికి సంతోషం కలిగిస్తే, విదేశాల నుంచి దిగుమతి చేసుకొనే వస్తువుల భారంతో కోట్లాది సామాన్యుల జేబులు గుల్ల అవుతున్నాయి. రూపాయి పతనం వలన లబ్ది కంటే మనకు నష్టమే ఎక్కువ. ద్రవ్యోల్బణం, దాంతో ధరల పెరుగుదలకు దారితీస్తుంది. దీని వలన కొనుగోలు శక్తి తగ్గుతుంది. చమురు దిగుమతి బిల్లు పెరిగి అందరి మీదా భారం పెరుగుతుంది. విదేశాల నుంచి రుణాలు పొందిన కంపెనీల మీద భారం పెరుగుతుంది, పరోక్షంగా పెట్టుబడుల మీద కూడా ప్రతికూల ప్రభావం పడుతుందని పాండురంగారెడ్డి వాపోయారు...



మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్ పేట్ లో నూతనంగా ఏర్పాటు చేసిన ది గోల్డెన్ అవర్ బ్యాంకెట్ హాల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి. ఈ కార్యక్రమంలో పన్నాల రాజేందర్ రెడ్డి, బోయపల్లి రాఘవేందర్ రెడ్డి, గట్టు బాలకృష్ణ, దిండు శ్రీనివాస్ గౌడ్, బొల్లపల్లి కుమార్, పెద్దబావి బాబు, గిరి ముదిరాజ్, జగన్ గౌడ్, శైలేష్ తదితరులు పాల్గొన్నారు.

బడంగ్ పేట్, డిసెంబర్ 05 (భారత శక్తి ):

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.